ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక



7-8-57

ANDHRA PATRIKA

ILLUSTRATED WEEKLY



ప్రార్థన

ఫొటో. ఎస్. శ్రీనివాసన్—మద్రాసు

*




లంగరు దించిన పడవలు
ఫొటో వి. శి. కు. — కర్యాలు.

Regd. No. M. 4479.

ఒక భీమా ఏజెంటు డైరీనుండి

వారు నగరాన్ని విడిచి పారి పోయారు...



"రంగూనుపై బాంబులు పడటం ప్రారంభమయింది ఇక నేను త్వరగా కదలాలని నాకు తెలుసు నాదృష్ట నౌక హోటల్ వ్యాపారం వైపు మరల్చి నిద్రావస్థలో ఉన్నవాడి లాగా పశ్చిమ దిక్కుగా నాప్రయాణ యాత్ర సాగించాను

"**1942** మే లో నేను కలకత్తా చేరుకున్నాను దిగ్ర్భమతో ఒంటరిగా చేతిలో దమ్మిడీ లేకుండా ఆఖరు ప్రయత్నంగా నాకు దగ్గరలో వున్న ఇన్స్యూరెన్సు ఆఫీసుకు చేరుకున్నాను, కొంత డబ్బు ఎవిధంగానైనా పుట్టించాలనే ప్రయత్నంతో రంగూన్ బ్రాంచిలో నేను పెద్ద పోలసీలు తీసుకున్నట్లుగా వివరించి చెప్పాను దురదృష్టవశాత్తు దీన్ని రుజువు చేయడానికి నావద్ద సరియైన కాగితాలేవీ లేవు

"నాకు రంగూన్‌లో తెలిసిన ఒక ఆఫీసర్ నన్ను గుర్తుపట్టాడు దాంతో నాకు చెప్పనలవికాని ఉపశమనం దొరికింది ఆయన యింకా ఆఫీసు సహాయంతోనూ నా యిన్స్యూరెన్సు క్లెయిమ్ చేయడానికి వీలు కలిగింది నిజం చెప్పాలంటే నేనింకా **40,000** రూల వరకు అప్పుకూడా తీసుకోగల్గాను

' ఆ అప్పు ఒక దీవెన అందంగా అలంకరించబడివున్న తన ఆఫీసు గదిని కలయ చూస్తూ అన్నాడు అహూజా దానితో దేశంలో మంచి వాటిల్లో ఒకటైన యిదే హోటల్‌ను తిరిగి మళ్లి క్రొత్తదిగా కట్టించాను జీవిత భీమాకు నేను ఎంతో కృతజ్ఞుణ్ణి తర్వాత నా వైపుకు వంగుతూ యిలా అన్నాడు అందుకే నిన్ను యీరోజు రమ్మన్నాను నాకు యింకో పోలసీ కావాలి

ఏజంటుగా నేను జీవిత భీమా ఫలితాలను తరచుగా చూస్తుంటాను కాని ఎవిధంగా ఎల్లో అది చేస్తున్న ప్రజా సేవకు ఎల్లప్పుడూ ఆశ్చర్యపోతూ వుంటాను

• ఇందులో చేర్చబడిన వ్యక్తుల ఆత్మగౌరవ సంరక్షణకై, యీ పేర్లు కల్పితమే కాని యీ కథ మాత్రం నిజమైనది

లైఫ్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా

ASP/LIC/17

సంవత్సర చందా
రు. 13—0—0
విడిపత్రిక 25 న.పై.

ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక

Founder: K. NAGESWARA RAO

సంపుటము 51
సంచిక 49
7-8-57

హేవిళంబి శ్రావణం, శుద్ధ ద్వాదశి, బుధవారం

విషయానుక్రమణిక

ముఖచిత్రం!
మా ఆపిస్నా.

న్యూఢిల్లీ ప్రతినిధి

తిరుమల్ ఘరీ సాంకేతిక పాఠశాల

రక్షణశాఖ డిప్యూటీ మంత్రి శ్రీ కొత్త రఘురామయ్య ఇటీవల దక్షిణ భారత దేశంలో పర్యటించి నప్పుడు అనేక రక్షణ సంస్థలను వారు స్వయంగా సందర్శించడం జరిగింది. ఆయా సంస్థలలో జరిగిన వివిధ సాంకేతిక ప్రదర్శనలనూ వారు బహు శ్రద్ధా సక్తులతో పరిశీలించారు. వీటిలో కల్లా చెప్పుకోదగిన ప్రదర్శనం తిరుమల్ ఘరీలోని సైనిక సాంకేతిక పాఠశాలలో జరిగింది. రక్షణ శాఖ డిప్యూటీమంత్రి చూసిన వింతలలో ఏ డ్రైవరూ లేకుండానే ఒక జీపుకారు దానంతటదే వేగంగా పాఠశాల విశాల ఆవరణాన్ని చుట్టి రావడం ఒకటి. డ్రైవర్ లేకుండానే జీపు ఎలా నడవగలిగిందా అని ఆశ్చర్య పడతారేమో! ఎక్కడో దూరాన రహస్యంగా వున్న మీట నొక్కితే చాలు ఆ జీపుకారు దానంతటదే నడుస్తుంది! జీపులో పాఠశాల చూడవచ్చిన పెద్దలు, తదితరులు మాత్రమే కూర్చుని వుంటారు.


యుద్ధ సమయంలో శత్రువులు అనేకచోట్ల మందుగుండుగనులు మాటుపెట్టి ఎదటిపక్షానికి సాధ్యమైనంత హాని కలిగించాలనీ, అది ముందుకు సాగిరాకుండా చేయాలనీ చూస్తుంటారు. ఈ మందుగుండు గనులన్నిటినీ బహుజాగ్రత్తగా ముందుగా తొలగించివేస్తేనేగాని సైన్యం ముందుకు నడవదు. ఈ మందుగనులను తుడిచేయడానికి ఒక రకం టాంకులను ఉపయోగిస్తారు. ఈ టాంకులు ఎలా పనిచేసేవో డిప్యూటిరక్షణమంత్రికి తిరుమల్ ఘరీ పాఠశాల నిర్వాహకులు ప్రత్యక్షంగా చూపించారు. వీటితోపాటు 90 గజాల కైవారంలోవున్న ప్రతి వస్తువునూ ధ్వంసీభూతం చేసివేయడానికి వీలైనజ్వాలా ప్రయోగయంత్రాలను ప్రయోగించి చూపించారు. ఏడున్నర సెంటిమీటర్ల వ్యాసం గల హోవిట్జర్ ఫిరంగిని పాఠశాలలో శిక్షణ పొందేవారు ఏముక్కకాముక్క విప్పి వేసి, రెండే రెండు నిమిషాలలో యథాప్రకారం బిగించి అమర్చివేయడం చూసి శ్రీ రఘురామయ్య ఆశ్చర్య పడ్డారు.

* * *

రెండో ప్రపంచ యుద్ధ సమయంలో మన ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజనీర్లకందరికీ కావలసిన శిక్షణను మొత్తం తొమ్మిది కేంద్రాలలో ఆ నాటి విదేశీ పాలకులు ఇచ్చి తరిఫీదు చేసుకున్నారు. వీటిలో కొన్నింటిని కలిపివేసి 1946 లో ఒకే ఒక సమగ్ర సైనిక ఇంజనీరింగ్ పాఠశాలగా రూపొందించారు. కిర్కీ, అహమ్మద్ నగర్, క్వెట్టా, ఆగ్రాలలో వుంటూ వచ్చిన నాలుగే ఇవి. ఈ పాఠశాల సైన్యంలో పనిచేసేవారి ఉన్నత సాంకేతిక శిక్షణాభ్యాసానికి చక్కగా ఉపయోగపడుతున్నది. ఈ సైనిక సాంకేతిక శిక్షణాలయం మొదట కిర్కీలోనే ఏర్పాటైంది. 1946 మొదలు 1952 వరకూ అక్కడే వున్నది. 1953 లో సికిందరాబాదులోని ప్రస్తుత స్థానానికి మార్చారు.

మొబైల్ ఇంజనీరింగ్ యంత్రాగారాలకు సంబంధించిన వాహనాలను మరమ్మతు చేయడంలోనూ, ఆయుధాలు, ఆయుధపరికరాలు, రాడార్లు, వైర్‌లెస్‌లు బాగుచేయడంలోనూ ఆఫీసర్లకు ఉన్నతస్థాయి శిక్షణ ఇవ్వడమే ఈ పాఠశాలకర్తవ్యం. ఆఫీసర్లకు టెక్నికల్ రిఫ్రెషర్ కోర్సు తరగతులు కూడా నడుపుతుంది. సైనిక ఇంజనీరింగ్ దళాలకు యుద్ధ, శాంతిసమయాలకవసరమైన పరిపాలనా వ్యవహారాల నిర్వహణలో కూడా తరిఫీదు ఇస్తుంది.

ఇంజనీరింగ్ శిక్షణకు కావలసిన ఇన్‌స్ట్రక్టర్లను కూడా తయారుచేస్తుంది. సైనిక ప్రధాన కార్యాలయ అవసరాలకు కావలసిన సిబ్బందిని తయారుచేస్తుంది. సాంకేతిక యుద్ధ వ్యూహావసరాలదృష్ట్యా ఇతర ప్రపంచం ఏవిధంగా నూతన పరిశోధనలను, పరిణామాలను సాధిస్తున్నది గమనించి, వాటిని మన సైన్యంలో పనిచేసే సైనిక ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజనీర్లకు అవసరమైనంతవరకు వ్యక్త పరుస్తుంటుంది. సైనిక ప్రధాన కార్యాలయం ఆర్డరిచ్చే యంత్రాలను, పరికరాలను, నూతన ప్రయోగానికి అవసరమైన పనిముట్లను కూడా సమకూరుస్తుంది ఈ విధంగా తిరుమల్ ఘరీ సైనిక ఎలక్ట్రికల్, మెకానికల్ పాఠశాల దేశ క్షేమానికీ, పురోభివృద్ధికీ ఎంతో సహాయపడుతున్నది. ★



యంత్రనిర్మాణంలో నిమగ్నులైవున్న శ్రీ రామచంద్రరావు

కొత్తరకం తెలుగు టైప్‌రైటర్

[వార్కీ చెరియన్]

అమెరికా సమాచార కార్యాలయంలో ఉద్యోగం చేస్తున్న శ్రీ మద్దాలి రాఘవ రామచంద్రరావు తన తీరిక సమయాలలో జరిపిన పరిశోధనల ఫలితంగా తెలుగు టైపు మిషన్‌లో, అక్షరాల రూపంలో మార్పు లేకుండానే శీఘ్రంగా, సులువుగా పనిచేసే అతి ముఖ్యమైన మార్పులు కొన్నిటిని ప్రవేశ పెట్టగలిగారు

శ్రీ రామచంద్రరావు పదిసంవత్సరాలుగా ఈ విషయంలో కృషిచేస్తున్నారు ఇప్పుడు శ్రీ రామచంద్రరావు తయారుచేసిన ఈ కొత్త టైపు యంత్రంవల్ల టైపు చేసే కాలంలో 30 శాతం కలిసివస్తుంది అంటే ప్రస్తుతం వాడుకలో ఉన్న యంత్రంమీద 100 నిమిషాలలో చేసే పనిని ఈ కొత్త యంత్రంమీద 70 నిమిషాలలో చేయవచ్చును ఈ కొత్త యంత్రానికి శ్రీ రామచంద్రరావు కేంద్రప్రభుత్వంనుంచి పేటెంటును పొందారు మద్రాసులో ఒక కంపెనీ వారు ఈ యంత్రాన్ని వ్యాపార నిమిత్తం తయారుచేయించే ప్రయత్నంలో ఉన్నారు

శ్రీ రామచంద్రరావు 36 సంవత్సరాల యువకుడు శ్రీ రామచంద్రరావు మైలాపూరులో తాను ఉంటున్న మిద్దెమీద ఒక గదిలో ఉన్న తన లేబరేటరీకి ఈ రచయితను తీసుకువెళ్ళి తన కొత్త టైపుయంత్రాన్ని చూపించాడు

ప్రతిరోజూ ఆఫీసునుంచి ఇంటికి వెళ్ళగానే శ్రీ రావుకి ఇక ఇదే పని సెలవు రోజుల్లో సరేసరి ఎలెక్ట్రిక్ సోల్డరింగ్ హేండిల్ (టైపులు అతికే సాధనం) ప్లయర్లు, (శ్రాణాలు), మరికొన్ని ఇటువంటి చేతి పనిముట్లు పెట్టుకుని కూర్చుంటాడు అక్షరాల కొత్త అమరికలు కూర్చటానికి అదే పనిగా పరిశోధిస్తుంటాడు

'తలకట్టు' ఉన్న హల్లు అక్షరాలన్నిటినీ ఇదివరకటిలాగా తలకట్టు ఒకసారి, తక్కిన భాగాన్ని ఒకసారి విడివిడిగా కొట్టే పని లేకుండా పూర్తి అక్షరాలే ఈ యంత్రంలో ఉన్నాయి శ్రీ రావు కొత్త యంత్రంలో ప్రవేశపెట్టిన ముఖ్యమైన ఉపయోగకరమైన మార్పు ఇది ఈ తలకట్టుగల అక్షరాలు టైపుచేసే ప్రతి సందర్భంలోనూ సగటున నూటికి దాదాపు 40 సార్లు వస్తుంటాయి అంటే తెలుగులో టైపుచేసే ప్రతి 100

అక్షరాలలోనూ సగటున 40 అక్షరాలు ఈ తలకట్టువే ఉంటాయి. కనుక ఈ మార్పు వల్ల తెలుగు టైపు చేయటంలో ఎంతో కాలం కలిసివస్తుంది.

ఈ కొత్త యంత్రంలో అన్ని హల్లు అక్షరాలు, కొన్ని అచ్చు గుర్తులు, (దీర్ఘం ఒత్వం మొదలైనవి) 'లైవ్ కీ' మీద ఉంటాయి. కొన్ని అచ్చుగుర్తులు మాత్రం 'డెడ్ కీ' మీద ఉంటాయి. (అక్షరం మీట నొక్కగానే కాగితం పెట్టె క్యారేజి కదిలేదాన్ని 'లైవ్ కీ' అని, కదలకుండా ఉండే దాన్ని 'డెడ్ కీ' అనీ అంటారు) ఇదివరకు యంత్రంలో 'డెడ్ కీలు' 20 ఉండగా ఈ కొత్త యంత్రంలో అవి 9 మాత్రమే ఉన్నాయి. టైపుచేసినప్పుడు అచ్చుగుర్తులు హల్లులకు ఎక్కడ అంటాలో అక్కడే సరిగ్గా అంటే విధంగా కీబోర్డు తయారుచేసిన యంత్రం ఇది. ఈ కొత్త యంత్రంమీద టైపు చేసే సందర్భంలో క్యారేజీని వెనక్కు నడపవలసిన పనే ఉండదు. ఇప్పుడు వాడుకలో ఉన్న మిషన్లో కాగితంమీద ఒకవరుస అక్షరాలు టైపు చేసేలోపల కనీసం నాలుగుసార్లు అయినా వెనక్కు నడపడం (బ్యాక్ స్పేసింగ్) అవసరమవుతుంది. కనుక కొత్త యంత్రంలో ఇది మరొక ముఖ్యమైనమార్పు.

ఈ కొత్త యంత్రంలో 'డిగ్రీషిఫ్ట్' అనే మరొక కొత్త సౌకర్యం ఏర్పాటు చేశారు. దీనిని ఒక్క తెలుగుయంత్రానికేగాక, దక్షిణాదిభాషలలో మలయాళం, కన్నడ భాషల టైపుయంత్రాలలోకూడా ఏర్పాటు చేయవచ్చును. ఈ పద్ధతివల్ల సంయుక్తాక్షరాలను, చేతితో సిలిండర్ (కాగితం చుట్టుకునే భాగం)ను త్రిప్పవలసిన పని లేకుండానే పైఅక్షరాన్ని దానిక్రింద వచ్చే ఒత్తునూ టైపుచేయవచ్చును: అంటే తలకట్టు మినహా 'గ, ద, డ' అక్షరాలూ, అదేరూపం గల '్గ, ్ద, ్డ' వత్తు అక్షరాలు విడివిడిగా ఏర్పాటుచేయ నక్కరలేదు. ఈ 'డిగ్రీషిఫ్ట్' నొక్కి తలకట్టు మినహాయించిన అక్షరాన్ని కొట్టి, తరువాత ప్రధాన అక్షరం కొడితే కేరేజ్ వెనక్కు నడిపే పనిలేకుండానే 'గ్గ, ద్ద' వగైరా కొన్ని అక్షరాలు టైపు చేయవచ్చును.

ఇట్లా కొన్ని అక్షరాలు తగ్గించ గలిగినందున ప్రభుత్వ, వ్యాపార విషయాలు టైపు చేసుకోవటంలో అవసరమయ్యే పంక్చుయేషన్ల (విరామపు గుర్తులు, శాతపు గుర్తులు వగైరా)ను ఈ కొత్త యంత్రంలో అదనంగా చేర్చటానికి వీలైంది.

అయితే ఇప్పటికి తయారైన ఈ యంత్రంతో శ్రీ రావు తృప్తిపడలేదు. పరిశోధకులకు ఇది సహజమే. తెలుగు టైపు యం

([illegible]-వ పేజీ చూడండి)

జీవితాదర్శం

ఒకరు : బాబూ! బోదన బోయే బండి ఎప్పుడు వస్తుందండి?

మరొకరు : తెలియదండి.

ఒక : మీ రేవూరు వెళ్లాలండి?

మరొ : మీరు వెళ్లే బండిలోనే వెళ్లాలి

ఒక : అయితే మనబండెప్పుడువస్తుందో తెలుసుకో లేదటండీ?

మరొ : ఎంత ఆలస్యమయినా తప్పక వస్తుంది.

ఒక : అవుననుకోండి. త్వరగా వెళ్లవలసిన వాళ్లం. ప్రయాణం ఒక్కటే కాదుగా మన కున్న పని.

మరొ : మనకు పనులు లేని దెప్పుడులెండి. పుట్టిన దగ్గరనుండి పనులు చేస్తూనే ఉన్నాం. చచ్చేటప్పుడూ ఏదో పనితోనే చస్తాం.

ఒక : నిజమేననుకోండి. అయినా ఏ నిమిషాని కొపనులు చేయకతప్పదు. వాటి కంతే విటిలెండి.

మరొ : అదే అజ్ఞానం. పనులు కాదు అనంతం. మనలోతృష్ణలు. తృష్ణలోనే పుడు తున్నాం...ఆ తృష్ణే మనల్ని చంపుతోంది కూడా.

ఒక : మా తాతకూడా చిన్నప్పు డిట్లాగే అంటుండేవాడు. మా తాత అంటే పుచ్చ కాయల రంగయ్య అని మావూరు కేటు జాచినా ఆమడ లెక్క ఆయనపేరు వినని వారులేరు. ఆయన పేరేలెండి నాపేరు కూడాను. అయితే ఆయనెక్కడలెండి పరమ భాగవతుడు.. ఆఁ.. ఇంతకూ మద దేవూరన్నారు?

మరొ : అందరిలాగా నేనూ ఒక ఊరిలో పుట్టాను, అందరూ ఒకే ఊరిలో పుట్టలేరు కనుక.

రంగయ్యా : అహాఁహాఁ...మాట వరస కడుగుతాను.

మరొ : అన్ని ఊళ్లలాంటిదే లెండి జంగారం.

రం : అంటే కావలిదగ్గర జంగారమే నటండి?

మరొ : ఆఁ

రం : అసలు స్వగ్రామం జంగారం కావ నుకుంటాను.

మరొ ! స్వగ్రామమే నండి.

రం : అయితే మిమ్మలెప్పుడూ చూచి నట్టు లేదండీ? ఆ ఊరిలో మీ దేవరి తాలూకు అంటారు?

మరొ : మీకు తెలియకపోవచ్చు.

పాత్రలు :

సచ్చిదానందం
రంగయ్య
గురవయ్య
ప్రసాదు
గోపి
సమతారావు
పిన్ను లమ్ముకునేవాడు
భిక్షుగాడు.

స్థలం : రైల్వే వెయిటింగ్ రూమ్.

రం : అయ్యో, నాకు తెలియకపోవట మేమిటండీ. మా తాతలనుండి జంగారమే కదండి మాకాణాచి. విధివలన బోదనకు వచ్చానుకాని, నిజానికి జంగారంలో నాకు తెలియని చింతమాను మాత్రం ఉందటండీ?

మరొ : డాబా పరంధామయ్యగారి పెరు గుదురూ?

రం : తెలియకపోవట మేమిటి? ఒకకులం కాకపోయినా అన్నదమ్ముల్లాగా తిరిగే వాళ్లం. ఆఁ...వారికేం కావాలి మీరు?

మరొ : వారి పెద్దకుమారుణ్ని—

రం : ఏదీ దేశాలమీద పోయాడని అను కుంటున్నాం. సుబ్బరామయ్యేనా మీ పేరు?

మరొ . ఒకప్పు డాపేరే ననుకోండి...

రం : వోర వోర...నివ్వేనటరా సుబ్బ రామయ్యా! మరీ అవతారమేమిటి? ఈ కాషాయగుడ్డలేమిటి, పావుకోళ్ళక్కడియ్యా, సన్యాసిలాగా ఆ దండమేమిటి... నేనురా...రంగయ్యని...గుర్తుకురాలేదూ?.

సుబ్బరామయ్య. ఇందాకే ఊరుపేరడగ గానే మిమ్మల్ని గుర్తించాను.

రం: తెలిసికొనేనా ఈ నాటకమంతా! నే నేమంటానో వినాలని ఊరుకున్నావా? ఊఁ.. బాగానే ఆడించావు. అది సరేగాని ఈ వేషమేమిటోయ్? సన్యాసుల్లో కలిసిపోలేదు గదా కర్మ. కొంటి సుబ్బరామయ్య లాగా ఏమీ కన్పించటంలేదు.

సుబ్బ: ఇప్పుడు సుబ్బరామయ్యను కాదుగామరి.

రం: అంటే?

సుబ్బ: నాపేరిప్పుడు సచ్చిదానందం. పాతజీవితాన్ని ఏనాడయితేమార్చుకున్నానో ఆనాడే పేరుకూడా మార్చుకున్నాను.

రం: అంటే సన్యాసుల్లో పూర్తిగాకలిసి పోయినట్టేనా ఏమిటి?

సచ్చిదానందం: ఏనాడో ఐహిక సంబంధాల్ని పరిత్యజించాను. ఈమార్పుఅవసరమే. అసలు మానవుడెప్పుడూ మారుతూనే ఉంటాడు. ఉదాహరణకు, మీరుమాత్రం మారలేదూ? పూర్వం నేను చూచినప్పటి కంటె ఇప్పుడు వేషంలో భావలో చూపులో అన్నిటిలో మార్పువచ్చింది. కాదంటారా?

రం: నేనేమి మారానురా? అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడూ ఈరంగయ్య ఒక్కటిగానే ఉన్నాడు. కాకపోతే అదివరకు రంగడుఅని పిలిచేవారు, ఇప్పుడు'రంగయ్యా' అని అంటున్నారు! అంతే.

సచ్చి: పేరు మారినట్టే మీ జీవితంకూడా మారినట్టు కన్పిస్తోంది. కొత్త ఉన్నతస్థితిలోకి అడుగుపెట్టినట్టున్నారు. చెప్పండి. ఈ మార్పుకు కారణం ఏమిటంటారు?

రం: అదో పెద్దకథ.

సచ్చి: మననుండి పుట్టిందేకదండి కథ గూడా. మనకంటే కథలు ఎప్పుడూ పెద్దవి కావు, చెప్పండి.

రం: ఆకష్టాలన్నీ చెప్పాలంటే రోజులు చాలవు.

సచ్చి: కాని జరిగిందిమాత్రం, ఏ కొద్ది రోజుల్లోనో అయివుంటుంది.

రం. కొద్దిరోజులేమిటి? ఏళ్లు చాలక పోతేనూ. కొద్దిలో చెప్పాలంటే, పదేళ్ల క్రితం జంగారంలో కరువువచ్చింది. రెక్కాడితేగాని డొక్కాడని నాబోటి అభాగ్యులంతా, పొట్ట చేతబట్టుకొని తలా ఒక దేశం పోయాం. నేను బోదనలో వచ్చిపడ్డాను. అక్కడపడ్డపాట్లు చెప్పటానికలవి కావు. అయినా నాకష్టాలు ఫలించినై. గవర్నమెంటువారిబీళ్లు సేద్యం చేసుకోటానికి వీలయింది. దానిమీద దానిమీద ప్రస్తుతం ఓ యాభైఎకరాలు సంపాదించాను.

సచ్చి: యాభైయకరాలే!

రం. ఆఁ...నాదేం అనుకోవాల్సి నంత

మిత్రా



కాదులే అక్కడున్న రైతుల్తో నన్ను పోల్చుకుంటే నాది ఒక నలుసుమాత్రమే.

సచ్చి అంటే ఇంకా సంపాదించాలనే మీ ఆశ.

రం నాకోసం అని నేనంటే నీవన్నట్లు నా కొరకే ఉందనుకోవాలి. కడుపుతీపితో ఇలా చేస్తున్నా. నాకు మూడు మగకాయలు కాసినై నీకు తెలియనిదేముంది. ముగ్గురికి మూడు పాతికెకరాలు రావాలంటే మరో పాతికెకరాలు సంపాదించాలిగామరి పాతికెకరాలన్నా లేనిదే ఈ రోజుల్లో గౌరవంగా బ్రతకడం కష్టం.

సచ్చి బ్రతుకుకూ గౌరవానికి ఎప్పుడూ బద్ధవైరం. ఆరెంటకీ ముడిపెడితే ఏదీ సరిగా ఉండదు అయినా యాభై ఎకరాలంటే త్రోసివేయాల్సింది కాదే?

రం: మిగిలిన పాతికెకరాలు కూడా సంపాదించటమంటే సామాన్యంకాదు ఇంతవరకూ చేసినకృషి ఒకఎత్తు, ఈ పాతికెకరాల కృషి ఒక ఎత్తు దీనికోసం అని ఎన్నితిప్పలు పడుతున్నా, సఫలమయితే నా జీవితాశయం పూర్తయినట్టే.

సచ్చి. ఏమిటే? మీ జీవితాశయం పాతికెకరాలు సంపాయించటమేనా?

రం ఈ కాస్తా సంపాయిస్తే తరువాత నేనెప్పుడు కన్నుమూసినా వాళ్ళకేచింతా ఉండదు.. మరి నీ విషయాలు చెప్పావు కాదు. ఎక్కడినుంచి రావటం?

(భిక్షుగాడు ప్రవేశం)

భిక్షు. బాబూ ఒక బీడీ ముంటే ఇవ్వరూ?

రం. వెళ్లు. వెళ్లు... ఎక్కణ్నుంచన్నావు?

సచ్చి. జంగారంనుంచే వస్తున్నా.

రం అక్కడినుంచేనా! నాన్నేమన్నాడేవిటి?

సచ్చి' మొదట వన్నింటిదగ్గరే ఉంచాలని విశ్వప్రయత్నాలు చేశారు.

రం. తరువాతేమయిందేవిటి?

సచ్చి' నా నిర్ణయాన్నెవ్వరూ మార్చలేరని తెలుసుకున్నాక ఆ ప్రయత్నం మానుకున్నారు.

రం. అంటే మళ్లా దేశాలమీదకు ఉడాయించటమేనా నీవనేది. కనిపెంచినంగుకు మంచి పనే చేస్తున్నావు నీడపట్టున కళ్లెదుట కూర్చోమనటం కూడా పొరపాటేనా?

సచ్చి: మిమ్మల్నందరిని చాల కష్టపెడుతున్నాను. క్షమించండి. సంసారపుసారం తెలిసికూడా ఇంకా ఆ మాయలో ఉండలేను. జననమరణ ప్రవాహంలోపడి ఇంకా మాస్తూ బాధపడలేను. ఉత్తభ్రమగా ఉన్న ప్రపంచాన్ని ఏవిధంగా నిజమని పోసవో మంటారు?

రం: మా ధోరణికందేటట్టు లేదు. సరే. ఇంతకూ ఇప్పుడెక్కడికి పోవటం?

సచ్చి: నా జీవితాదర్శాన్ని సాఫల్యం చేసుకోటానికి

రం. అంటే?

సచ్చి: హృషీకేశం వెళ్తున్నాను.

రం. ఎందుకూ?

సచ్చి. ఈ సంవత్సరంతో నా దీర్ఘకాల తపస్సు ఫలిస్తుంది గురుదేవులు నాకు తప్పక తరుణోపాయం చూపిస్తారు

రం: ఏమి తరుణోపాయమో వల్లకాదు తరుణోపాయం, ఇక నీ పంథా మార్చుకునే ఉద్దేశ్యమేమీ లేదంటావు. అంతేనా?

సచ్చి. చెప్పాను గదండీ తెలుసుకొని మళ్లా అజ్ఞానంలో పడలేను.

రం: పోనీ నీవన్నట్టే అదేదోపాయం సంసారంచేస్తూ మాసుకోగూడదూ? ముగ్గురు సానుల్ని పోషిస్తున్న లాతయ్యగారి పాపయ్యకన్నా పెద్ద పాయాలు నీకున్న

జీవితా దర్శం

శ్యేమిటి? సంసారం ఒకవేపు చేస్తూనూ ఉన్నాడు, లక్షణంగా, పూజలు పునస్కారాలూ సకాలంలో నడిపిస్తూనూ ఉన్నాడు. అదికాన్నా మనం ఎక్కువేంట్రా. హాయిగా తింటూ ఏపాయాలన్నా చూసుకోవచ్చు. ఉన్నది వదులుకొని ఇట్లా ఏదో ఉద్దేశానికి నిలబడే బుద్ధి తక్కువవాణ్ణి మా కులంలో నే నెవ్వరినీ చూడలా.

సచ్చి : ప్రత్యక్షంగా నేను కన్పిస్తుంటే ఎవ్వరూ లేరంటా రేమిటి?

భి : బాబూ! ఒక బీడి ముక్కఉంటే ఈయండి బాబూ.

రం : వెళ్లమని ఇంతకుముందుగదూ నీకు చెప్పింది.

భి : ఎవరి నడిగినా అట్టానే అంటున్నారండి.

రం : అనక అల్లుడివి వచ్చావని మర్యాద చేయాలా ఏమిటి?

భి : బీడీ లేయకు నేవాడికి అంత గౌరవ మెందుకు బాబూ.

రం :- ఏమిట్రా అంటావూ?

సచ్చి :- వాడితో ఏమిటి పోనిద్దురూ.

రం :- చూడరా వాడిమాటలు! నేను వాణ్ణి గౌరవిస్తున్నానట.

సచ్చి :- పోనిద్దురూ వాడి కర్మన వాడే పోతాడు.

[మరొకరు ప్రవేశం]

మరొ :- రంగయ్యగారేనా అక్కడ కూర్చుంది?

రం :- గురవయ్యగారా! రండి రండి కూర్చోండి. ఎక్కడికి వెళ్తున్నారు?

గు :- నేను హైద్రాబాదు వెళ్లాలండి. మా రెండోవాణ్నరగరూ చిన్న ముత్యాలు, వాడికి కాలేజిలో సీటు విషయమై, మాట్లాడి వద్దామని బయల్దేరాను. పీటిదుంప తెగ ఈ బళ్లకింత పొగరేమండీ? ఒక వేళా లేదు, పాళా లేదు వాటిష్టమొచ్చినప్పుడు రావటం, మామూలుగా ఆగేసేపుకూడా ఆగకుండా లేటయిందని గబగబా పరుగెత్తటం. మాబోటి వ్యాపారస్తులమంతా వీటితో చస్తున్నామనుకోండి.

సచ్చి :- అక్కడే పొరపాటు పడుతున్నారు. రైళ్లతో మనం చావటం లేదు. మనం లేందే రైళ్లకు ప్రాణమేం ఉంటుందీ. ఇవన్నీ మనం సృజించుకున్నవే! అంటే మనతో మనమే చస్తున్నాం.

గు : వీ రెవరండీ?

రం :- ఈయన పేరు సుబ్బరామయ్య?...

సచ్చి :- కాదు. సచ్చిదానందం.

రం :- ఓహో పేరు మార్చుకున్నా

కన్నావు కదూ ... ఈయన ఇల్లూ వాకిలి అన్నీ ఉండికూడా వాటిని వదులుకున్న సన్యాసిగారు మామూలు 'అడియేం దాసుల' బాపతు గాదు...

గు :- వారి ముఖారవిందం చూస్తుంటూనే కనపడతా ఉన్నది ఆ కళ.

రం :- కళకూడా కన్పిస్తా వుంది మీకు. మరి నాకళ్లేం పాపంజేసుకున్నాయోగాని, అటువంటిదేమీ నాకు కన్పించటంలేదే!

స :- మహనీయుల్లాగా కన్పిస్తా ఉండారు. మహనీయులిక్కి జ్యోతిషం బాగా తెలిసి వుంటుంది. నాకొక సందేహం ఉంది. దాన్ని తీరుస్తారేమో నని...

రం :- అందుకా ఆయన ముఖంలో మీకు కళకన్పించింది. సరే అడగండి, ఆ సందేహ మేమిటో.

గు :- నువ్వుండవయ్యా కాస్త.......

సచ్చి :- మహనీయుడంటే మీ సందేహాలు తీర్చే జ్యోతిషం నేర్చుకొని ఉండాలన్న మాట. ఆశలున్న వారికి అన్నీ సందేహాలే అశాంతి, అసంతృప్తి వారి జీవితంలో ప్రధానంగా ఉంటయ్. మీకో సందేహం ఉందంటే దానివెనుక ఒక బలీయమైన ఆశఉన్న దన్నమాటే...

గు :- మీరు సామాన్యులుగా కన్పించటం లేదు. అడగకుండానే నాకో ఆశ ఉందని తేల్చివేశారు. మీబోటివారు ఇతరుల మనస్సుల్లో ఉన్న ఉద్దేశ్యాల్నే కాక, అవెప్పుడు ఎట్లా జరుగుతాయోకూడా తెలుసికో గలుగుతారు.

రం :- అద్దదీకథ. సవాలక్షరుకింక రెండు తులాలు మాత్రమే మొగు.

గు :- ఇదిగో రంగయ్యా నీవట్లా ఉండవయ్యా ఒక నిమ్షం.

రం :- ఒక్క నిమిషమేంకర్మ.బండొచ్చేదాకా ఇట్లాగే ఉంటా. నీవడిగే దేదో కానీయ్.

సచ్చి :- ఇంతకూ మీ సందేహ మేమిటంటారు?

గు :- ఈ పొడు వ్యాపారమున్నది చూడండీ, దీనిమీద ఎంతయినా పెట్టుబడి పెట్టనివ్వండి. అదిగాదు లెక్క. నా జీవితంలో ఒక్కనాడయినా...

రం :- ఆఁ...ఒక్క నాడయినా...

సచ్చి :- వారిని చెప్పనివ్వరూ.

గు :- నా ఉద్దేశం......

సచ్చి :- చెప్పండి ఫరవాలేదు మీ ఉద్దేశ్యం......అయ్యో! చెప్పటానికి కూడా భయపడేటంత బలీయమయిన ఉద్దేశమటండీ...చెప్పండి.

గు : నా ఉద్దేశ మేమిటంటే...ఒక్కనాడయినా నా జీవితంలో ఒక లక్ష రూపాయలు నా చేతుల్తో నావిగా లెక్కపెట్టగలనా అని.

రం : లక్ష రూపాయలే! ఎన్ని యాభై ఎకరాలు అమ్మకుంటే ఒక లక్ష! లక్ష రూపాయలు. పెద్ద ఉద్దేశ్యమే గురవయ్యా. ఒక లక్ష రూపాయలంటే సామాన్యమా! బ్రహ్మాండమంతా ఫెళఫెళ విరిగి మనదొడ్లో కుప్పగా పడాలంటారు...ఊ!...లక్ష!

గు: ఫలానా గురవయ్యగారు...

రం : ఏం ఆపేసి నావేపు చూస్తావూ? ఇప్పుడా లక్షకేం కర్మం కాలిందో కాని వ్వండి విందాం.

సచ్చి : మీరు కానే పూ రుకుందురూ. ఊ. చెప్పండి.

గు : ఫలానా గురవయ్యగారు లక్షాధికారి అని ఒక్కసారి లోకం పిలిస్తే చాలు. ఆ మాట కాస్త అనిపించుకుంటే చాలు నా జీవితం తరించినట్లే.

సచ్చి : లక్ష రూపాయలు! లక్ష ఆశలు మీలో దాగి ఉన్నయ్ అన్నమాట, లక్ష జన్మలు! ఇక విముక్తేమిటి! లక్ష రూపాయలు మీ జీవితాదర్శమా?

గు : ఆదర్శమే గాని రొఖ్ఖంగా చేతిలోకి రాదన్నమాట.

రం : మీ వ్యాపారస్తులకు రొఖ్ఖం అయినా, అరువయినా ఒకటే గదయ్యా. రొఖ్ఖం ఉంటే అనుభవించేది లేకపోగా వడ్డీ రాలేదని దిగులు. కోపం వద్దుసుమా! మనలో మనమనుకుందాం. లక్ష రూపాయలే!

భి : బాబూ ఒక బీడిముక్క దయ చేద్దురూ.

రం : నీకెన్నిసార్లు చెప్పాలిరా.

భి : మిమ్మల్ని కాదండి. ఆ కొత్త బాబుగారేమైనా దయచేస్తారేమోనని అడుక్కుంటున్నా. ఇవ్వనోరికి మీ కెందుకు బాబూ అన్ని కోపాలు.

గు : ఒరేయ్! కానీకి రెండు బీడీలు. పొద్దస్తమానం దేబిరించినా నీ బ్రతుక్కి ఒక్క కానీరాదు. కానీ సరుకులేని వస్తువుకు అరగాని పుణ్యం కోసమయినా పెట్టుబడి పెట్టడం, లాభంలేని పని కదటండీ?

[ఇంకెవరో ప్రవేశిస్తారు]

భి : బాబూ మీరన్నా ఒక బీడీ దయ చేద్దురూ.

ఇంకెవరో : లేదు.

భి : బాబూ! ఒక్కబీడీ బాబూ!బాబూ!

ఇం : లేవనడం లేదూ.

భి : అన్నార్తో బాబూ. ఏదో ఒక్క బీడీ దయచేద్దురూ.

ఇం : నేనూ నీలాంటివాణ్నే. నన్ను దేబిరిస్తే ప్రయోజన మేముంటుంది?

భి : ఈ ఊరి కర్మానికి మేం చాలకా బాబూ. నాగతి మీకూడా ఎందుకు పట్టాలండి, చదువుకొన్నవారు కామాల్సు.

ఇం : చదువుకోబట్టే నీతో ఇన్నిమాటలు పడాల్సి వచ్చింది. చదువుకోపోతే బాగానే ఉండేవాళ్లం. చదువుకొని ఉన్నది కాస్తా వదిలించుకొని ప్రతివాడి కాళ్ళూ పట్టుకొని ఉద్యోగంకోసం దేబిరిస్తున్నాను.

సచ్చి : అంత అధోగతికి పోవాల్సిన అవసర మేమిటి నాయనా.

ఇం : ఉద్యోగంకోసం తిరిగేవాడికి తెలుస్తుంది ఆ అవసరం.

గు : ఏం చదివా వబ్బాయీ?

ఇం : చదవటానికి బి. ఏ. చదివాను. చదివి పాసయ్యేదాకా ఒకేడుపు. పాసయిన తరువాత ఉద్యోగం రాలేదని మరొక ఏడుపు.

రం : మా కాలంలో బి.ఏ., చదివాడంటే ఎంతో ఘనంగా వుండేది. ఖదుగు పేటురు కొడుకు బి. ఏ., చదువుతున్నాడంటేనూ పట్నం వెళ్ళినవాళ్లు వాణ్ని చూడకుండా వచ్చేవారు కాదు. ఇప్పుడేముంది. సందుకో బి.ఏ., గొందికో బి.ఏ., అయిపోయెను. చదువు వ్యాల్యం పోయింది.

గు : మార్కెట్టులో సరుకెక్కువయే కొంది వ్యాపారం డౌనే కదండీ. ఏ కాడికి సరుకు తక్కువగా ఉంటేనే గిరాకీ.

ఇంకో : నిజమేనండి. మాకంటే ప్రాణం లేని సరుకే నయం. ఏసరుకు నయినా ఎవరో ఒకరు కొంటారు లేక అమ్ముతారు. మేం దేనికీ చలామణి కాం. చదువుకోవటంకూడా దోషమయిపోయిందిమరి.

సచ్చి : అలా అనకు నాయనా విద్యాధనం అన్ని ఐశ్వర్యాలకంటె గొప్పది.

ఇం : కాని విద్య ధనం కాదు. ధనాన్ని హరించేది. ధనం లేకుండా ఏ విద్యనయినా చదవటం అసాధ్యం.

సచ్చి : డబ్బు, నిబంధనలు మానవుడు నిర్మించిన స్వార్థపు బంధనాలు మాత్రమే.

ఇం : స్వార్థం కోసమే విద్యనుకూడా అభ్యసిస్తున్నా మన్నది సత్యమే కదండి.

సచ్చి : కాదు. ఎన్నటికీ కాదు. విద్యకున్న ప్రయోజనాల్ని స్వార్థం, డబ్బు సాధించలేవు.

ఇం : అదెంత నిజమో నాకు తెలియదు కాని, నా స్వతంలో డబ్బుకున్న ప్రయోజనాల్ని విద్య సాధించలేకపోతోంది.

సచ్చి : అయితే డబ్బు సంపాదించటానికి విద్య ఉపకరణమనే మీ ఉద్దేశ్యం?

ఇం : తప్పకుండా. లేకపోతే ఏ ఆశతో వేలు పోసి చదువుతాం చెప్పండి. ఏ ఆశెలా ఉన్నా,జీవనానికి సరిపోయే ఉద్యోగం వస్తే చాలు. ఏ ఉద్యోగమయినా సరే. ముఖ్యంగా నాబోటివాడికి ఉద్యోగం వస్తే చాలు, జీవితం ధన్యమైనట్టే.

సచ్చి : ఏమిటీ ఉద్యోగంతోనే మీ జీవితం ధన్యమౌతుందా?

గు : అన్నట్టూ...ఉద్యోగమంటే గుర్తొచ్చింది. ఇదిగో...నీ పేరేమిటో నాయనా

★ జీవితా దర్పణం ★

ఇం : ప్రసాదంటారు.

గు : ఆ ప్రసాదు...ప్రసాదరావూ! నా కన్నా చిన్నవాడివి 'గారూ' అంటే నీ ఆయుస్సంతా నాకు వస్తుందని పెద్ద లెందుకన్నారో వాళ్ళ నెందుకు కాదనాలి గాని ... చెప్పొచ్చిందేమిటంటే...ఆఁ... మీరు చదువుకునే కాలేజీల్లో వైద్యం, ఇంజనీరంగం రెండూ చెప్పరా నాయనా?

ప్ర : ఆ రెండనే ఏముందండీ, ఇంకా చాలా కోర్సులు చెపుతారు. ఏం ఎందుకండీ?

గు : అహాఁ. అలాకాదు. వైద్యం, ఇంజనీరంగం రెండూ చదువుకోకూడదూ ఒకేసారీ. ఇది తేల్చుకుందామనే పట్నం పోతున్నా.

ప్ర : ఒకేసారి చదవటమంటే మీ ఉద్దేశ్యం.

గు : నా ఉద్దేశ మేమిటంటే రెండు వేలు పోసి ఇంటర్మీటువరకూ చెప్పించాంకదా, ఏది బోయి ఎట్లా వస్తుందో, రెండూ చదవమంటాను మావాణ్ని...ఎందుకలా నవ్వుతావూ నేం చెప్పింది తప్పేలు కాదే!

ప్ర : మీరనటంలో తప్పేమీ లేదుగాని అలా రెండు కోర్సులు ఒకేసారి చదవటానికి కాలేజివాళ్ళు ఒప్పుకోరండి.

గు : మన డబ్బుతో మనం చదువుకుంటే వాళ్ళకు నొప్పేమిటండీ?

ప్ర : ఇంతకూ మీ అబ్బాయి ఏమంటూ శేమిటి? రెండూ చదవా లంటాడా?

గు : వాడూ నీలాగే అంటేనూ, అదేదో తెలుసుకొని వద్దామని బయల్దేరాను. పట్నం పోయినట్టూ ఉంటుంది. పెద్దుల్లిపాయల ధర కనుక్కొని వచ్చినట్టూ ఉంటుందని ఇప్పుడే ప్రయాణం కట్టాను. ఇంతకూ రెండూకలిపి చదవటానికి వీలుపడదంటారా?

రం : మీ అబ్బాయికి మీ బుద్ధులు రానట్టుంది. మీ తెలివే వాడికబ్బితే ఇక చదువు లెందుకండీ. ఇల్లు కదిలితే సంపాదన, లాభం జమా ఖర్చుల్లోకి వస్తుంటే, ఇంకా మీ వాడికి చదువెందుకయ్యా? రెండేళ్ళు నీతో తిప్పావంటే వ్యాపారంలో కీలకాలేమిటో వాడూ కనుక్కుంటాడు. ఇద్దరూ కలిస్తే నీ వనుకున్న లక్ష రెండురోజుల్లో పూర్తవుతుంది. గురవయ్యగారప్పుడు లక్షాధికారే.

[క్రొత్త మనిషి ప్రవేశం]

క్రొత్త : అసలివ్వాళ బండివస్తుందో రాదో?

ప్ర : ఎంత లేటో తెలుసుకున్నారా?

క్రొత్త : అదికూడా తెలియదంటున్నారు.

గు : తమ రెక్కడికి వెళ్తున్నారు?

క్రొత్త : ఎక్కడికి వెళ్ళితే ఏమిలెండి. అనుకున్నటయిం దాటిపోయింది?

రం : ఏదో చాలా అవసరంగా వెళ్తున్నారనుకుంటాను.

క్రొత్త : అవసరమేనండి. గంటక్రితమే మధిరకు వెళ్ళాల్సినవాణ్ని. ఇవ్వాళక్కడ నా ఉపన్యాసం ఉందిలెండి.

ప్ర : సమతారావు అంటే మీరేనాండి?

సమతారావు : ఆఁ... నేనేనండి.

సచ్చి : 'స...మ...తా...రా.. వు' పేరు చాల క్రొత్తగా ఉందే మీ రెవరండీ?

సమ : మానవుణ్ని.

సచ్చి : మిమ్మల్ని మానవులుగా కాకుండా వేరే అనుకోటానికి ఇంకా చూపుదోషం రాలేదనుకోండి, అసలు మీ రెవరో తెలుసుకుందామని అడుగుతున్నాను.

సమ : మీకు కావల్సిన 'ఆ ఎవరం'టే ఏమిటో కాస్త వివరిస్తారూ?

రం : మనిషన్న తరువాత, తలిదండ్రులూ, పేరూ, కులంగోత్రం ఉండవటండీ?

సమ : వాటిలో కులం, గోత్రం లేకుండానే జీవిస్తున్నానే నేను! నా కొచ్చిన లోపం ఏమీ లేదండీ?

గు : అంటే?........

సమ : అంటే కులం మతం మానవుడికి అవసరం లేదంటాను.

సచ్చి : అయితే మీరునాస్తికులన్నమాట.

సమ : మీరలా తీసుకున్నా ఫరవాలేదు.

(48-వ పేజీ చూడండి)



(గతసంచిక తరువాయి)

వరహాలరాజు మొహం ముత్యం అంత అయిపోయింది

దిగాలుగా తలవంచుకున్నాడు

సినిమాలో ఇలాంటి సీను వస్తే నేపథ్యగీతం రావాలి.

నా, ఇంతేజీవిత మింతేనా, ఈ జీవిత మింతేనా అని మాధవపెద్ది సత్యం, కోండో కచో ఎం. ఎస్ రామారావూ, రాజు వరి భాషలో "ధణు తెగర గొట్టేలా" పాడాలి.

వరహాలరాజు తలవంచుకుని చాలాసేపు చూశాడుగాని అతనికి అలాంటి సదుపాయం జరగలేదు. ఇక తప్పదని తనే పెదిమలు కదలేదా మనుకుంటున్నాడు

అంతలోకి హఠాత్తుగా "ఇంతేలే-జీవిత మింతేలే-ఈ జీవిత మింతేలే-ఈ నీ జీవిత మింతేలే" అన్న పాట-లేక మాట, కొత్త కఠినంగా వినబడింది.

"ఛీ వరస తప్పింది గొంతు బొంగురు పోయింది" అనుకుని పాడిదగ్గుతో సర్దు కున్నాడు రాజు

అయినా ఆ పాట వినబడింది! తల ఎత్తా డతడు.

ఆత్మహత్యకి ప్రయత్నిస్తూన్న హీరో యిన్ని ఆపడానికి వచ్చే సినిమా సాధువులా నవ్వుతున్నాడు వరసన్న. అతని పెదిమలు కదులుతున్నాయి.

'ఓహో ఈయనా పాడుతున్నాడు ఇంకా నేనే ననుకున్నాను నయం' అను కున్నాడు రాజు. అనుకుని, "ఓమీరా!" అన్నాడు

"మీరా కాదండి మా ఘంటసాలదే అనుకుంటూ.. తెలుగు సాంగు" అన్నాడు వరసన్న రాజుని అపార్థం చేసుకుని.

"మీరా రా ఎవరూ?" అన్నాడు రాజు.

"మీరా అంటే ఎం. ఎస్ సుబ్బలక్ష్మి కదండి బ్యూటిఫుల్ గా పాడింది. నేను పాడింది అదిగాదులెండి తెలుగూనే పర్షువు సాంగు మీకు తెలిసుండాలే. మా ఫేసు మీద చాలా ఫీలింగు కనబడితే పాడాను."

ఎస్. పార్థసారధి

రాజు సిగ్గుపడిపోయాడు "ఎప్పుడూ అంతే నండి నా ఫేసుమీద మంచి ఫీలింగులు ఉంటాయి ఇప్పుడు పాడింది మీరన్న మాట."

"నా పేరు మీరన్న కాదు వరసన్న... మీకు వినులుగా ఉంటే ఉందికాని, అలా పరాగ్గా మాటాడి నా పేరు మార్పకండి" అన్నాడు వరసన్న కొంచెంచిరాగ్గా.

"మీరు సన్నర్థం చేసుకోటం లేదు వర సన్నా"

"ఏవయ్యాయ్! ఎక్కడేనా బావగాని వంగతోటదగ్గిర కొదన్నారు. ఈ సినిమా డైలాగులు బాగానే ఉన్నాయికాని నాకు టోకరా ఇవ్వడానికి కాదకు. మళ్లీ అంటు న్నా స్పష్టంగా. ఇందాక నేపర్షువు సాంగు పాడింది. మీరా కాదు; మీరన్నా కాదు. నేను నా పేరు వరసన్న బోధపడిందా?"

"పడిందండి "

"సరే ఇంక అలా ఏడుస్తున్న పోజు మార్చెయ్యి ఎందుకలా బెంగపడడం?"

"మీరు చెప్పినకథలు వింటే, భయం వేస్తోంది డబాయించడం కొంచెం కూడా చేతకాదుగదా, ఈ 'పాపం పసివాడు' ఎలా ధాన్ని సంపాదించగలడాఅని ఏడుపొస్తోంది. అన్నాడు రాజు వినమ్రుడై నవ్వుతూ.

వరసన్న పకపకనవ్వేసి, రాజు భుజంమీద చరిచాడు

'మరేం ఫరవాలేదు తప్పక పైకొస్తావు. ఏడుపొస్తోంది అన్నమాటని నవ్వుతూ సినిమా టిక్ గా,స్టయిలిష్ గా చెప్పగలిగావంటే నువ్వే మన్నా సాధించగలవు. నోసలు నిజంచెబితే నోరు అబద్ధంచెప్పాలన్నారు ఆసదుపాయం కోసమే దేముడు మనకి నోరు సప్లయిచేశాడు కదా నోరు నిజంచెబితే నొసలబద్ధమాడాలి. నీకీవిద్య వచ్చింది. వస్తా! భయపడకు. ఇంక ప్రపంచతంత్రం కొస్తా నేర్చుకుంటే నీకు ఢోకాఉండదు" అన్నాడు వరసన్న గంభీరంగా

రాజు నొసలే ప్రశ్న అడిగాయి. అదేమిటని.

ప్రపంచతంత్రం

పంచతంత్రంలో వలెనే ప్రపంచతంత్ర మును నైదుభాగమ్ములు అన్నాడు వరసన్న.

"మళ్ళి నామీదకోసం వచ్చినట్టుంది. మనిద్దరికీ అరగని తిరగలి భాషలో పద్దారు అన్నాడు" రాజు.

"ఫరవాలేదు ఏం లేఅయిదూ ఏమిటంటే-ఒకటి. నోటితో మెచ్చుకుంటున్నా నొసలతో వెక్కిరించి "ఆత్మ గౌరవం" నిలుపుకుంటూ, పబ్బం గడుపుకోవడం.

రెండు; నోటా నొసటాకూడా దాత

విక్రమార్కుడి మార్కు సింహాసనం

ణంగా మెచ్చేసుగోవడం.

రెండిటా—అనగా ద్వికరణ శుద్ధిగా అసహ్యించుకుని ఆ సంగతి చెప్పడం

'త్రికరణశుద్ధి' అన్న మాట ఖరించి పట్టించుకోకూడదు మనసావాచా ఒక పద్ధతిలో నడుచుకున్నా, క్రియచేత స్వతంత్ర విధానాలు అనుసరించడం.

ఐదవదీ ఆఖరుదీ ఏమిటంటే కళ సహప్రాధిక ముఖాలుగల టోకరా కళను కూలంకషంగా వంటబట్టించుకుని, జీవితానికి పటించి కథ నడపడం టోకరా అంటే చెడ్డపని అనుకోకు అవసరాన్ని బట్టి ఆ మహావిద్యని వాడితే తప్పులేదు అబద్ధం ఆడడానికి లైసెన్సు ఇచ్చిన ఛాన్సులు ఎన్ని ఉన్నాయో జ్ఞాపకం ఉందా వారి జాతులందు వైవాహికములందూ అంటూ ఎవడో ఒక లిరికల్ డైలాగు రాశాడు చూడు. అది రాసుకొచ్చి కంఠతాపట్టేయ్. ఒంటికి మంచిది.

ఏం? ఇప్పుడు ప్రపంచం తంత్రం అనే హెడ్డింగుకింద ఒక టోకరాసురుడి కథ చెబుతాను విను: అన్నాడు నరసన్న.

టోకరాసురోపాఖ్యానము

"పూర్వము హాలీవుడ్డు అనే గ్రామంలో హరనాథ్ బాబా అనే అసహాయ శూరుడుండేవాడు "

"అదేమిటి మేష్టారూ-హాలీవుడ్ లో హరనాథ్ బాబా యెలా ఉంటాడండి? మీ బొందలా ఉంది."

"ఎందుకుండడు యతికోసం చచ్చినట్టు పుచ్చిన శుక్కలా ఉంటాడు. ఏదో ఇంక తెలుగు పిక్చర్ లకి డైలాగులు రాయాలి కదా. అలవాటై పోయింది పోన్లే. హాలీవుడ్ లో హారిసన్ అనేవాడున్నాడు"

ఇంకా ఉన్నాడాండి

"ఇప్పటి సంగతి కాదు పదిహేనేళ్ల క్రితం ఉన్నాడుట దరిమిలా ఉండడం మానేశాడేమో తెలీదు " అన్నాడు నరసన్న.

"వాడేం చేసేవాడంటే-" అని కొనసాగించాడు నరసన్న.

అంతలోకే స్టేషనువచ్చింది.

"చూడు బ్రదర్, నీ పేరేమిటి " అన్నాడు నరసన్న కథనుఆపి.

"రాజు" అన్నాడు రాజు.

"భేష్ రైలాగ్గానే వెళ్ళి మనిద్దరికీ కాస్త టిఫినూ కాఫీ, ఓపెట్టె సిగరెట్లు కొట్టుకొచ్చేయి. నేనో రూపాయిస్తాలే అలా చూస్తావేం కథని మాంఛి రసపట్టులో

(56-వ పేజీచూడండి)

అనుభవ రహితులు

అత్త గయ్యాళి, మామ త్రాగుబోతు; ఆడబిడ్డ రంకులాడి, మరుదులు రౌడీలు, బావ జూదరి అని సామాన్యులకి మల్లే చెప్పుకోవడానికిగాని, కనీసం అనుకోవడానికిగాని అవసరం రాలేదు శారదకు. కారణం ఆమెభర్త గంగాధరంకు 'నా' అనే వాళ్ళెవరూ లేకపోవడమే ఎవరైనా ఉన్నా, ఆమె అలా చెప్పుకునేదికాదు. అతడు నగరంలో చదువుతూ ఉన్నప్పుడు ఆమెను పెళ్ళిచేసుకున్నాడు. చదువు పూర్తిచేసి, క్రొత్తగా ఆమెను కాపురానికి తీసుకొచ్చాడు.

చివరికి భర్తనడవడి 'ఇలాంటిది' అని వ్రేలెట్టి చూపడానిగ్గూడా వీలు లేకపోయిందామెకు. అసలామె ఇంటిగుట్టుని బజారు కెక్కించే మనిషికాదు నాయికలకుండే లక్షణాలు ఆమెకు పోల్చిచూస్తే స్వాధీన పతికలకుండే స్వభావాలు ఆమెలో గోచరిస్తాయి వీటికితోడు గంగాధరం సహజంగా మంచివాడు చదువుకున్నవాడు నలుగురిలో గౌరవం సంపాదించుకున్నవాడు అతడు చదివే రోజుల్లో వేసగి సెలవు లన్నీ శ్వశుర గృహంలో గడిపేవాడు. మిత్రులతనికి ఎన్నో ఉత్తరాలు రాసేవారు వాటిని శారద చాలామార్లు చదివింది. వాళ్ళందరూ ఆయన తెలివితేటల్నీ, గుణగణాల్నీ శ్లాఘిస్తూ రాసేవారు అవన్నీ చదువుతూంటే ఆమెకే గర్వంగా ఉండేది తనభర్త ఇంతటివాడుకదా అని!

పోతే, ఆయన ఆమెపట్లకూడా ఎన్నడూ ఆవంత అవజ్ఞ కనపరచి ఎరుగడు. ఆమెను సుఖపెట్టాలనే అహరహమూ తాపత్రయ పడుతుంటాడు. ఆమె ముఖేందుబింబంలో ఆవగింజంత నలుపు కనపడినా అతడు హైరాన పడిపోతాడు ఆమె నవ్వితే అతను నవ్వుతాడు ఆమెకంటనీరుచూస్తే అతని గుండె చెరువైపోతుంది

కాపురానికి వచ్చిన మొదటినాడే ఆయన వంటమనిషిని తెచ్చాడు శారద చెయ్యి కాల్చుకోగూడదనే అభిప్రాయంతో. ఆయనకు తెలుసు; శారద పుట్టింట్లో ఎన్నడూ ఒళ్ళు వంచలేదని సుకుమారంగా, గోముతో పెరిగిన పిల్లను ఆట్టే కష్టపెటడంలో అర్థం లేదనే ఆయన వంటమనిషిని తెచ్చాడు. తనకు వంటసంగతు లేమీ తెలియవని శారదకు తెలుసు. కాని, భర్త వంటమనిషిని తీసుకురావడంతో ఆమె ఆత్మాభిమానం దెబ్బతింది. తనుండగా తన భర్తకెవరో పరాయిస్త్రీ వంటచేసి పెట్టడమా? ఛీ, ఏం బాగు? తను అంత అసమర్థురాలా?—ఈ రకమైన దురభిమానంతో ఆమె ఆనాడంతా ముఖం ముడుచుకు కూర్చుంది. భర్తతో కలకలా నవ్వలేదు. ప్రొద్దుట్నుంచీ పచ్చి మంచినీళ్ళయినా ముట్టుకోలేదు. వంటమనిషి తన పనిముగించి వెళ్ళిపోయింది

బయటికి ఉదయమనగా పనిమీద వెళ్ళిన భర్త మధ్యాహ్నం మీరింతరువాత వచ్చాడింటికి కేశాలకు తైల సంస్కారమైనా లేకుండా, నిరస్తభూషయై, వాడిపోయిన ముఖపద్మంతో గదిలో ఒంటరిగా మంచంమీద కూర్చుని ఉందామె. ఆదృశ్యంచూసి ఆయన ఆపాదమస్తకం కంపించిపోయాడు ఆమెను చూసేసరికి, నాథుడు పారిజాతప్రసవాన్ని తన సవతియైన రుక్మిణీ ధమ్మిల్లంలో

వల్లపురెడ్డి

ముడిచినందుకుగాను ప్రణయకుపితయై కోపగృహంలో ప్రవేశించి ఉన్న సత్యభామ జ్ఞాపకం వచ్చిందతనికి ఆమె సరిగా అలాంటి స్థితిలోనే ఉంటే, ఆమె పాదతాడనంతో ఆవాళ తన శిరసు వ్రక్కలై పోకతప్పదనిపించింది. మెల్లిగా ఆమెను సమీపించి, బుజ్జగిస్తూ అడిగాడు "ఏమిటి శారదా, ఇలా ఉన్నావు?" అని

"ఏమీ లేదు"—అంటూ ఆమె ముసుగు దన్ని పడుకుంది.

అతడు బలవంతంగా ఆమె కప్పుకున్న ముసుగుని గుంజివేశాడు ఆమె కన్నుల్లో నీటిని చూసి భయపడ్డాడు "ఏం జరిగింది శారదా, చెప్పు ఎవరైనా ఏమైనా అన్నారా? లేక నా మూలాన్నే అపచారం జరిగిందా? చెప్పు శారదా!" అని దీనాస్యుడై ప్రార్థించాడు, పెక్కు విధాలుగా.

ఆఖరుకు ఆమె హీనస్వరంతో అంది "వంట మనిషిని పొమ్మనండి" అని

- పారిజాతవృక్షాన్ని తెచ్చి పెరట్లో నాటడంలాంటి దుస్సాధ్యమైన పని ఏమీ చెప్పనందుకు గంగాధరం సంతోషపడ్డాడు కాని ఆమె ఎందుకు వంటమనిషిని తొలగించమంటూందో అతని కర్థం కాలా. ప్రప్రథమ దివసమే వంటమనిషిమీద శారదకు కోపం ఎందుక్కలిగిందో అతనూహించలేకపోయ్యాడు. "సరే, అలాగే చేస్తాను. కాని ఎందుకు నీకింత కోపమామెమీద?" అనడిగాడు.

"నే నుండగా ఆమె ఎందుకు? నే నే చేస్తాను మీకు వంట" అంది.

గంగాధరం ఆమె బాధని అర్థంచేసుకుని పకాలున నవ్వాడు. "ఓస్, ఈ మాత్రం దానికే ఇంత ఇదైపోయావా? వంటకాల్లో నీకు అనుభవంలేదని నేను మనిషిని కుదిర్చాను. అంతేకాని, నువ్వే వద్దంటే నష్టమేముందీ?" అన్నాడు. కొంచం ఆగి, "ఇంతకూ నీకు చేతనవునా అని?"—తన సందేహాన్ని ప్రకటించాడామె ముఖంలోకి చూస్తూ.

"బ్రహ్మవిద్యయిపోయింది. మీరు చూస్తారుగా" అంది గర్వంతో.

ఆమె కోరిక నెరవేర్చడం గంగాధరానికి కష్టమనిపించలేదు.

మర్రోజునించి ఆమెవంట ప్రారంభించింది. మరొకరైతే వంట మహాకష్టమైన పనని విసుక్కునేవారు. కాని తన భర్తకు మరొకరు వంటచేసి పెట్టకూడదనే భావం - మరో రూపంలో ఐతే తన అధికారాన్ని ఇతరు లెవరో తస్కరిస్తున్నారనే ఆవేదన- ఆమెకు వంటచేయడంలోని సాధకబాధకాలను లక్ష్యపెట్టే అవకాశాన్ని కలుగనీయలేదు. నిజంచెప్పాలంటే భర్తకు స్వీయహస్తాలతో ఆహారపచనం కావించిపెట్టి, ప్రధానమైన స్త్రీ ధర్మాన్ని నిర్వహిస్తున్నాననే ఆమెలోని గర్వం, తృప్తీ, ఉత్సాహమూ ఆమెకు కించిత్తు బడలికను కూడా కలిగించలేదు.

మొదటి దినం వంటకు పర్యవసానం మాత్రం ఘోరంగా పరిణమించింది. భర్త రావడంతోనే తను చేసినవంటని వడ్డించింది శారద ఆయన అన్నంముందు కూర్చుని భావగర్భితంగా నవ్వుకున్నాడు.

"ఏమండీ, ఎలా ఉంది వంట?" అని ప్రశ్నించింది

"చాలా బావుంది శారదా!"-అన్నాడు గంగాధరం. అతడు మాటల ధోరణిలో కాని, తినే విధానంలో కాని ఏమీ మార్పు రానివ్వలేదు. ఆమె అనుమానానికి తావిచ్చే చేష్ట ఒక్కటీ తనలో వ్యక్తపరచలేదు.

శారద అతని పొగడ్తని నిజమనే భావించింది. తనలో తాను సంతోషపడింది. భర్త

★ అనుభవరహితులు ★

భోజనంచేసి వెళ్ళాక, తీరా తను తినడానికి కూర్చున్నప్పుడుగాని తెలిసిరాలేదామెకు తన వంటకాల మాధుర్యం. అన్నం జావలా తయారైంది పప్పులో నోట్లో పెట్టుకోవలది గాని ఉప్పు. పచ్చడిలో ఏమేమి వేసిందో జ్ఞాపకమే లేదు. ఛీ, ఏమిటీ తిండి? అనుకుంది. భర్త ఎలా తినిపోగలిగాడో తలుచుకునేసరికి ఆమె బాధపడింది. ఇకముందు జాగ్రత్తగా వండాలని నిర్ణయించుకుంది. ఆనాడు సాయంత్రం టిఫినూ, రాత్రి భోజనమూ అలానే అఘోరించినై.

రెండో రోజున వంటలు మొదటిదానికి పూర్తిగా భిన్నంగా తయారైనై. శారద తనవరకూ చాలా జాగ్రత్తగా వధనం చేశాననే అనుకుంది. ఆనాడు కూడా గంగాధరం రుచిగానే ఉన్నాయన్నాడు. అంతటితో ఊరుకోక, "అబ్బ! శారదా, నువ్వింత సమర్థురాలివని అనుకోలేదుసుమా!" అన్నాడు.

తన పాకజ్ఞతని ఇంకా వినాలనే కౌతుకంతో ఆమె కళ్ళెత్తి అతనికేసి చూసింది, "ఎందుకూ?" అనే ప్రశ్న ద్యోతకమయ్యేట్లు.

"లేకపోతే మరేమిటి? నిన్నటి వంటకాల కివి కేవలం వ్యతిరేకం"—అన్నాడు.

గతదినం వంటలు పూర్తిగా చెడిపోయిన సంగతి ఆమెకు తెలుసు. వాటికి వ్యతిరేకం అంటే, బాగుండడమే—రుచిగా ఉండడమే—జరిగి ఉండాలని అనుకుంది. కాని నానవేసిన బియ్యంలా ఉన్న అన్నాన్నీ, కూరల్లో కపాలముండలాన్నంటుతూన్న కారాన్నీ చవిచూసి అతనలా అన్నాడని ఆమె ఊహించలేకపోయింది ఐతే తరువాత తనకే తెలిసివచ్చింది

ఎలాగైతేనేం, భర్తకు తనే వంటలు చేసి పెట్టాలని శారద ఉబలాటం; భార్య మనస్సుని నొప్పించకూడదని గంగాధరం ఉద్దేశం.—ఈ ప్రకృతుల మూలాన సవ్యంగానే సాగుతోంది సంసారస్యందనం. ఏ రోజుకారోజు స్వయంగా పొందుతున్న అనుభవాల సహాయంతో శారద పరవాలేని విధంగా వంటలు చెయ్యసాగింది. ఐనా

ముకింకా పూర్వానుభవం కలుగలేదు. నూతనంగా చెయ్య ప్రయత్నించిన ప్రతి వంటా పాడే.

ఆనాటి ఆమె సాయంత్రం టిఫీను కొఱకు వడలు చెయ్యాలని ప్రొయ్యిముందు కూర్చుంది. అప్పటికి మూడయివుంటుంది సమయం. ప్రొయ్యిమీద అప్పుడప్పుడే క్రాగుతున్న నూనెలో రెండుమూడు వడల్ని చేసి విడిచింది. అవి చిరిగి చిద్రుపలై పోయినై. శారదకు తోచలేదు. నూనె మంచిది కాకపోవచ్చుననే అనుమానం కలిగింది. మినప్పిండిలో లోపం ఏమైనా ఉండొచ్చునని కూడా తోచింది. మరో రెండు విడిచింది. అవి కూడా మొదట విడిచిన వాటికి మల్లేనే విచ్చిపోయినై. అవి అలా విచ్చిపోవడానికి కారణం నూనెసలసల మరగకపోవడమే. శారదకు క్రాగుతున్న నూనెలో వడలు విడవాలని తెలుసు. కాని ఎంత మోతాదులో క్రాగిననూనెలో వడలు చెడకండా తయారౌతాయో తెలియదు. అంచేత నూనో, మినప్పిండో మంచివి కాకపోయి ఉండాలనే అనుమానం కలిగిందామెకు. వడలలా చెడిపోవడానికి సరైన కారణమేమై ఉంటుందో అడగాలని అవతలి గదిలో కూర్చుని ఉన్న భర్త దగ్గరికి వెళ్ళిం-.

* * *

తలిదండ్రులు పరమపదించాక గంగాధరం పైతృకమైన తన ఆస్తిని ఒక నమ్మకస్థుడైన ఆసామీ పర్యవేక్షణలో ఉంచి, ఉన్నత విద్యాభ్యాసం చేశాడు. ఆ రోజుల్లోనే శారదను ఉద్వాహమయ్యాడు. విద్య పూర్తి చేశాడు. ఐతే ఆలోగా అతనిలో కలిగిన మార్పులు అన్నీ ఇన్నీ కావు. దేశంలో నిరక్షరాస్యత ద్వారా పెరిగిపోతూన్న అజ్ఞానమూ, కనీసం ప్రాథమిక విజ్ఞానమైనా లేకండా శ్రామికులు నిరంతరం పడుతున్న పాట్లూ, సరైన చికిత్సలు చేయించుకునే దిక్కులేక రోగాలకు గురౌతున్న దీనప్రాణులూ, ధనోన్మాదులహస్తపంజరంలో చిక్కుపడి, చావు బ్రతుకుల మధ్య వ్రేలాడుతున్న బీదప్రజా జీవితాలూ అతని మనస్సుని కలచివేశాయి. కొన్నికొన్ని చోట్ల బాధాజనకమైన ఇలాంటి దృశ్యాలను ప్రత్యక్షంగా చూసినప్పుడు అతనిగుండె ద్రవించి కళ్ళలోంచి అశ్రువుల రూపంలో ప్రవహించింది. ప్రపంచంలో దినదినమూ తాండవిస్తూన్న అన్యాయాన్నీ, అవినీతినీ కూకటివ్రేళ్ళతో పెరికివేయాలనుకున్నాడు. మానవసేవాదీక్షాకంకణబద్ధుడై చదువు ముగించడంతోనే, అందరిలా ఉద్యోగాలకొఱకు ప్రయత్నించకండా నిజగ్రామానికి వచ్చి వ్యవసాయం ప్రారంభించాడు.

నిత్యజీవితావసరాల సంపూర్తి కొఱకు వ్యవసాయం చేయిస్తున్నా ఆశయాన్ని మాత్రం విస్మరింపలేకపోయాడు. దేశంలోని సర్వారిష్టాలకూ మూలం అవిద్య. దాన్ని నిర్మూలిస్తే గాని దేశం స్వాస్థ్యం పొందదు. ప్రజలందరూ విద్య నేర్చుకుని, తమమట్టుకే గాక సాటిమానవులను గురించి కూడా ఆలోచించ గలిగినప్పుడు నిజంగా దేశంముందడుగు వేసినట్లు. దేశాన్ని పటిష్ఠమూ, పరిపుష్టమూ చేయడానికి చదువుకున్న యువకులే ఓం ప్రథమంగా నడుం బిగించాలి. యువకులు చేయలేని పనంటూ లేదు. ఇలాంటి బోధనలు గొప్ప గొప్ప దేశనాయకుల ఉపన్యాసాలు వినడం ద్వారానైతేనేమి, అభ్యుదయ రచయితలు వ్రాసిన నవలల ద్వారానైతేనేమి, కవుల కవితల ద్వారానైతేనేమి, అతని మస్తిష్కంలో దూరినయి. వాటిని క్రియారూపంలో ప్రదర్శించడానికి చదువుముగించిన తక్షణం పూనుకున్నాడు గంగాధరం.

ఉద్యమరూపంలో ఉండవలసిన పనిని ఏనాడూ ఒక్కడు చేయలేడు. కనుక ఊర్లోని యువకుల్ని కొందరిని సమావేశపరచి, తన అభిప్రాయాలను వెల్లడించాడు. యువకులు అతనిలా గొప్పగా చదువుకున్నవాళ్ళు కాకపోవడంవల్ల వెంటనే ఉత్సాహం చూపలేదు. అతని మాటల ప్రభావం అందరిమీదా పనిచేసింది. తలిదండ్రుల అదుపాజ్ఞలో ఉన్న కొందరు యువకులు తాము బహిరంగంగా రంగంమీది కొచ్చి కార్యాన్ని నిర్వహించలేము గాని, అతనుచేసే ప్రతి పనికీ దోహదంగా, పూసల్లో దారంలాగా మెలగుతామన్నారు. స్వతంత్రులయిన ఐదారుగురు మాత్రం సరే నన్నారు. గంగాధరం అప్పుడే తన తపస్సు ఫలించి, దేశం నాగరకమై, సస్యశ్యామలమైనట్లూ, అందరి జీవన వాటికల్లో నందనవనశోభలు అవతరించినట్లూ సంసారాల్లో స్వర్గసీమలు రూపించినట్లూ అనుభూతిని పొందాడు.

తన అభిప్రాయాలతో ఏకీభవించిన ఐదారుగురు యువకుల సహాయంతో హరిజనవాడలో ఒకటీ, తెలుగు (జాలరి) వాడలో ఒకటీ-రెండు పాఠశాలలను నెలకొల్పాడు గంగాధరం. వయోజనులకు అక్షరాభ్యాసం మొదలెట్టాడు. మొదట్లో ఎవరూ రాకపోవడం సహజమే. కాని ప్రతిదినమూ తనూ, తన అనుయాయులూ ఇంటింటికీ తిరిగి ప్రబోధంచేస్తే కొందరు రాసాగారు. వయోజనుల ఉత్సాహం రోజురోజుకూ అభివృద్ధి కాసాగింది. వాళ్ళ ఉత్సాహానికి తగిన నిష్పత్తిలోనే అతని సేవాసక్తీ పెరిగిపోసాగింది.

కొన్ని రోజులు దొర్లినై. గంగాధరం తనను గురించి గ్రామం ఏమనుకుంటున్నదీ వినడానికి తీరిక చిక్కించుకోలేదు. కాని గ్రామంలో సామాన్య ప్రజలు మాత్రం ఆయన చేస్తున్న సేవని శ్లాఘించడం ప్రారంభించారు. ఆయన అనంతమైన విజ్ఞానసంపన్నుడనీ, అనింద్యమైన వినయశీలుడనీ, అవ్యాజమైన ఔదార్యం కలవాడనీ లోకులు అనుకుంటున్నారు. వాళ్ళ మాటల్ని వినడంలో గంగాధరం శ్రద్ధ వహించకపోయినా అతనికంటే పెద్దవారూ, గ్రామంలో అధికారులుగా, పలుకుబడి కలవారుగా చలామణి అవుతున్న వాళ్ళు మాత్రం చెవులు నిక్కించి విన్నారీస్తుతులను. తమ కళ్ళెదుట పుట్టిన కుఱ్ఱకుంక తమను మించిపోవడం వాళ్ళకు హద్దుమీరిన ఆశ్చర్యాన్ని కలిగించింది.

ఒకనాడు సాయంత్రం, తన ఇంటి ముందుగా వెడుతున్న గంగాధరాన్ని పిల్చాడు గ్రామాధికారి. గంగాధరం వెళ్ళాడు. ఆయన టీ వగైరా ఇచ్చి, గంగాధరంతో మాటల్లో పడ్డాడు. మాటల సందర్భంలో, "గంగాధరంగారూ, మీరు కావాలంటే ఒక గొప్ప ఉద్యోగం దొరికేది. ఎందుకనవసరంగా ఈ పల్లెటూరి మొరటువెధవల్తో తలబ్రద్దలు కొట్టుకుంటున్నారు?"—అన్నాడు.

"ఇంట్లో తినడానికి తగినంతగా కలిగిన నాలాంటివాళ్లుకూడా ఉద్యోగాలకు ఉవ్విళ్లూరితే, కేవలం ఉద్యోగంచేసే దృష్టితో తంటాలుపడుతూ చదివిన వాళ్ళగతి ఏంగాను?" అని గ్రామాధికారి ముఖంలోకి చూశాడు. ఆయన వరండాలోంచి కన్పడుతూన్న నీలాకాశం కేసి చూస్తున్నాడు. గంగాధరం మళ్లీ అన్నాడు: "ఇంతకూ నేను ఇక్కడ తల బ్రద్దలుచేసుకుంటున్నదికూడా ఏమీలేదు. మొదట మొదట కొంచం కష్టంగాతోచినమాట నిజమే. కాని ఇప్పుడు అంతా సవ్యంగా జరిగిపోతూ ఉంది."

"అది నిజమేననుకోండి"- ఆకాశంనుంచి దృష్టిని గంగాధరంవైపుకుమళ్లించి అన్నాడాయన. "ఐనా, ఈ వెధవలు చదువులు వెలగబెట్టి ఏపూళ్లేలుతారండీ?"

ఆయన మాటల్లోని కాఠిన్యానికీ, నిర్లక్ష్యానికీ గంగాధరం కొంచెం బాధపడ్డాడు. ఆ బాధనేమీ వ్యక్తంకానీకండా తనలోని-తను సాగిస్తూన్న ఉద్యమంలోని—పరమార్థాన్ని చెప్పాడు: "వాళ్ళు నేర్చుకుంటూన్న చదువు ఉద్యోగాలకూ, ఊళ్ళేలడానికీ పనికివస్తుందని ఎవరంటారు? ఏదో వార్తాపత్రిక చదవగలిగి, ప్రపంచ వ్యవహారాలను కొద్దిగా అర్థంచేసుకోగలిగితే చాలు. శుచీ, సభ్యతా తెలిస్తే నిత్య జీవితంలో జాగ్రత్తగా మసలుకునే అవకాశం చిక్కుతుంది."

సామాన్యులు జాగ్రత్తగా మసలుకోవడం ప్రారంభించినవాడు గ్రామాధికారులయిన తమలాంటివాళ్లి ప్రాబల్యం అడుగంటిపోతుందనే భయంతో ఆయన గంగా

★ అనుభవ రహితులు ★

ధరంతో ఈ సంభాషణ ఉపక్రమించాడు. గంగాధరం తనుచేస్తున్న పనిలోని ఉద్దేశం అదేనని బయటపెట్టేసరికి, ఆయన మరొక్క మాటకూడా ఆడలేదు. మౌనం వహించాడు.

"ఎటొచ్చీ, నేను పనిలేనివాణ్ణి కనుక, వాళ్లకు పనిలేని వేళల్లో నాకు తెలిసిన సంగతులు కొన్నైనా చెప్తాను"-అన్నాడు నవ్వుతూ సమస్యను తేలిగ్గా పరిష్కరించాలని.

"అలాగా! సంతోషం"—అన్నాడాయన క్లుప్తంగా.

అంతే. గంగాధరం సెలవు పుచ్చుకున్నాడు.

తరువాతి రోజుల్లో, అప్పుడప్పుడు గ్రామంలో పలుకుబడి గల ఇతర పెద్దలు కూడా గంగాధరాన్ని కలిసి, అతనుచేస్తున్న పని ఏమీ లాభకరంగా లేదనీ, ఏదైనా గౌరవప్రదమైన ఉద్యోగం చూసుకుని నిర్వహించడం కీర్తికారణమనీ చెప్పారు. గంగాధరం కూడా తనకు ఉద్యోగాపేక్షా, కీర్తికాంక్షా బొత్తిగా లేవనీ, ఏదో తనకు తోచినమట్టుకు గ్రామీణులకు అక్షరాభ్యాసం చేసి కాలాన్ని వెళ్ళబుచ్చుతాననీ అన్నాడు.

ఈ ఘటనలు జరిగిన కొద్దిరోజుల్లోనే గంగాధరం మేధకందని దృశ్యాలు గోచరించినై. వయోజనులంతా కలిసి శ్రమించి తమ బడికోసం వేసుకున్న పాక ఒకనాడు రాత్రికిరాత్రే తగులబడిపోయింది. ఊళ్ళో పెద్దలుగా తిరిగేవాళ్ల చూపులన్నీ అతనిమీద ద్వేషాన్ని బాహిరించసాగినై. వాళ్ల ప్రభావంలో ఉన్న కొందరు సన్నిహితులు కూడా అతనితో మాట్లాడ్డం మానివేశారు. ఇవన్నీ అకారణంగానే జరుగుతున్నాయని గంగాధరం ఊహ. కాని వీటికి తగినంత బలమైనకారణం నేపథ్యంలో ఉంది.

గంగాధరం పెద్దచదువు చదువుకున్నాడు. కాని ఎన్నడూ అతనిదృష్టి కీర్తివైపు పోలా. ధనార్జన కోసం మనుషులు ఎంతటి ఘోర కృత్యాలనైనా ఆచరిస్తారు. ఇది మనంనిత్యమూ చూసేది. ఐతే అంతకుమించిన ఘోర కృత్యాలు కీర్తిని ఆర్జించడంలో చేస్తారు. ఇది మనకు కనపడదు. కాని నిదర్శనం కావాలంటే ఉంది: కీర్తికోసం ఎంతటి ధనాన్నైనా గుప్పిస్తారు మనుష్యులు. ఇంతకంటె బలమైన నిదర్శనం మరొకటిలేదు. ఈ విషయం గంగాధరానికి మరుగుపడిన సత్యం. ఎంతసేపూ అతనిదృష్టి స్నేహం, సౌహార్దం, అభ్యుదయం ఇత్యాది వాటి పైనే!

హరిజన వాడలోని పాక స్వాహా అయిన తరువాత వేపచెట్టుక్రింద అరుగుమీద బడి చెప్పాడు. ఆ సమయంలో జాలరివాడలోది పెరికివేయబడింది. కొన్నాళ్ళకు చదువుకోవడానికి కూడా ఎవరూ రాలేదు. ఊళ్ళోని పెద్దలే స్వయంగా బళ్ళు తెరిచినారనీ, అక్కడికే అందరూ వెడుతున్నారనీ తెలిసింది. అక్కడ చదువు ఏం చెబుతున్నారో అతనికి తెలీదు. అతడు ఇంట్లో కూర్చున్నాడు కొన్నాళ్ళు.

గంగాధరం విచారంలో పడ్డాడు. తను తలపెట్టిన పనులన్నీ ఎందుకలా ఛిన్నాభిన్నమై పోతున్నాయో అతనికి అవగాహనం కాలా. గంగాధరం ఇదంతా పేరుకోసం చేశాడని మాత్రం అందరూ చెప్పుకోసాగారు. ఊరివాళ్ళు తెరిచిన బళ్ళలో ఏం బోధించారో స్పష్టపడింది.

ఆనాడు సాయంత్రం మూడుగంటలప్పుడు, ఏమీతోచక, సిగరెట్టు కాలుస్తూ గదిలో కూర్చుని జరిగిన ఘటనల నూహించుకుంటున్నాడు గంగాధరం. నోట్లోకి పీల్చుకున్న పొగని వలయాలుగా మార్చి విడువడానికి యత్నిస్తున్నాడు. కాని అతను ఆశయాల సాధనకు వేసుకున్న పథకాలకు మల్లే అవీ గాలి ఊపులకు విచ్ఛిన్నమై పోతున్నాయి.

* * *

వడలు చెడిపోతున్నాయని భర్తతో చెప్పడానికివచ్చిన శారద,భర్త వలయాలుగా విడుస్తున్న పొగల్ని చూసి, అతను కూడా తనకుమల్లేనే ప్రయత్నంలో విఫలుడౌతున్నందుకు నిర్ఘాంతపడి ఏమీ అడుగలేదు. తగినంత మోతాదుకు వేడెక్కని నూనెలో విడిచిన వడల వలెనే, వాతావరణం నిశ్చలంగా లేని గదిలో అతను విడిచే ధూమ వలయాలు కూడా విచ్ఛిపోతున్నై. ★

భిన్నహృదయాలు

"సుగుణా! త్వరగా యిలారా ఒకసారి!"—అంటూ గోపాలం కేకేశాడు. సమాధానం లేదు. "నీకు పుణ్యముంటుంది! ఓ సారి యిలా రద్దూ! అంటూ మళ్ళీ కేకేశాడు.

అది శరద్రాత్రి. ఆకాశంలో నక్షత్రాలు అక్కడక్కడ మినుకుమినుకుమంటున్నాయి. పండువెన్నెల నిచ్చే నిండుపున్నమ చంద్రుణ్ణి చూస్తూ దొడ్లో అరుబయట గోపాలం ఒంటరిగా కూర్చున్నాడు. మందమలయమారుతం వీస్తుంటే చంద్రుడు తన చల్లని తెల్లని వెన్నెలతో ప్రపంచాన్నంతటినీ సమ్మోహింప చేస్తున్నాడు. తానొంటరిగానే కూర్చున్నానని జ్ఞప్తికి రాగానే గోపాలం భార్యని పిలిచాడు, ఆ ఆనందానుభూతిలో అర్ధభాగం అందివ్వడానికి కాబోలు.

కొద్ది క్షణాలకు గోపాలం ఏం చెప్తాడో అని ఆశతో—కాదు ఆశ్చర్యంతో వచ్చింది సుగుణ! అంత అర్జంటుగా ఎందుకు పిలిచాడో అర్థంకాక అమాయకంగా చూస్తూ నిలబడింది.

"సుగుణా!—యిలా చూడు!—ఈ రాత్రి ఎంత హాయిగా ఉందో! ఈ వెన్నెల ఆ చంద్రుడు—ఈ మందమలయమారుతము ఆ మల్లెపూల ఘుమఘుమలు—సంవత్సరం పొడుగునా యిలాగే ఉంటే ఎంత బాగుండేది?" — అంటూ కవిత్వధోరణి సాగించాడు గోపాలం?

సుగుణ తెల్లబోయింది. ఆమెకు ఏం సమాధానం చెప్పాలో అంతకన్నా అర్థంకాలేదు. ఏదో పనుండి పిలిచాడనుకుంది. కాని యిలాంటి కవితోపన్యాసము యిస్తాడనుకోలేదు. ఇలాటి ఉపన్యాసాలామెకేం కొత్తగాదు. సుమారు ఆమె వచ్చిన యేడాదినుంచి యిది నిత్యం ఉండేవే!—నిజంగా ఆ రాత్రి చాల హాయిగానే ఉంది!—కాదని ఎవరన్నారు? అయినంత మాత్రాన ప్రతి వ్యక్తికీ సుఖమే కాని దుఃఖం ఉండదనా!—జీవితమంటేనే సుఖదుఃఖమయము—అని పాపం అమాయకుడైన తనభర్తకు తెలియదనుకొంది సుగుణ!

తన భావావేశానికి సుగుణ వంతపాడుతుంది అని ఎంతగానో ఆశించి ఎదురు చూస్తున్నాడు గోపాలం!... కాని ఆమె అన్నివిధాల మంచిదని మౌనం వహించింది.

దాంతో గోపాలం కొంచెం దెబ్బతిన్నాడు. "ఇలాంటి సుందరదృశ్యాల్ని చూస్తుంటే నీకానందం కలగడం లేదా సుగుణా!"—అన్నాడు గోపాలం.

"అలాటివి చూచి ఆనందించడానికి కవులైనా కావాలి లేక కనీసం కవితాహృదయుమైనా ఉండాలి!—నాకొ రెండూ లేవు" అంది మెల్లగా!

"ఆ! నువ్వెప్పుడూ యిలాగే అన్నావు!" అంటూ కొంచెం విసుక్కున్నాడు.

ఆ చల్లని వెన్నెలరాత్రిలో ఆమెను దగ్గరగా చేరదీసి తనివితీరా ముద్దాడుదామన్నంత ఆవేశంతోనూ, ఆశతోనూ ఆమెను పిలిచాడు. కాని అంతా తల్లక్రిందులయింది. చల్లటిగాలి నరాల్ని పీకినట్లనిపించింది. గోపాలం ఉద్రేకం తగ్గి చల్లబడ్డాడు. సుగుణ మారుమాటాడకుండ లోపలికెళ్ళిపోయింది.

సోమంచి రామం

ఇలాటి నిస్తేజమైన, నిస్సారమైన జీవితం గడపడానికా తానామెను వివాహమాడింది? - ఆమెతో ఏడాది కాపరం చేశాడు అప్పుడే! - అయితేయేం అందం, ఆనందంలేని జీవితం - ఆమెపై తాను పెట్టుకున్న ఆశలన్నీ నిరాశలయ్యాయి. తన ఊహాశక్తిని అర్థం చేసికోలేకపోతోంది ఆమె - ఇంతెందుకు? ఆమెకు తనకి మధ్య ఓ అగాధం అడ్డం ఉంది. ఆమెతో ఆదర్శ జీవితాన్ని గడపాలనుకున్నాడు గోపాలం. కాని ఆ క్షణంతో అర్థంచేసికొన్నాడు అదిమాత్రం అసంభవం అని - మంచి వయస్సులో, ఆరోగ్యంగా ఉండి అన్నివిధాల చక్కగా ఉన్న తాను ఆమెతో యిలా మొండిబారిన సంసారం ఎన్నాళ్ళు గడపగలడు? పదే పదే సార్లు యీ ప్రశ్నే అతని బుర్రలో మెదిలింది. సమాధానం - ఏమయినాసరే! దీనికంతు తేల్చుకోవాలనుకున్నాడు.

అలాగే అక్కడే కూర్చుని ఆలోచిస్తున్నాడు గోపాలం! ఆ సమయంలో అతని మనస్సు పరిపరివిధాల పరుగెత్తింది. గతించిన మధురస్మృతులు - తన బాల్యజీవితం జ్ఞప్తికి రాసాగాయి.

నిజంగా తానెంత అదృష్టవంతుడు! ఆ రోజుల్లో-కాలేజీ రోజుల్లో అతనికి ఆంధ్రా షేక్స్పియరు అని పేరుండేది? గోపాలం అంటే తెలియని వారెక్కడ ఆ పేరు తెలుసు! పేరుకు తగ్గట్టుగానే కవిత్వం రాసేవాడు - మెప్పుపొందేవాడు. విశాలమైన ఆ నేత్రాలు, ఆ గిరజాలజుట్టు - ఆ నుదురు - అన్నీ కవితాలక్షణాలేనని పొగడేవారు. అసలు యింకా వెనక్కిపోతే అతను బాల్యమునుంచీ అదృష్టవంతుడే!

* * *

గోపాలం తల్లిదండ్రులు మంచి గౌరవ సంప్రదాయాలు కల కుటుంబీకులు. తండ్రి తాతలనుంచి వంశపారం పర్యావస్తున్న కవిత్వమే గోపాలానికీ అలవడింది. అయితేయేం గోపాలం దాన్నే జీవనోపాధిగా తలంచకూడదనుకున్నాడు. కాలక్షేపార్థం కవిత్వం వ్రాయాలి కాని కట్టుకున్న భార్యబిడ్డలు కూడుగుడ్డలేక కుమిలిపోతూంటే తాను కవితాలోకంలో కలలుకంటూ కాలం గడపడం చాల హేయమని గట్టిగ విశ్వసించాడు గోపాలం.

తన చిన్నతనమునుంచీ తానెంతో 'సుఖప్రదమైన జీవితాన్ని గడపాలని, గడుపుతానని ఆశించాడు. చదువుకునే రోజుల్లో స్కూల్లో బహుమతులన్నీ తనవే! తాను లాయరు అవుతానని తల్లితో పందెం వేశాడు. వాదనాశక్తి - మొండివాదం తన కెక్కువగ చేతవునని గోపాలం అభిప్రాయం - కాని ప్రఖ్యాత రచయితగ తయారవవలసిన గోపాలాని కాల్లిడరీవృత్తి? - గోపాలం కాలేజీ చదువు కూడా చాల చిత్ర విచిత్ర సంఘటనలతోనే గడిచింది. సమాజ దుర్మార్గాలు, సాంఘిక దురాచారాలు అతని కళ్ళకు కట్టినట్లు కనబడ్డాయి. అందుకు కారణము - తనకు సీనియరు అయిన బాల్య వితంతువుతో అతనికి పరిచయ మేర్పడడమే - ఆమె స్థితికి తానెంతో బాధ పడ్డాడు. జాలిపడ్డాడు. ఆమె తరఫున వాదించాడు. సంఘం మాయాఅద్దంలాంటిదన్నాడు. సంఘపు కట్టుబాట్లు మనచేతనే నిర్మింపబడ్డాయి. అవసరమైతే వాటిని తెంపేయాలని ఉద్రేకంతో ఉపన్యాసాలిచ్చేవాడు. ఫలితం! - ఫ్రెండ్సంతా అతన్ని హేళన చేశారు.

ఈలాటి సమయంలో గోపాలానికి తన పెళ్లి ఒక పెద్ద సమస్యఅయి కూర్చుంది. పెళ్లి మాట తలపెట్టేసరికి తానేదో పెద్దగోతిలో ఊబిలో దిగబడుతున్నానన్నట్లు భావించేవాడు. ఆ ఊబిలో కాలు పెట్టడానికి చాల ధైర్యం ఉండాలని గోపాలం అభిప్రాయం. అందుకోసమే మానసికంగా

★ భిన్న హృదయాలు ★

ఎంతో ధైర్యాన్ని నిలవచేయసాగాడు. అతను కాలేజీలో చదివిన మొదటి రెండేళ్లలోను అతని క్లాసులో ఆడపిల్లలు లేరు. ఛా! ఛా; – ఎంత దురదృష్టం – నిజంగా దురదృష్టం కాకపోతే తన సీనియర్ క్లాసులోనూ ఉన్నారు. తన జూనియర్ క్లాసులోనూ ఉన్నారు. తన ఖర్మ కాకపోతే తన క్లాసులో నేనా లేకపోవడం – ఎంత నిర్భాగ్యుడు తాను? – "పోనీ యీ కాలేజీ మారితేనో" – అనుకున్నాడు గోపాలం – అంతే!—

అదిగో! సీతాకోక-చిలకలా కలకలాడే కోమలాంగుల మధ్య గోపాలం – మొత్తానికి అనుకున్నంతా అయింది! తాను కోరినట్లుగానే తన క్లాసులో ఆడపిల్లలున్నారు – కాదు. తా నాడపిల్లల క్లాసులో ఉన్నాడు. ఈసారి ఏదో ఉద్భుతము జరగవచ్చు ననుకున్నాడు. ఏడాది గడిచింది. ఏమీ జరగలేదు. ఇంతా చేసి తన క్లాసులో ఉన్న ఆడపిల్లలు నలుగురు. అందులో ఒక అమ్మాయి బాగానే ఉంటుంది. అన్ని విధాల తన ఆదర్శాలకి తగినట్లుగానే ఉంది! అదృష్టం తనదేనని ఉప్పొంగిపోయాడు గోపాలం!– పాపం! అయితేయేం? ఆ అమ్మాయికి పెళ్ళి అయిపోయింది!– ఇక యింకో అమ్మాయి– ఓ మోసరుగా బాగానే ఉంటుంది. అందరి దృష్టుల్ని ఆకర్షిస్తున్నట్లుగా ఓరగా చూస్తూంటుంది. ఫర్వాలే దనుకున్నాడు గోపాలం. పాపం! అయితేయేం? ఆ అమ్మాయి పరిత్యక్త! భర్త ఆమెను వదిలేశాడంటారు కొందరు ఆడవాళ్లు! లేదు ఆమే భర్తను వదిలేసిందంటారు కొందరు మగవాళ్ళు! ఏదైతే నేం? ఇక మూడో అమ్మాయి– ఈదురో మంటూ ఎక్కడేశావే గొంగళి అన్నసామెతగా ఉంటుంది. నాలుగో అమ్మాయి. ఆ! వేరే చెప్పడంకూడా ఎందుకు? మరిఅయితే యిక తాను పెళ్ళిచేసికోవాల్సిం దెవర్ని?– తాను నిర్మిస్తున్న ఆదర్శసౌధం కూలిపోవాల్సిందేనా ఇంకా కాలేజీలో చాలామంది ఆడపిల్ల లున్నారు. అయితేయేం! ఎదుటపడి అడగటానికి ఆత్మాభిమానం అడ్డుతగిలింది. అంతకన్న ముఖ్యం ధైర్యం చాలదు గోపాలానికి!

ఇక యింటిదగ్గర గోపాలం తల్లి తండ్రులకి గోపాలం పెళ్ళివిషయం ఎక్కువగా బాధించసాగింది. గోపాలం తండ్రి తన స్నేహితుడి కూతుర్ని చేసుకోవడానికి అంగీకరించాడు. కాని గోపాలం తల్లిమాత్రం అందు కొప్పుకోలేదు. కారణం కోడలు కట్నం ఏమాత్రం తేలేదు. అంతే! ఆ సంబంధంవల్ల కాదన్నది ఆ తల్లి! గోపాలం తండ్రి కేమీ పాలుపోలేదు. గోపాలానికి తెలియపర్చాడు ఈ సంగతి. గోపాలానికి కట్నమంటే తగనిమంట. మరి అభ్యుదయవాదికదూ! పరాయివాళ్ళ సొమ్ముమీద బ్రతకడం తనకు పశువుతక్కువ అన్నాడు గోపాలం; కొడుకు తనపక్షమే అవడంతో తండ్రికి కొంచెం ధైర్యంవచ్చింది శెలవలకు గోపాలం యింటికొచ్చాడు. పెళ్ళికూతుర్ని చూసుకుందుకు వెళ్ళాలన్నారు. పెళ్ళికూతురు సుగుణని చూశాడు గోపాలం. ఫరవాలే దనుకున్నాడు. అంత అపురూప సౌందర్యవతి కాకపోయినా అనాకారి మాత్రం కాదు. పెద్ద కాలేజీచదువు చదువుకోకపోయినా ఆమెలోని నిర్మలత్వము, అమాయకత్వం గోపాలాన్ని ఆకర్షించాయి అని చెప్పకతప్పదు. తాను నిర్మించబోయే ఆదర్శ సౌధానికి అండదండగా నిలిచేందుకు అలాంటి అమాయకపు ఆడపిల్లకే అర్హత ఉంది. అని నిర్ణయించాడు. తన కవితాలోకంలో చేయి చేయి కలిపి విహరించడానికి అలాటి నిర్మల హృదయానికే అవకాశముంది అని నిశ్చయించుకున్నాడు. ఒక్కమాటలో చెప్పాలంటే—కవితాశక్తి, కవితా హృదయం, కల్గిన గోపాలం ఎన్ని కష్టాలొచ్చినా, ఎన్ని అవాంతరాలొచ్చినా సుగుణనే వివాహమాడాలని నిర్ణయించుకున్నాడు.

మంగళవాయిద్యాలు మారుమ్రోగుతుంటే మహావైభవంగా నిర్విఘ్నంగా గోపాలం పెళ్ళిఅయింది. గోపాలం ఫ్రెండ్సంతా వచ్చారు. పెళ్ళికూతురు బాగానేఉంది అని సర్టిఫికేటు యిచ్చారు అంతాచేరి. సందడి తగ్గగానే పందిళ్లు తీసేశారు. గోపాలం కాలేజీకి వెళ్ళిపోయాడు. ఆఖరిసంవత్సరం-కష్టపడి చదవాలనుకున్నాడు. కాని కాలేజీ యూనియన్ ప్రెసిడెంటుగా నిలబడి నెగ్గాల్సొచ్చింది. ఆదరంతో అందరు అభినందించారు. చేతిక్రింద పదిమంది సెక్రటరీలతో గోపాలం మా 'బిజీ'గా ఉన్నాడు. గోపాలం ప్రియమిత్రుల్లో వివాహిత సూరి ఒకడు. సూరి ప్రోత్సాహంతో సుగుణకు ప్రణయలేఖలు–తొలిసంసారపు ప్రేమలేఖలు–వ్రాయసాగాడు గోపాలం:–సూరి మా చెడ్డమాటకారి! చమత్కారి–డిబేట్లలో చాల గల్లంతుగా మాట్లాడుతాడు. తాను ఉపన్యాసం ఇస్తుంటే అందులో వెర్బ్లుండవు. పైగా ఎవరేనా మాట్లాడుతుంటే అందులో చాలా స్పెల్లింగ్ తప్పులున్నాయంటాడు లేచి. స్పీచ్ లో స్పెల్లింగ్ తప్పులేమిటో!–అలాటి అల్లరి సూరి గోపాలందగ్గర చేరి "నేనివాళ సరళతో గంట-గంటేం-గంటన్నర సేపు కబుర్లాడాను" అంటాడు. గోపాలం ఆత్రుతతో–"దేన్ని గురించి?" అనేవాడు. "అది చాల రహస్యమయిన విషయం" అయినా పెళ్ళయినవాళ్లు సంసారపు సంగతులనేకం మాట్లాడుకుంటారు. నీకే తెలుసు:–నువ్వు వట్టి ప్రాడివి!" అనేవాడు గొప్పగా సూరి! సరళ కూడా పెళ్లయిన' వాళ్ల క్లాసు మేటు!–సూరి చెప్పేదంతా వట్టిగాసు అని గోపాలానికింకా తెలియదు. సూరి సరళకు అప్పుడప్పుడు పుస్తకాలు యిచ్చేవాడు. ఆమె చదువుకుని "Thanks for Your Help." అని చీటీ వ్రాసి పంపేది.—సూరి అలాంటి చీట్లన్నిటిని జాగ్రత చేసి ఫ్రేము కట్టించి బట్టలపెట్టె అడుగున భద్రపరిచి గోపాలానికి చూపించి గొప్ప చెప్పుకునేవాడు. ఇవన్నీ చూసి సూరి, సరళలకు చాల సన్నిహితసంబంధం ఉందనుకునేవాడు

గోపాలం. కాని ఒక సందర్భంలో సరళే తనదగ్గర యిలాఅంది!-"అతనా!-సూరి!-వట్టి Simpleton C. M. G. Brother." తెల్లబోయాడు గోపాలం!-

కాని అప్పటికప్పుడే సూరి సలహా ననుసరించి సుగుణకు- తన క్రొత్తభార్యకు ప్రేమలేఖలు వ్రాశాడు. సుగుణకంతా అయోమయంగా ఉంది. అర్థంకాక సమాధానం వ్రాయలేదు. ముందు గోపాలం మండిపడ్డాడు. ఉత్తరానికి-అందులోనూ అత్యంత ప్రేమాపేక్షలతో వ్రాసిన ప్రణయలేఖకు సమాధానం వ్రాయకపోవడమేమిటి అని!- తర్వాత తర్వాత ఆలోచించసాగాడు. సుగుణకు పాపం యిలాంటివేమీ తెలియవు"అని అయినా యిలాంటి విషయాలతో బుర్ర పాడుచేసికొంటే పరీక్షపోతుందని పట్టుదలతో పరీక్షలకు చదవసాగాడు.

* * *

పరీక్షా ఫలితాలు తెలిశాయి. ఫస్టుక్లాసులో పాసయాడు గోపాలం! లెక్చరర్సు అంతా అభినందించారు తల్లిదండ్రుల ఆనందానికి అంతులేదు. గోపాలం ఎంతగా ఉప్పొంగి పోయాడో అతనికే తెలియదు. పిల్ల వచ్చిన వేళావిశేషం అన్నారు. ఈశుభవార్త విని సుగుణ ఎంత ఆనందిస్తుందో, తన్నెంత పొగడుతుందో అనుకుంటూ భార్యదగ్గర కెళ్ళాడు గోపాలం! "పాసయారుటగా! బాగుంది!" అని మాత్రం అంది సుగుణ! గోపాలం దెబ్బతిన్నాడు. తానెంతో కష్టపడి సాధించిన యీ ఘన విజయానికి తన ప్రాణేశ్వరి యీయవలసిన కాంప్లిమెంటు యిదేనా?— "You are wonderful! Your speech is marvellous." అంటూ అభినందించేవారే తన కాలేజీ ఆడపిల్లలు-అలాటిది తన భార్య యిలాగేనా అభినందించడం!-అబ్బే-తన తల తీసేసినట్లనిపించింది గోపాలానికి! కాని సుగుణ నెమ్మదిలోను, మౌనంలోనే యిమిడి ఉన్నాయి, ఆమె ఆదరాభిమానాలు, గౌరవ మర్యాదలు అని గోపాలానికి తెలియదు.

చదువు పూర్తయిపోగానే భార్యని పోషించాల్సిన బాధ్యత గోపాలం నెత్తిన పడింది. ఎంతకాలం తల్లితండ్రుల చాటున వారిసొమ్ము తింటూ బ్రతగ్గలను? అని ప్రశ్నించుకున్నాడు!- ఫలితం!- ఉద్యోగాన్వేషణ!- గోపాలం మొదటినుంచీ అదృష్టవంతుడే!- ప్రక్క ఊళ్ళోనే ఉద్యోగం దొరికింది. సుగుణతో క్రొత్తకాపరం ప్రారంభించాడు. తనుకోరిన సుగుణనే పెళ్లిచేసికొన్నాడు. ఫస్టుగా ప్యాసయాడు. అందరికీ మల్లే నేకాక తనకు చదువు పూర్తవగానే ఉద్యోగం వచ్చింది. యింకేం కావాలి? నిజంగా తాను అదృష్టవంతుడేనని అనుకున్నాడు. కాని క్రమక్రమంగా ఉద్యోగం రోజులు దొర్లగా గ్రహించాడు. తనకు సౌఖ్యం కలగటం లేదు. ఉద్యోగం సక్రమంగానే సాగుతోంది. యిక పోతే సుగుణ విషయంలో!-ఆమె తనని అర్థంచేసికోవటం లేదు. ఆమెకోసం తానెంత త్యాగంచేశాడు? తల్లిమాట కాదని కట్నం కానుక లేకుండా ఆమెను వివాహమాడాడు. అయినా ఆమె ఆవిషయాన్ని యీషణ్మాత్రం గుర్తించినట్లు లేదు. ఆమెకు అర్థం చేసికొనే శక్తి లేనట్లుంది. తాను అంటోనీలా ఊహించుకుని ఆమెను క్లియోపాట్రాగా ఆరాధించాడు. కాని తాను ఆంటోనీ అవగలడేమోగాని ఆమె క్లియోపాట్రా మాత్రం యీజన్మకు అవలేదు. ఆమెకు తనకు ఉత్తర దక్షిణధ్రువాలకున్నంత దూరముంది. తెలివితేటల్లో ఆమెకు తనకు కొన్ని వందల యోజనాల దూరముంది. ఆమెకు తనకు ఎందులోనూ పోలిక కనపడ్డం లేదు. ఎందులోనూ ఆమెకు తనకు ఏకాభిప్రాయం కుదరటం లేదు. ఆమెది తనది భిన్న హృదయాలు - జీవితమంటే గులాబీ పూలు పరచబడిన పాన్పు లాంటిదని ఊహించకపోయినా, గులాబీ ముళ్ళు గుచ్చుకోకుండా కాపాడుకోవాలని ఆశిస్తూవచ్చాడు. కాని అంతా తారుమారయింది. భిన్నాభిరుచులు, భిన్న హృదయాలు కలిగిన తమని పెళ్లి పేరిట శాశ్వతంగా ఏకం చేసేశారే అని ఎంతో బాధపడ్డాడు. ఆమెతో నిరుత్సాహంగా ఎంతకాలం యిలా జీవితం గడపగలడు?- ఏమైతేనేం - పెళ్ళి విషయంలో తాను పెద్ద పొరపాటు చేశాననే నిర్ణయానికొచ్చాడు గోపాలం!-ఆనాడు పెళ్ళిరోజున తన కళ్లుమూసుకుపోయాయి అనుకున్నాడు. ఈ ఆలోచనలతో పాపం గోపాలానికి ఎప్పుడో నిద్ర పట్టేసింది. ★

అసంప్రేక్ష్యకారిత్వము... పంచతంత్రము
...అయిదవ భాగము

రాజగారి కొడుకు లాడుకొనుటకు
రాజశాల లందు గలవు కోతులు

శాలలందు కోతులుండు దాపున
బోతడన్ని గొర్రె మందలున్నవి





రోజురోజు దొంగ గొర్రె యొక్కటి
రాజగారి వంట ఇంటి దూరును

వంటవాడు కోపగించి గొర్రెను
గంటెతోనో, చెంబుతోనో కొట్టును





కోతి యొకటి దీని నెల్ల చూచుచు
భీతి నొంది తలచె నిట్లు మనసున

రేపో మాపో వంటవాడు గొర్రెను
కోపగించి కొరివి తోటి కొట్టును






గేయరచన
నండూరి. రామమోహనరావు — బొమ్మలు — బాపు

చిచ్చుముట్టి బొచ్చుకాలి గొర్రెయే
వచ్చిపడును శాలకొక్క గంతున



నిప్పు తగుల తగులబడును శాలలు
అప్పుడశ్వశాల కూడ మండును



మంట తగిలి గుర్రములకు తప్పక
వంటి నిండ పుండులగుట తప్పదు



గాయములకు కోతి కొవ్వు పూసిన
మాయునంచు రాజవైద్యులందురు



కరుణ లేక రాజభటులు కోతుల
నరకి వేసి కొవ్వు తీసి కొందురు



కోట వదలి పోదమనుచు వెంటనే
తోటి వారి తోటి కోతి చెప్పెను



లోకానుభవం

మే నాలుగో తేదీనాటి ప్రశాంత ప్రభాతం. రామకృష్ణ కాఫీ ఫలహారశాల నుంచి తృప్తిగా తిరిగి వస్తూ ౫, ౬, రోజుల బట్టి తను పడుతున్న అవస్థలని తల్చుకుంటున్నాడు.

రామకృష్ణది అసలు విజయనగరం కాదు. దగ్గరలోనే ఒక పల్లెటూరు. తల్లి హితోపదేశంవల్ల విజయనగరంలో మేస్టరీ చేస్తున్నాడు. అతని కా వృత్తి యిష్టం లేక పోవడమేగాక, దాన్ని నిర్వహించగల సమర్థత కూడా లేదు. కంచుకాగడాపెట్టి వెదికినా జ్ఞానం అన్నది కనిపించని కళాశాలా విద్యార్థులందరిలాగే ఇతనుకూడా నోట్సులు వల్లించి ఒక డిగ్రీతో ప్రపంచంలో పడ్డాడని నా అభిప్రాయం కాదు. అతను చదివిన చదువుకి ఆచార్యులే ఆశ్చర్యానందాలలో మునిగిపోయేవారు. కాగా, అతన్ని ఉపాధ్యాయవృత్తికి అనర్హుడిగా చేసినది అతని సిగ్గు; ఎదుటివ్యక్తి ముఖంలోనికి చూసి మాట్లాడలేకపోవడం. అయినా అనర్హులెంతోమంది ఎన్నో ఉద్యోగాలు చేస్తున్నట్టే రామకృష్ణకూడా పాఠాలుచెప్పడానికి సంసిద్ధుడయేడు.

శిష్యప్రసాదితాలైన 'ఆడారి రామకృష్ణ' (Girlish R. K.) మొదలయిన బిరుదులని గాని, ఆడపిల్లలు ముఖాలు తిప్పుగుని నవ్వే ముసిముసి నవ్వులనిగాని లెక్కచెయ్యక పది నెలల పాటు తన ఉద్యోగజీవితం గడిపేడు రామకృష్ణ. కాని ఈ అయిదారు రోజులలోనూ తను పడుతున్న అవస్థలని తలచుకుంటే నలభైమంది కుర్రాళ్ళముందు మాట్లాడడమే తేలిక అనిపిస్తోంది.

సంవత్సరాంత పరీక్షలు అయి రామకృష్ణ వంతుకి అయిదోఫారం లెక్కల పేపర్లు వచ్చేయి. అవే అతనిని ఈ అయిదారు రోజులనుంచి చిక్కులుపాలు చేస్తున్నాయి.

ఉపాధ్యాయుడి జీవితంలో వసంతాలయినా, గ్రీష్మాలయినా కుర్రవాళ్ళ సమాధాన పత్రాలు అతని చేతిలో వున్న ఆ నాల్గురోజులే. ఆ రోజులలో అతని యిల్లు ఒక దేవాలయం అవుతుంది. అతను సాక్షాత్తు దేవుడంతటివాడవుతాడు. మార్కులు తక్కువ వచ్చే పిల్లలూ, వారి బంధువులూ, ఈ దేవరభక్తులు అవుతారు. వారు తెచ్చే 'కానుక' లని పరిగ్రహించి, మార్కులు అనుగ్రహించే మేస్టరు నిజంగా దేవుడే. తద్వ్యతిరేకమయిన పనిచేసేడా, ఆ దేవుడు 'బండగొండి'గా చెలామణీ అవుతాడు

ఇందుకు రామకృష్ణే ఒక చక్కని ఉదాహరణ.

రామకృష్ణ కాలేజిలో ఉన్నపుడు తోటి విద్యార్థులతనిని మంచి ఉన్నతభావాలున్నవాడని గౌరవించేవారు. కాని యిప్పటి పరిస్థితి వేరు. అతని గదికివచ్చి, కొంతసేపు అతనిని పొగిడి, తెచ్చిన వేవో సమర్పించుకుని, 'మా వాడికి కొంచెం లెక్కలే లోటుగావుంది మిగతా వన్నీ ఫస్టుగా రాసేడు లెండి మీరు ఇందులో ఏదో సర్దుబాటు చేసేయాలి' అని అసలువిషయం చెప్పి, కార్యం విఫలం కాగా బుర్రమీద కొంగు వేసుకొని పోతూపోతూ 'ఆ రామకృష్ణ మేస్టరుకి ఎంతోళ అనుకున్నారు!' అని ప్రచారం చేసైనా తృప్తపడతారు కొందరు పెద్దమనుషులు. ఇక పిన్నలు

రుద్రాభట్ల నరసింగరావు

కూడా వారిని అనుసరిస్తారని వేరే చెప్పనక్కర్లేదేమో. ఇది రామకృష్ణకి దుర్భరమైన గ్రీష్మం. ఇదే సమయంలో వసంతాన్ననుభవిస్తున్న మేస్టర్లూ ఉన్నారు. వారు రామకృష్ణవైపు చూసి ఒక చిరునవ్వు నవ్వుతారు—'ఇంత లోకానుభవం లేకపోతే ఎలాగోయి?'—అన్నట్టుగా.

ఇప్పుడు కాఫీ క్లబ్బునుంచి వస్తున్న రామకృష్ణ ఆలోచిస్తున్నది ఈ విషయాలే. నిన్న అతనిదర్శనానికి వచ్చిన ఆఖరి వ్యక్తి గొప్ప ధనవంతుడు. 'ఛాంబర్సు ట్వెంటియత్ సెంచరీ డిక్షనరీ', ఒక పార్కరు పెన్నూ, ఒక నీలిపొడి ఉంగరం-ఇవీ అతను పట్టుకొచ్చిన కానుకలు ఆయన కూతురిపేరు ఎస్. రాజమణిట. పిల్ల చాలా తెలివయినదీ, అన్ని పేపర్లలోనూ మంచిమార్కులు తెచ్చుకోగలిగేదీనూ. కాని దురదృష్టవశాత్తు లెక్కలపేపరు నాడే ఆమెకి విపరీతమైన చెవిపోటువచ్చి పేపరు పాడుచేసింది కాబట్టి అందులో మార్కులు సర్దమని ఆ తండ్రి కోరిక. అమ్మాయికి ఏమంత పెద్దవయసు రాలేదు; ఈ యేడు కాకపోతే మళ్ళీయేడు పాసవుతుందని అతను ఊరుకునేవాడే. కాని అమ్మాయి జీవితంలో అతి ముఖ్యమైన కార్యం ఒకటి పది పదిహేను రోజులలో జరగబోతూంది అలాటప్పుడు పరీక్ష తప్పినట్టు తెలిస్తే ఉత్సాహంఅంతా పోతుందని భయపడి అతను అలా కోరేడు.

నిన్న యెలాగో ఆయనని వదుల్చుకున్నాడు. రాత్రి ఆ రాజమణి పేపరు, దిద్దేడు వచ్చినమార్కు బండిసున్న ఆయనకి మతిపోయి మార్కులు సర్దమన్నాడా? సున్నాని ఎంత, ఎలాసర్దినా సున్నాయే గదా!

గది సమీపిస్తున్న రామకృష్ణ తనగది ముందు నిన్నటి నల్లకారు ఉండడం చూసి 'మళ్లీ వచ్చేడురా దేవుడా' అని విసుగుకున్నాడు. ఆ గ్లాసోబట్టల వెనకనుంచి రివ్వున వీచే గాలి కెగిరే పువ్వుల పరికిణీని చూసి గతుక్కుమన్నాడు రామకృష్ణ. మరి రెండడుగులు ముందుకు వేయగానే, అస్తమయ సూర్యుడి అందాన్ని ధిక్కరించే ఆవాణీ, నిర్మేఘ వసంతాకాశాన్ని మరపించే ఆ నీలపు బ్లౌజూకూడా కనిపించేయి. ఆ అమ్మాయిచేతిలో ఒక పెద్దపుస్తకం—నిన్న ఆయన తెచ్చిన డిక్షనరీయే అయుంటుంది—ఉంది.

ఎలాగో రామకృష్ణ ఆ పెద్దమనిషి నమస్కారానికి ప్రతి నమస్కారం చేసి, ఇద్దరినీ లోపలికి తీసుకువెళ్లి చెరోకుర్చీ చూపించి తానోకుర్చీలో చతికిలబడ్డాడు.

ఆయన పేరు జగన్నాథరావు 'నిన్న ఎంత చెప్పినా ప్రెజెంట్స్ పుచ్చుగున్నారు కాదు. కాని అమ్మాయి వొదుల్తుందా. ఇవేళ అదే స్వయంగా ఇస్తుంది. మీరు అభ్యంతరం చెప్పలేరు.' అన్నాడాయన నవ్వుతూ.

ఆమాట అక్షరాలా నిజం. రామకృష్ణ ముందున్న స్టూలు మీద డిక్షనరీని ఉంచి దానిమీద బ్లౌజునున్న పెన్ను తీసి పదిలంగా పెట్టింది. నిన్న ఆ తండ్రి గ్రహాన్ని వదిలించుకునే టప్పటికే రామకృష్ణ తాతలు దిగివచ్చేరు. కాని ఇప్పుడు ఆ మృదుహస్తాలవైపు చూసే ధైర్యమైనా లేని అతను దీనంగా జగన్నాథరావు వైపు చూసేడు. ఆయన సగర్వంగా కూతురి వైపు చూస్తూ, జేబులోనుంచి టిస్యూ పేపర్లో చుట్టి ఉన్న ఉంగరాన్ని తీసి ఆమెకి ఇచ్చేడు. ఆమె దాన్ని చిరునవ్వుతో డిక్షు

నరీమీదే పెట్టింది.

జగన్నాథరావు నిన్నటి కథే మళ్ళీ చెప్పి యిలా అన్నాడు 'అందులో అమ్మాయి ఓ తెలివైనపని చేసింది. పార్టుటూ పేపరు ఖాళీగా వదిలేసింది. పార్టువన్‌లో కూడా ఓ తెల్లకాగితం అక్కడే పెట్టింది'.

రామకృష్ణకి విషయం బోధపడి గుండె దడదడలాడింది తను ఇంతవరకూ ఒక్కమాటైనా ఆడనందుకు 'నేనింత మూగి వెధవని అయా నేవిఁటి చెప్మా?' అని తిట్టుకున్నాడు. కొద్దిసేపు ఆయన చెప్పేదేమీ అతనికి వినిపించలేదు కాని 'ఆ టేబుల్ మీద పేపరిలా పట్రామ్మా. మేస్టరుగారు నీ పేపరు తీసిస్తారు. ఇక్కడే రాసిద్దువుగాని' అన్న మాటలతో ఉలికిపడి లేచేడు

'క్షమించాలి'

తండ్రీ కూతుళ్లిద్దరూ తెల్లబోయి చూసేరు.

'ఈ పని నా వల్ల కాదు.' అని కంపిత స్వరంతో అన్నాడు రామకృష్ణ.

ఆ అమ్మాయి అతని దీనవదనం చూసి ఏమనుకుందో గాని చప్పున తండ్రితో అంది 'నాన్నారూ, ఇప్పుడు మనం మేష్టారిని ఇబ్బంది పెట్టడం మంచిది కాదు ఇంటికి వెళ్ళిపోదాం పదండి'

ప్రతికా వాక్యపరిపాలకుడిలా కనిపిస్తున్న ఆ తండ్రి రామకృష్ణతో 'సరే మీ యిష్టం' అని మాత్రం పలికి 'మరి సెలవు' అని లేచేడు.

రామకృష్ణ డిక్షనరీని దానిమీదున్న పెన్నూ ఉంగరాలతో సహా అలాగే ఎత్తి పట్టుకుని 'వీటిని తిరిగి—' అనబోయేడు.

ఆయన నవ్వి 'ఎంతమాట మేష్టారూ. వీటిని మీకు ప్రెజెంట్ చెయ్యడంలో మాకు వేరే ఉద్దేశం లేదు కేవలం అమ్మాయి కోరిక. అంతే, ఇది మీకు ధర్మం కాదు' అని కూతురితో సహా కారెక్కి మరోసారి నమస్కారం చేసేరు.

ఈ వ్యవహారాన్ని ఇంత సులభంగా పరిష్కరించిన ఆ అమ్మాయికి రామకృష్ణ మనస్సులోనే సహస్రవందనా లర్పించేడు. కాని అతనికి వెంటనే జాలివేసింది. బహుశా కూతురిపరించి జగన్నాథరావు చెప్పినదంతా నిజమేనేమో. తనని అంతత్వరలో అంత నేర్పుగా చిక్కునుంచి తప్పించగలిగిన ఆమెకి చదువులో తెలివితేటలు తక్కువవుతాయా? నేర్పు మాటకేం? ఆమె అందమో? తను విసిరిన రెండు మూడు దొంగచూపులలోనే తనని ముగ్ధుడిని చేసిందే ఆమె అందం! పెద్దకళ్లు! చిన్నిముక్కు! సుంద్రనిముఖం! బ్రహ్మ మున్ముందు ఆమెకి లెక్కలలో గాబోయే మార్కుని దృష్టిలో పెట్టుకుని ఆమె ముఖాకారాన్ని తయారు చేసేడా అనిపించింది రామకృష్ణకి. పాపం, ఆమె ఎంత చిన్నబుచ్చుకుంటుందో.

అయినా తను ఇక్కడుంటే లాభం లేదు. ఎవరో ఒకరు బాధపెడుతూనే ఉంటారు పేపర్లు పట్టుకుని స్వగ్రామం పోతే ప్రశాంతంగా ఉంటుంది మళ్లీ వాటిని దిద్దియివ్వవలసిన నాటికి ఈ దిక్కుమాలిన పట్నం రావచ్చుననుకున్నాడు అనుకోవడమే తడవుగా పెట్టె సర్ద నారంభించేడు.

* * *

శేషగిరి మంచంమీద పడుకుని గోర్లుతూ అరుస్తున్నాడు: 'అక్కయ్యోయ్, ఎంతకీ కాఫీ పట్రావేఁ?'

'వస్తున్నానుండరా మరీ.' వంటింట్లోంచి కామేశ్వరమ్మ కంఠం వినవచ్చింది

శేషగిరి ఆవలించి చిటికెలు వేస్తూ లెక్కపెట్టడం ప్రారంభించేడు 'తొంభయి తొమ్మిది, నూరూ అక్కయ్యా.'

'ఏం గోలరా నాయనా నీ పెళ్ళాం ఎలా వేగుతుందో గాని' అంటూ కామేశ్వరమ్మ వచ్చి మంచం పక్కనున్న స్టూలుమీద కాఫీ పెట్టింది

'మీబావ మళ్లీ లెక్కలమేస్టరి దగ్గరకి వెళ్లేరురా. కాని పని జరిపించుకొస్తారన్న నమ్మకం నాకు లేదు'

'ఏం, బావ ఎంతపట్టుకెళ్ళేడు?' అని లేచి కూర్చున్నాడు శేషగిరి

'రొక్కం కాదురా. ఓడిక్షనరీ, ఓ మాంఛి పెన్నూ, తర్వాత ఉంగరం, అంతా కలిపి ఓ డెభ్భయిరూ—'

కాఫీకప్పు నందుకోబోయిన శేషగిరి చెయ్యి ఎలక్ట్రిక్ షాక్ తగిలినట్టు వెనక్కి వచ్చేసింది 'ఏవిఁటీ! డెభ్భయిరూపాయిలే! నాలుమార్కులు పర్దిపెట్టడానికి లంచం డెభ్భయ్యే!!!' అసలే పెద్దవైనకళ్లని కోడిగుడ్లంత లేసి చేసి అన్నాడు

కామేశ్వరమ్మ తమ్ముడి అకారణ ఆవేశాలకి అలవాటుపడినదే గనుక ఏమీ జవాబివ్వక తన గదిలోనికి వెళ్లింది. ఇనుపబీరువా తెరిచి ఏపదిరూపాయల నోట్లు లెక్కపెట్టి తెచ్చి తమ్ముడి మంచంమీద పెట్టింది.

'ఇవెందుకు?' అన్నాడు శేషగిరి ఆశ్చర్యంగా.

'చెప్పలేదూ. ఆ మేస్టరు మార్కులు వేస్తాడని నాకు నమ్మకం లేదు. అతనో మొండిఘటంట. నువ్వు హెడ్మాష్టర్ని కలుసుకోవాలి'

'ఏవిఁటేవిఁటి? డెభ్భయికి లొంగడూ?! ఏదేనా బావ అమాయకత్వాన్ని బట్టి ప్రతివటూ బిర్రబిగుస్తాడు. చూడు, నేనిప్పుడో వెళ్తే హెడ్మాష్టరూ నాడితలలోని జేజెమ్మనికూడా లొంగదీయకపోతే' అన్నాడు శేషగిరి పద్మవ్యూహాన్ని చొరబోయిన అభిమన్యుడిలాగ నిలబడి.

'ముందు కాఫీతాగు, చల్లారిపోతుంది' నవ్వుతూ అంది అక్క.

కొంచెం సిగ్గుపడి కాఫీకప్పు పెదిమలకి అందించేడు శేషగిరి.

'ఒరేయి నువ్విప్పుడే హెడ్మాష్టరుగారింటికి వెళ్లి ఓ అరగంటలో తిరిగొచ్చేయాలి. మీ బావతో మాత్రం చెప్పకమీ. నీకు పుణ్యం ఉంటుంది. ఆయన కందరికాళ్లూ పట్టుకోడం యిష్టం లేదు.' కామేశ్వరమ్మ రహస్యంగా చెప్పింది.

బయట కారు హారన్ మోగింది.

'అలాగేలే. బావ వొచ్చినట్టుంది.'

★ లోకానుభవం ★

అంటూ కాఫీ పూర్తిచేసి హాలులోనికి నడిచేడు శేషగిరి.

ఇంతలో జగన్నాథరావూ, ఆయన వెనుకనే రాజమణి హాలులోనికి ప్రవేశించేరు. ఆయన ఒకకుర్చీలో బరువుగా కూర్చున్నాడు. రాజమణి సరాసరి తన గదిలోనికి వెళ్లిపోయింది

"ఏంబావా కాయా, పండా?" అన్నాడు శేషగిరి తానొక కుర్చీలో కూర్చుంటూ

"కాయేనోయ్, పచ్చికాయ" అన్నాడు జగన్నాథరావు నీరసంగా నవ్వి

"మరా వొస్తువు లేవి?" ఆత్రుతగా ప్రశ్నించేడు శేషగిరి.

"ఆయనకి ప్రెజెంట్ చేసేసేను" నిర్లక్ష్యంగా ఉంది జవాబు.

"ఏవిఁటీ? మా దుక్కాణం వెయ్యాకపోయినా?!"


"ఊఁ"

"ఏవిఁటేవిఁటీ?! అంత డబ్బా గంగపాలే?!"

జగన్నాథరావుకొంచెం విసుక్కున్నాడు. "పోనీవోయ్ వెధవ డబ్బు. పిల్లపరీక్ష పోగాలేనిది డబ్బెందుకూ?"

శేషగిరి నొచ్చుకున్నాడు. "సరే, మీయిష్టం. పిల్లా జెల్లాకోసం ప్రతివాడూ కడుపుకి తిండికూడా మానుకుని నాళ్లకి నిరవాకంకోసం పడి చస్తున్నాడు. మిమ్మల్ని అలా చెయ్యమని కొందునే చెప్పేది. కాని వృథాగా పోస్తే ఆగోల నాకెందుకు? అన్నట్టు అక్కయ్యా, నేనలా వెళ్లొస్తాను మరి మీరిలా కూర్చుంటే కొందు. ప్రయాణానికి సిద్ధంగా ఉండండి పొద్దెక్కిపోతోంది" అని లేచి వెళ్లేడు

వీధిలో పడగానే రెండు నోట్లు పక్క జేబులోనూ, మూడు పైజేబులోనూ పెట్టి నడక సాగించేడు హెడ్మాష్టరు యింటివైపు.



"వాడేం చెప్పినా మన మంచికే చెప్పేడండీ. మీ రనవసరంగా విసుక్కున్నారు" భర్తమీద తీర్పు చెబుతూ అంది కామేశ్వరమ్మ.

"నీ తమ్ముణ్ణి నే నేమీఁ అనలేదే నువ్వెందుకు ఊరికేఅలా ఆవరాసుకుపోతున్నావ్?" అన్నాడు జగన్నాథరావు నవ్వుతూ.

కామేశ్వరమ్మ తెచ్చికోలు కోపంతో "నే చెప్పందూ ఆవరాసుకుపోతూనే ఉంటానుగాని, మీలాగ ఇంకోళ్లకి రాయనుగదా, వేగిరం స్నానానికి లేవండి. రైలు మనకోసం ఆగదు" అని ఒక గొప్ప సత్యాన్ని భర్తకి గుర్తుచేసి, రాజమణి గదిలోకి వెళ్లింది.

మంచంమీద కళ్లు తుడుచుకుంటూ కూర్చున్న కూతుర్ని చూసి తెల్లబోయింది తల్లి. తల్లినిచూసి సిగ్గుపడింది రాజమణి.

'అదేవిఁటే?' అంది కామేశ్వరమ్మ మంచంమీద చతికిలబడి.

'ఏవీఁ లేదు' రాజమణి ముక్తసరిగా పలికింది.

'మరెందుకేడుస్తున్నావ్?'

'ఎందుకూ లేదు.'

'మేష్టరుగారేవేఁనా అన్నారా'

'ఊహూఁ ఆయ నోర్లి లోకానుభవం లేని మనిషి. తగనిసిగ్గు. తలెత్తి మాటేనా ఆడలేదు'

'మరి?'

'ఆయన్ని మనం అనవసరంగా బాధపెట్టేవఁమ్మా.'

'ఓసి నీ యిల్లు బంగారంగానూ' అంటూ కామేశ్వరమ్మ గడ్డం నొక్కుకుంది 'దిక్కేనా? అసలలాటి మనుష్యుల్ని బహాల్లు బాధపెట్టక్కర్లేదే పిచ్చిదానా వాళ్ళంతటవాళ్ళే బాధపడుతూంటారు మనమేం లంచం పుచ్చుకుని దొంగపని చెయ్యమన్నావాఁ? "పిల్లతెలివైనదేను. ఇదుగో ఇలాటి ఆటంకం రాబట్టిగాని లేకపోతే నిక్షేపంలా ఫస్టుగా పేసయ్యేది" అని మీనాన్న చెప్ప లేదూను'

'అక్కడే వచ్చిందే చిక్కు, ఆయన నమ్మలేదు. నన్నొట్టి మొద్దుకింద కట్టేసేరు?' తన తెలివితేటలని గుర్తించని మేష్టరు తెలివితక్కువతనానికి చింతిస్తూ చెప్పింది రాజమణి

'అదాయన అప్పకొద్ద రాజా, తన దగ్గరకి మార్కులకోసం వచ్చేవాళ్ళంతా అంతలే అని ప్రతీ మేష్టరూ అనుకుంటూనే అనుకుంటాడు' అని మెల్లగా చూసి గొంతు తగ్గించి, 'ఈ పరీక్ష తప్పకుండా పేసవుతుందే మావయ్య మీ హెడ్మేష్టరు దగ్గరకి ఏర్పాటు చేసుకుని వెళ్ళేడు. మీ నాన్నకి అంటే ఏ వ్యవహారం చేతగాదుగాని వాడు మాత్రం ఇలాటివాట్లో గట్టివాడు,' అంట

ఇంత సంతోషకరమైన వార్త విన్నప్పటికీ రాజమణి ముఖకవళికలు మారలేదు. అది చూసి కూతురి మేనమామనీ తండ్రినీ కలిపోల్చుదాం అనుకున్న తల్లి అంతటితో ఆ ప్రయత్నం విరమించింది. లేస్తూ 'ఊఁ మరి యిలా కూర్చుంటే ఎలా కుదురుతుంది. లే. రైలు వేళవుతూంది' అని ఒక హెచ్చరిక మాత్రం చేసి గది విడిచింది.

జగన్నాథరావుయొక్క ఈ సకుటుంబ ప్రయాణం శేషగిరియింటికి. శేషగిరిది విశాఖపట్నం. ప్రతీ వేసవి సెలవులకీ అతను విజయనగరం వచ్చి అక్కా, బావా, పిల్లల్నీ తన యింటికి ఆహ్వానిస్తుంటాడు. దీనికసలు కారణం బావకుటుంబం విజయనగరం ఎండలకి తట్టుకోలేరనే భయంకాదు జగన్నాథరావు డబ్బుతోనే (ఆయనకి తెలియకుండా) ఆ నెల్లాళ్ళపాటు తనసంసారం కూడ సుఖంగా బతకాలనే ఆశ. దానికి అక్కయ్య మద్దత్తు ఉండనే ఉంటుంది ఆడపిల్ల పుట్టింటినుంచి ఆశించనూ గలదు. భర్త సాధుస్వభావి, నాలుగురాళ్లుసంపాదించగలవాడూ అయితే పుట్టింటి వారికే పెడుతుంది.

* * *

రామకృష్ణ స్వగ్రామం వచ్చేడు. కాని యిక్కడ కూడా అతను ఆశించిన ప్రశాంతత దొరకలేదు తల్లి, తండ్రీ చూపే అతి వాత్సల్యం, పల్లీయుల అనవసర ప్రసంగాలూ అతనికి వెగటుగా తోచేయి. మునుపు కాలేజీ సెలవులలో అనేకసార్లు ఇంటికి వచ్చేడు. కాని యెప్పుడూ ఇలా అనిపించలేదు. పైగా వీటన్నిటికీ యెంతో మురిసిపోయేవాడు. అయితే పుస్తకాలూ, ఊహాగానమే ప్రధానంగా గల నాటి కాలేజివిద్యార్థికీ, వాస్తవ పరిస్థితులని ఎదుర్కొంటూ, లోకానుభవం కొంత సంపాదించి తన నిజమైన విలువని గుర్తించగలిగిన నేటి బడిపంతులు రామకృష్ణకీ పోలికే లేదు. అతనిలో కలిగిన పరివర్తన వల్లే వీరిచ్చే గౌరవాదరాలు అతనికి రుచించలేదు.

దానికితోడు అతని పెళ్ళిప్రసక్తి ఒకటి వచ్చింది. పిల్లలక్ష్మిలాగ ఉంటుంది. లక్ష్మీపుత్రుడి పుత్రిక పిల్లతండ్రి రామకృష్ణతండ్రి కలసి కట్నకానుకలన్నీ ఖాయపర్చుకున్నారు. రామకృష్ణ పెళ్ళిచూపులకి వెళ్ళడమేతరవాయి. కాని రామకృష్ణకి ఇప్పట్లో పెళ్లి అంటే యిష్టం లేదు. పుస్తె కట్టడం అంటే కట్టినవాడి కాళ్లకి బంధం వేసుగోడం అన్నమాట; మనీపర్సుని చొక్కా జేబులోంచి చీరమడతల్లోకి బదిలీ చెయ్యడం అన్నమాట—అని అతని ఉద్దేశం.

కాని అతని ఉద్దేశప్రకారం ఎప్పుడు జరిగింది గనుక? ఇష్టంలేని మేస్టరీలో తల్లి బలవంతంవల్ల చేరక తప్పలేదు. పెళ్ళి తనకి ఇషం లేకపోయినా గొప్పయింటి వారు పిల్లని స్తామనడం వలన ఈసారి తండ్రిబలవంతంమీద చేసుకతీరాలి. ఇంటనుంచి అధికారానికి లోబడినా రానిసమం మరొక్క ఆడదాని అధికారానికి లోబడితే వస్తుందా? పై సంవత్సరం తన యింటికి మార్కులకోసం వచ్చేవారికి తన సతీమణే 'ఆయన యింట్లోలేర'ని చెప్పి పంపిస్తూంటుంది! ఇదీ అసలు లాభం! అంచేత పెళ్లి చేసుకోవాలనే నిశ్చయించుకున్నాడు రామకృష్ణ. కాని పెళ్లిచూపులకి పేపర్లొచ్చివచ్చేక చూస్తానని మాటయిచ్చి విజయనగరం బయలుదేరేడు.

సమాధానపత్రాలు నాక్కులకి అందజేసేడు. ఫలితాలు వచ్చేవరకూ ఉన్నాడు.

ఆ వేళ అతనికి కలిగిన ఆశ్చర్యం, ప్రపంచంమీద కలిగిన అసహ్యం బహుశా అతని జీవితంలో మరెప్పుడూ కలిగి ఉండవు. తను లెక్కల్లో సున్నపెట్టిన ఎమ్. రాజమణి పాసయింది. ఇది ఎలా సంభవించింది? తను కాదనగానే ఆయన హెడ్‌మాస్టర్ కాళ్లు పట్టుగుని ఉండాలి. హెడ్‌మాస్టరు గడ్డి తిన్నాడు; జేబునింపుకున్నాడు; విద్యార్థిని తండ్రికి హామీ యిచ్చేడు!

ఉద్రేకంలో కామన్‌రూమ్‌లో కూర్చుని రాజీనామా గీకి పారేసేడు రామకృష్ణ. అది చేతబట్టుకుని హెడ్‌మాస్టరు గదిలోనికి తుపాకిగుండులాగ దూసుకుపోయేడు. ఏదో వ్రాసుకుంటున్న హెడ్‌మాస్టర్ ఈ అనుకోని సుడిగాలికి ఉలికిపడి తలెత్తిచూసేడు.

రామకృష్ణ తనకిందివాడిని ప్రశ్నించినట్టు సూటిగా అడిగేడు — 'లెక్కలలో సున్న వచ్చిన ఎమ్. రాజమణి (ఫిఫ్త్‌ఫారం) ఎలాగ పాసయింది?'

హెడ్‌మాస్టర్ శాంతంగా మార్కులపట్టీ తీసి అతని ముందుంచుతూ, 'ఆమెకి మిగతా అన్నిటిలోనూ మంచి మార్కులువచ్చేయి' అని ఇంగ్లీషులో అన్నాడు.

రామకృష్ణ మార్కులపట్టీని గమనించక ఇంగ్లీషులోనే బదులు పలికేడు: 'అది నాకనవసరం నా పేపర్లో ఆమెకి బండిసున్న వచ్చింది.'

హెడ్‌మాస్టరు ఒక చిఱునవ్వు విసిరేడు 'అని మీరు నిరూపించలేరు.'

రామకృష్ణ కోపంతో వణికిపోయేడు. 'నీచుల నీచపుపనులని బట్టబయలు చెయ్యడమే నాపనికాదు. నే నేవీ నిరూపించదల్చుకోలేదు.' అంటూ రాజీనామా కాగితాన్ని టేబుల్ మీదుంచి వెళ్లిపోనుద్యుక్తుడయాడు

'మేస్టారూ' మృదువుగా పిలిచేరు హెడ్‌మాస్టర్.

వెనుదిరిగేడు రామకృష్ణ.

'ఇలా కూర్చోండి'

కుర్చీలో రామకృష్ణ కూర్చున్నాక కొన్నిక్షణాలు నిశ్శబ్దంగా గడిచిపోయేయి.

తర్వాత శాంతిగా అన్నాడు హెడ్‌మాస్టరు 'రామకృష్ణగారూ! మీరు వయస్సులో చిన్నవారు. లోకానుభవంతక్కువ. ఒక్కమాట వినండి ఈ రోజులలో నిస్వార్థంగా ఉండడమే నానాఅవస్థలనీ కొనితెచ్చుకోడంలాంటిది. కాని దానికంటెబాధ స్వార్థపరుల్ని అసహ్యించుకోవడం. ఎంచేతంటే వాళ్లని క్షమించలేనివాడు ఈ మొత్తం ప్రపంచాన్నీ అసహ్యించుకోవాలి. గత్యంతరం లేదు—'

రామకృష్ణ ఆవేశంగా 'కాదు హెడ్‌మాస్టరుగారూ, కాదు ప్రతివాడూ తన మానవత్వాన్ని మీలాగే మూలకొణంలో పెట్టేడనుకోకండి ఇంకా ఈ ప్రపంచంలో నీతి నియమాలంటూ ఉండబట్టే ఈ గ్రహంమీద ప్రాణికోటి ఇంకా నాశనంకాలేదు.' అన్నాడు.

హెడ్‌మాస్టరు శాంతంగా అన్నాడు: 'మీరు చెప్పినది కాదనను. కాని స్వార్థాన్ని వదులుకుని గాని, స్వార్థపరుల్ని అసహ్యించుకుని గాని బ్రతకడం కష్టసాధ్యం.'

'కష్టసాధ్యమైనంతమాత్రాన ఆ పనిని చెయ్యగల వాళ్లు ఉండరని అనుకోకండి'

లోకానుభవం

'మేస్టారూ, నేనూ మీ వయస్సులో నే మేస్టరుగా చేరేను. అప్పటి నా ఆశయం చెప్తే మీరు బహుశా నమ్మరు లంచాలు పుచ్చుకో కూడదనీ, విద్యార్థులకి ఆదర్శప్రాయమైన వాణ్ణి కావాలనీ అప్పటి నా దృఢనిశ్చయం కాని యీ వేళ ఏ సామాన్యమైన మేస్టరూ అంగీకరించని ముప్ఫయిరూపాయిలకి కక్కుర్తిపడి రాజమణిని ప్రమోట్ చేసే స్థితికి దిగజారేనంటే జీవితంలో ఎన్ని కష్టాలు అనుభవించేనో, ఇప్పుడూ అనుభవిస్తున్నానో ఊహించండి హెడ్ మాస్టరునే అయినా నా పిల్లలకి రోజూ కడుపునిండా కూరా అన్నం అయినా దొరకదు. ఇవుగో—' జేబులోంచి మూడు పదిరూపాయలనోట్లుతీసి ఒక్కొక్కనూటే మరింత ఉద్రేకంతో పలుకుతూ అన్నాడు 'తన మేనకోడలిని పాసు చెయ్యవలసిందంటూ రాజమణి మేనమామ యిచ్చిన లంచం. హెడ్ మాస్టరు పట్టినలంచం ముప్ఫైయ్ రూపాయలు! మన జీవితపు పరీక్షాఫలితాలు వార్ధక్యములోగాని తెలీవు మేష్టారూ!'

రామకృష్ణ దిగ్గున లేచేడు. 'నా జీవితం నన్ను చేసే పరీక్షలలో నేను తప్పకూడదని దేవుడిని ప్రార్థిస్తున్నాను. నా నిశ్చయం వినండి. నాకూ భార్యాపిల లుంటారుగదా. పాలులేని తల్లి, పోతపాలు కొనడానికి డబ్బు లేని తండ్రీ చెరోపక్కగా ఉండగా ఆకలితో కిరకిరలాడుతూ, గుక్కవిడవక ఏడ్చి ఏడ్చి ఇక ఏడవడానికి శక్తిలేనప్పుడు గుక్కెడు ప్రాణాన్నీ వదిలేసే నా పసికందుని చూస్తూ నిలబడవలసివచ్చినప్పుడైనా దాని ప్రాణాన్ని నిలిపేందుకు నీచపుదారి మాత్రం తొక్కను' అని పనికి ఎంత వేగంగా వచ్చేడో అంత వేగంగానూ బైటికి వెళ్ళిపోయేడు.


పంకా గాలికి రామకృష్ణ రాజీనామా కాగితం రెపరెపలాడుతూ హెడ్ మాస్టర్ని వెక్కిరిస్తున్నట్టుంది.


* * *

మే 18 వ తేదీ. ఇవాళ పొద్దుటినుంచి చేస్తున్నా శేషగిరి యింటి అలంకరణా, రాజమణి వొంటి అలంకరణా తెములకుండా ఉన్నాయి.

వరుడూ, తండ్రీ యివేళ రాజమణిని చూసుకుందుకు వస్తారు

శేషగిరి యిల్లు సామాన్యమైనది. దానిని జగన్నాధరావు అభిరుచి ప్రకారం అలంకరించాలంటే ఎన్నో కొనాలి; ఎన్నో ఎరువు తేవాలి; ఎంతో శ్రమపడాలి. సావడిలో ఒక గుండ్రని బల్లా దానిచుట్టూ ఆరు ఎరువు కుర్చీలు అమర్చబడ్డాయి. టేబులు పాతదైనా, అప్పుడే కొన్న ఎర్రగళ్ళ గుడ్డతోనూ, ఫ్లవర్ వేజుతోనూ దానికొక కొత్తదనం వచ్చింది. గోడలకి అనేక ప్రకృతి దృశ్యాల చిత్రపటాలు తగిలించేరు. నేలమీద పూర్తిగా వెదురుచాప, దానిమీద తివాసీ ఒకటి పరచబడ్డాయి ద్వారాలకి చక్కని తెరలు వచ్చేయి. ఇంత శ్రమపడ్డాక ఆ సావడికి మాత్రం ఒకరూపం వచ్చింది. కాని జగ





న్నాధరావుకి తృప్తికరంగా లేదు.

రాజమణిని ముస్తాబు చెయ్యడం మరింత చిక్కుగా ఉంది. విమలమ్మ (శేషగిరి భార్య) పడుచుది. ఆవిడకీ, కామేశ్వరమ్మకీ వధువు ముస్తాబుకి సంబంధించిన ఏ విషయం లోనూ ఏకాభిప్రాయం కుదరదు. ఒకవేళ ఖర్మం చాలక కుదిరినా అది వధువు అనంగీకారంతో విఫలమై ఊరుకుంటుంది. ఉదాహరణకి గట్టిగా జడవేసి ఊలుకట్టాలంటుంది పూర్వకాలపు కామేశ్వరమ్మ. కాదు, కొంచెం వదులుగా వేసి చివర రిబ్బను వేస్తే బాగుంటుందని విమలమ్మ సూచన. రాజమణి అత్తతో సగంవరకూమాత్రమే ఏకీభవిస్తుంది జడ చివర కుచ్చుగా వదిలెయ్యడమే పేషనని ఆమె తుది నిర్ణయం చేస్తుంది. ఇలాగే ప్రతీతీర్మానం, వయస్సులోనూ, అభిరుచులలోనూ సామ్యంలేని ముగ్గురు స్త్రీల ఆమోదాన్ని పొందవలసి రావడంచేత రాజమణి ముస్తాబైయేటప్పటికి మూడుఝాముల వేళయింది.

జగన్నాధరావు ఆదరబాదరా కాఫీ యింత నోట్లో పోసుకుని జరీకండువా వేసుకుని కారులో రైలుస్టేషన్‌కి బయలుదేరేడు.

కాని ఆయన స్టేషను చేరుకునే టప్పటికే రైలు వచ్చేసింది. తొందరగా సేషనులోనికి పరుగెత్తేడు. పుస్తకాల దుకాణందగ్గర రామకృష్ణ కనిపించేడు. అతనూ జగన్నాధరావుని చూసేక ఇక పలకరించక తప్పదనుకుంటూ 'ఏం మేష్టారూ, మీ రెప్పుడు రావడం?' అన్నాడు.

'ఈ రైల్లోనేనండి. మీరేం ఇక్కడున్నారు.' అడిగేడు రామకృష్ణ.

'మా అత్తవారి దీవూరేనండీ.'

'ఓహో, విజయనగరం వెళ్ళిపోతున్నారా?'

'లేదండి.'

'ఎవర్నైనా దిగబెట్టడానికి వొచ్చేరు కాబోలు.'

'కాదండి'

జగన్నాధరావు తొందరపడుతున్నట్టు గ్రహించి నవ్వుకున్నాడు రామకృష్ణ. 'మీ తాలూకు ఎవరేనా వొస్తున్నారా?'

'అవునండీ. మళ్ళీ కలుస్తాను.' అంటూ జగన్నాథరావు గుంపులో కలిసిపోయేడు.

'ఇలారండి జగన్నాధరావుగారూ ఇటూ' అని కేక వేసేడు ప్లాట్‌ఫారం మీదున్న ఒక పెద్దమనిషి.

'ఓహో జోగారావుగారూ, మీ అబ్బాయేరీ?' అని అతన్ని సమీపించేడు జగన్నాధరావు.

'అలా పుస్తకాలకొట్టు కెళ్ళేడు. క్షేమవాః?' అన్నాడు జోగారావు.

'మీదయవల్ల'

'ఏమండోయ్ జగన్నాధరావు గారూ, మీరు మా నాన్నగారిని ఎరుగుదురా ఏమిటి' అంటూ చేతిలో పత్రికతో అక్కడికి వచ్చేడు రామకృష్ణ.

'ఈయన మీ నాన్నగారా?' అని ఆశ్చర్యపోయాడు జగన్నాధరావు

జోగారావు కూడా సాశ్చర్యంగా 'మీకు మావాడు తెలుసునేమిటి? చెప్పేరు కాదేం' అన్నాడు.

'ఈయన నీకెలా తెలుసు నాన్నా?'

'పెళ్ళి కూతురి తండ్రీయనేరా!'

'ఆఁ!' అంటూ రామకృష్ణ రాజమణికి తను వేసిన మార్కులాగ తయారుచేసేడు నోటిని.

'పదండి. కారులో మాటాడుకోవచ్చు.'

ముగ్గురూ కారెక్కేరు. అనేక విషయాలు మాటాడుకున్నారు. జగన్నాధరావు తన కూతురికి ఒక్క లెక్కలలో తప్ప మిగతవాటిల్లో అరవైలు దాటుతాయని చెప్పేడు. అమ్మాయికి లెక్కలు కూడా బాగానే వచ్చును. కాని ఆ పేపరు నాడు ఆమెకి పవిరీతమైన చెవిపోటువచ్చింది. తన కూతురికి కుట్లూ, అల్లిక మొదలైన వాటితోబాటు వంటకూడా చక్కగా వచ్చును. ప్రత్యేకంగా సంగీతంలో ప్రవేశం లేనప్పటికీ సినీమా పాటలు శ్రావ్యంగానే పాడగలదు ... ఇలా ఆమె యోగ్యతలన్నీ ఇదివరకే జోగారావు దగ్గిర తను ఏకరువు పెట్టినప్పటికీ, ఇప్పుడూ అతన్ని సంబోధించే చెప్తున్నప్పటికీ ఉద్దేశం మాత్రం రామకృష్ణ వినాలని అదిగ్రహించే కాబోలు ముసలాయన హాయిగా వెనక్కి చేరబడి కునికిపాట్లు పడుతున్నాడు!

కాఫీ ఫలహారాలయేయి. శేషగిరితో సహా అంతా కుర్చీలలో కూర్చునివున్నారు. ఈ యింట్లో పొద్దుట్నుంచి ముఖంముడుచుకుని కూర్చున్నది ఒక్క శేషగిరే. అతను మొదట్నుంచి ఈ సంబంధం యిష్టం లేదనే పోరుతున్నాడు. వరుడికి అస్తిపాస్తులు ఏమీ లేవు. ఉద్యోగం చూద్దామా అంటే వంద రాళ్ళు వచ్చే మేష్టరీ. కాని జగన్నాధరావు వరుడు రూపగుణాలు గలవాడని వినికిడి; అదే ముఖ్యమని బావమరది నోరు మూసేడు. ఇప్పుడు కూడా శేషగిరి మూతిముడుచుకునే కూర్చున్నాడు.

(34-వ పేజీచూడండి)

అంటార్కిటికాలో...

"పెన్‌గ్విన్ చక్ర...

★ వాల్టర్ ...


దాదాపు నూరేళ్ళ క్రితందాకా ఆఫ్రికా ఖండపు కీకారణ్యాలలోని జంతుజీవితం మానవులకు ఆశ్చర్యం గొలిపేది తరవాత కొంతకాలానికి దక్షిణ అమెరికా అరణ్యాలలోని విచిత్ర జంతువులను గూర్చి తెలుసుకోవాలనే కుతూహలం బయలుదేరింది ఇది అయిపోయాక, ఇప్పుడు మిగిలినవల్లా అంటార్కిటికాలోని జంతు జీవిత మొక్కటే. అంటార్కిటికాలోని జంతుజీవితాన్ని గూర్చి దాదాపు మనకేమీ తెలియదనే చెప్పాలి

అంటార్కిటికా ఖండాన్ని 150 ఏళ్ళ క్రితమే కనుక్కున్నారు ఆ ఖండం లోపలి భాగాలకు ఇటీవలదాకా ఎవరూ వెళ్ళనే లేదు అందుచేత ఇప్పటిదాకా అక్కడి జంతుజీవితం తెరవని పుస్తకంలాగానే ఉండిపోయింది అక్కడి వివిధ జంతువులను గూర్చి, వాటి స్వరూప స్వభావాలను గూర్చి తెలుసుకోవడం ఇప్పుడిప్పుడే ప్రారంభమైంది లోపలిభాగమంతా నిర్జీవమైన మంచు ఎడారే అయినా, ఖండపుటంచులలో మాత్రం సీల్, తిమింగిలం, పెన్‌గ్విన్ జాతులు, ఉత్తర దిక్కునుంచి వలస వచ్చే పక్షులు బిలబిల తిరుగుతూ, ఎగురుతూ ఉంటాయి చుట్టూ సముద్రంలో అనంతంగా ఉన్న మొక్కలూ, చేపలూ వీటికి ఆహారం ఈ మొక్కలూ చేపలూ అక్కడ అంత విశేషంగా వృద్ధిపొందడానికి కారణం ఒకటి చెబుతారు సముద్రపు అట్టడుగునుంచి నైట్రేట్లు, ఫాస్ఫేట్లు, సిలికేట్లను నీరే సముద్ర ఉపరితలానికి తెచ్చి "సముద్రపు పచ్చిక బయళ్లు" అనబడేవాటికి ఎరువులుగా ఉపయోగించుతుంది అంటార్కిటికా చుట్టూ సముద్రంలో తేలుతూ పోయే హిమఖండాల అడుగుభాగమంతా కంటికి కనిపించనంత సూక్ష్మమైన మొక్కల సముదాయంతో నిండి ఉండడంవలన ఎప్పుడు చూసినా గోధుమరంగుగా కనిపిస్తుంది ఈ మొక్కలను చిన్న చిన్న జలచరాలు తింటాయి ఆ జలచరాలను ఇంకా పెద్ద జలచరాలు తింటాయి అంటార్కిటికాలో ఉన్న ఈ మాదిరి సముద్రపు మొక్కలను మాత్రమే తిని అక్కడి జంతువులు జీవిస్తాయి వాటికి ఇతర ప్రపంచంతో ప్రమేయంలేదు వాటికదే ప్రపంచం

అంటార్కిటిక్ జంతువులనుగూర్చి మనకు తెలిసిన కొద్ది విషయాలవల్లా అనేక సమస్యలుత్పన్నమైనాయి ఈ సమస్యలలో కొన్నిటిని మొన్న జూలై 1వ తేదిన ప్రారంభమైన అంతర్జాతీయ భూభౌతిక పరిశోధనలు పరిష్కరించగలవని అనుకుంటున్నారు ఈ పరిశోధనలు ఒకేసారిగా అనేక స్థలాల నుండి జరుగుతాయి భూగర్భాన్ని గూర్చి, ఉపరితలంగూర్చి గాలిపాటును గూర్చి, చుట్టూ వ్యాపించి ఉన్న స్థలాన్ని గూర్చి పరిశోధనలు జరుగుతాయి భూభౌతిక శాస్త్రానికి జీవశాస్త్రానికి సంబంధం లేకపోయినా అంటార్కిటికాలో ఎలాగూ 40 స్థలాలలో శాస్త్రజ్ఞుల కేంద్రాలు ఏర్పరుస్తున్నారు గనుక, అక్కడి జంతు జీవితాన్ని గూడా పనిలో పనిగా పరిశోధిస్తారు

పెన్‌గ్విన్

అంటార్కిటికాలోని జంతువుల్లోకల్లా అందరికీ బాగా తెలిసినవి 'ఎంపరర్ పెన్‌గ్విన్' లనబడేవి ఇవి జీవపరిణామంలో చాలా ప్రాచీన కాలానికి చెందిన పక్షులని కొందరు జంతు శాస్త్రజ్ఞుల అభిప్రాయం హిమయుగం దాటేకి కూడా తట్టుకుని బ్రతికిఉండడానికవసరమైన లక్షణాలువీటికి పూర్తిగా ఉన్నాయి అత్యంత శీతల పరిస్థితులలో కూడా ఇవి వెచ్చగా ఎలా ఉంటున్నాయా అని అటు వైపుఅలాస్కాలోనిఆర్కిటిక్ ఏరో మెడికల్ పరిశోధనాలయంలో శాస్త్రజ్ఞులు పరిశోధిస్తున్నారు ఈ ప్రశ్నకు సమాధానం దొరికితే, చాలాఎత్తున, ఆ మాటకొస్తే ఇతర గ్రహాలకు ప్రయాణం చెయ్యడానికి కూడా అవసరమైన కొన్ని రహస్యాలు



...స్క్యాపక్షి ఏకాలంలో ఏప్రాంతానికి వలసపోతుందో కనిపెట్టడ...
...కాలో శాస్త్రజ్ఞులు స్థాపించిన 40 కేంద్రాలనుంచి అక్కడి జంత...

అమూల్య జీవకోటి

వర్తీ జీవితగాధ

...లివాన్

బయటపడవచ్చు పైకి పోయినకొద్దీ సూర్య కాంతి వేడిమిని [illegible]గా [illegible]గాలి పల్చగా ఉంటుంది గనుక, అంతర్గ్రహ ప్రయాణికులు మలముల మాడిపోవడమో, గడ్డకట్టి బిగుసుకుపోవడమో జరుగుతుంది గనుక దానికి కావలసిన రక్షణోపాయాలకు కూడా పై పరిశోధనలు పనికిరావచ్చు

ఎంపరర్ పెన్గ్విన్‌లు శీత కాలం లో నాస్త వెచ్చగా ఉండే చోట్లకి వలసపోయే బదులు దానికి వ్యతిరేకంగా అంటార్కిటిక్ తీరానికి పోతాయి అక్కడ గడ్డకట్టిన సముద్రపు నీటి అంచున ఒక్కొక్కటి ఒక్కొక్క గుడ్డు పెడతాయి ఈ పక్షులు గుంపులు గుంపులుగా ఒకదాని కొకటి హత్తుకుని ఎంత చలి తుపానులైనా లెక్క చేయకుండా అలాగే ఉండిపోతాయి ఈ గుంపుల్లో వెయ్యేసి పక్షులుకూడా ఉండవంకద్దు

మైనస్ 68 డిగ్రీల(ఫారన్‌హీట్) కు టెంపరేచర్ పడిపోయినా, వాటి జాతి నాశనమవుతుందనే భయం లేదు ఎందుకంటే తగినన్ని గుడ్లు పెడతాయితగినన్ని టని పొదుగుతాయి ందుచేత కొన్ని నష్టమైనా, జాతికి మాత్రం ముప్పు రదు మామూలుగా బ్రతికేవాటిలో నూటికి రెండు వంతుల చొప్పున నష్టంకావడం ప్రారంభించినా, పాతిక ముప్ఫయ్యేళ్లలో మొత్తం జాతి అంతా నశిస్తుందట


పొదుగుడు కాలం రెండు నెలలు ఈ రెండు నెలల కాలంలోనూ మగపక్షి నిరాహార దీక్ష పట్టి, గుడ్డును కాళ్లతో పట్టుకుని పొత్తికడుపు కింది భాగానికి హత్తుకుని కూర్చుంటుంది ఏమీ తినకపోయినా దాని శరీరోష్ణం నూరు డిగ్రీల (ఫారన్‌హీట్) కు తగ్గదు నూటారు డిగ్రీల దాకాకూడా ఉండవచ్చును అంత మంచులో రెండు నెలలపాటు ఏమీ తినకుండా ఉన్నా తనకీ, తన గుడ్డుకి సరిపడినంత వెచ్చదనం దాని కెక్కడ నుంచి లభిస్తోంది? రెక్కలూ, చర్మం, చర్మానికీ కండరాలకీ మధ్యఉండే కొవ్వు, ఇవన్నీ బహుశా దాని శరీరోష్ణాన్ని కాపాడుతూ ఉంటాయి అయితే వేసవికాలపు వేడిమిలో అది శరీరశ్రమ పడుతున్నపుడు పుట్టే వేడి అంతా ఏమవుతోంది? బహుశా ఆ వేడిని రెక్కలద్వారా వదిలిపెడుతూ ఉండి ఉండవచ్చు

ఇలాంటి సమస్యలను పరిష్కరించడానికి ఆర్కిటిక్ ఎరోమెడికల్ పరిశోధనాలయ శాస్త్రజ్ఞుడు రేమండ్ జె హాక్ ఒక కార్యక్రమం తయారుచేశారు కొన్ని పక్షులను ప్రత్యేకంగా ఉంచి మేత మేస్తున్నప్పుడు వాటి శరీరతత్వం ఎలా ఉందీ, మానేసినప్పుడెలావుంది పరీక్ష చేయాలని బరువులో మార్పులు ఎప్పటికప్పుడు గుర్తుపెట్టాలనీ ఆయన ఉద్దేశం


అంటార్కిటిక్ పరిస్థితులలో ఇలాటి పరీక్షలు సాగించడం బహు కష్టం ఎడిలీ తీరంలో ఫ్రెంచిశాస్త్రజ్ఞులు ఎంపరర్ పెన్గ్విన్‌ల శరీరోష్ణం రికార్డు చెయ్యడానికి ప్రయత్నించారు ఆ జట్టులోని ప్రాన్స్వటబూటూ జీన్ సెంద్రాన్ అనే శాస్త్రజ్ఞులు ఏ పద్ధతి అవలంబించింది జట్టు నాయకుడు మైకెల్ బారీ ఇలా వర్ణించారు

"టబూటూ ఉన్నట్టుండి హఠాత్తుగా పెన్గ్విన్ మీదపడి, బలంకొద్ది అణిచిపెట్టి, రెండు రెక్కలను గట్టిగా పట్టుకుంటాడు సెంద్రాన్ బోర్లా పడుకుని తర్మామీటర్ దానిఆ సంలో పెట్టి వేడిమి కొలుస్తూ ఉంటాడు ఇలా మంచులో దొర్లుకుంటూ పోతారు"

ఇప్పటివరకూ అభేద్యంగా ఉన్నకొర్క ద్వీప కల్పంలో విల్క్స్ అనే అమెరికన్ స్థావరంలో కార్ల్ ఎక్లండ్ నాయకత్వాన మరో పదిమంది శాస్త్రజ్ఞులుపనిచేస్తున్నారు గుడ్డు, దాన్ని పొదుగుతున్న పక్షి రెండింటి ఉష్ణాన్ని కొలవడానికి అనువైన సాధనాలు వీరివద్ద ఉన్నాయి తర్మామీటరు, రేడియో ట్రాన్స్‌మిటరు కలిసిఉన్న ఒక సాధనం ఉంటుంది



...నికిగాను గుర్తుగా గుడ్డముక్కలుచుట్టి వదిలిపెడతారు అంటార్కిటి...
...బజీవితాన్నిగూర్చి ఈ రకమైన సమగ్రపరిశోధనలు సాగుతున్నాయి



అంటార్కిటికాలోని ఎడిలీ పెన్‌గ్విన్ పక్షులు ఎల్లలకు ఆహారం పెట్టే విధానం కడుపునిండా తిన్న పెద్దపక్షిని పిల్లలు తరిమి, తరిమి కొడతాయి కొన్ని అలిసిపోయి దారిలోనే ఆగిపోతాయి చివరిదాకా మిగిలినపిల్లకి పెద్దపక్షి ఈ విధంగా నోరు తెరిచి తిన్న తిండిని పైకి తెప్పించుకుని పెడుతుంది

[ఫోటోలు వాల్టర్ సలివాన్]

★ అంటార్కిటికాలోని అమూల్య జీవకోటి ★

గుడ్డును తెరిచి చందమామను తీసేసి దాని స్థానంలో ఈ సాధనం ఉంచుతారు గుడ్డును మళ్లీ మూసేసి మళ్ళీ పక్షికిచ్చేస్తారు దాదాపు నూరు గంటలసేపు పక్షి ఎంతగా గింజుకున్నా గుడ్డు లోపలి వేడిమి రేడియో ప్రసారక యంత్రం ద్వారా మనకు తెలుస్తూనే ఉంటుంది

ఎడిలీ పెన్‌గ్విన్

పెన్‌గ్విన్‌లు సంఘజీవులు గుడ్లు పెట్టే కాలంలో మరీ సన్నిహితంగా ఉంటాయి సముద్రం ఒడ్డునే ఎంపరర్ పెన్‌గ్విన్‌లు, వాటికంటె చిన్నవైన ఎడిలీ పెన్‌గ్విన్‌లు గుంపులు గుంపులుగా చేరతాయి ఎంపరర్ల మాదిరిగా కాక ఎడిలీ పెన్‌గ్విన్‌లు వసంత ఋతువులోనే గుడ్లు పెడతాయి రాళ్ల లంకలలోను, ద్వీప కల్పాలలోనూ గూళ్లు కట్టుకుంటాయి పక్షికూనలకి మసిపూసినట్లు లేత బొచ్చు ఉంటుంది దీనివల్ల అవి తల్లిదండ్రులకంటె పెద్దవిలాగా కనిపిస్తాయి అయితే ఆ లేతబొచ్చు నీటికి తడిసి బరువెక్కుతుంది గనక కూనలు నీళ్లలో ఈది తమ ఆహారం తాము తెచ్చుకోలేవు

పెద్దపక్షి నీటిలో మేత సంపాదించి ఒడ్డెక్కుతుంది దాదాపు వెయ్యి అడుగుల రాళ్ళమీద పైకెక్కితేగాని సముతల ప్రదేశం రాదు అక్కడికి రాగానే రెండుమూడు ఎల్లలు దాన్ని తరుముకుంటాయి పెద్ద గందరగోళం, అరుపులు చెలరేగుతాయి

పెద్దపక్షి చిన్నవాటిని గిచ్చి పారిపోవడానికి చూస్తుంది ఆ గందరగోళంలో పెద్దవాటిని కూడా గిచ్చుతుంది దాంతో గోల ఇంకా పెద్దదవుతుంది చివరికి తప్పించుకుని పెద్దపక్షి వంకర టింకర అడుగులతో గబగబ పరుగెత్తుకు పోతుంది ఎల్లలు బారుగా వెంటబడతాయి ఇలాగ రాళ్ల గుట్టలమీదుగా చాలాసేపు తరుముకుంటూ పోతాయి ఒకటొకటిగా పిల్లలు అలిసిపోయి దోవలో ఆగిపోతాయి చివరికొకటే మిగులుతుంది

పెద్దపక్షి వేగం తగ్గిస్తుంది వెనక్కి తిరిగి ముక్కుతో చిన్నదాన్ని పొడవబోతుంది చిన్నది ఏడుస్తున్నట్టు జాలిగా అరుస్తుంది అంత పెద్దదిగా కనిపించే పక్షికూన అంత దీనంగా ఏడవడం మహా చిత్రంగా ఉంటుంది చివరికి జాలివేసి పెద్దది నోరు తెరుస్తుంది చిన్నది దానినోట్లోకి తల కాస్తా దూర్చేస్తుంది పెద్దది తిన్న తిండిని కాస్త కాస్త పైకి తెప్పిస్తుంటే చిన్నది తినేస్తూ ఉంటుంది

పెద్ద ఎడిలీపక్షి ఆఖర్న తిండి పెట్టేది తన

సొంత పిల్లల్నో, లేక ఏపిల్ల చివరికిమిగిలితే దానినో, మామూలుగా చూస్తే కనిపెట్టలేము. పక్షులకు రంగువేసి, అవిపొదిగేగుడ్లలోకి రంగులు ఇంజెక్ట్ చేసి ఏది దేనిపిల్ల అయిందీ కనిపెట్టవచ్చునని ఎక్లండ్ అభిప్రాయపడుతున్నారు. ఈ పక్షులు ప్రతిఏడాదీ ఒకచోటికేవచ్చి నివాసంఉంటాయా, లేక ఏయేటికాఏటు స్థలంమార్చేస్తాయా అనేదికూడా ఇలాంటి గుర్తులుపెట్టి కనుక్కోవచ్చునట.

స్క్వా పక్షులు

ఎడిలీ పెన్గ్విన్లగుంపు ఎప్పుడుచూసినా నానారకాల కేకలతో గందరగోళంగా ఉంటుంది. ఈగందరగోళంలో కొంచెం అవతలగాఉండే స్క్వాపక్షుల కూతలు కూడా కలుస్తాయి. ఈస్క్వా పక్షుల పిల్లలు వేసవికాలం ఆఖరవడానికి ముందే బాగా ఎదిగిఉంటాయి. కాని ఇంకా ఎగరలేవు. ఆ దశలో దానితల్లే దాన్ని నిత్యమూ కాపాడుతూ ఉంటుంది. పిల్లదగ్గిరికి మరే పక్షిగాని, జంతువుగాని రాబోయిందా, తల్లిపక్షి మహావేగంగా, తీవ్రంగా ఎగురొచ్చి తరిమివేస్తుంది. నేలకు రెండడుగుల ఎత్తున విశాలమైన రెక్కలతో టపటప కొట్టుకుంటూ డేగలాగ విరాదికొస్తుంది. మన దగ్గిరికి రాగానే ఒక్క ఎగురెగిరి నెత్తిమీద పరిచిపోతుంది.

స్క్వా పక్షులు పెన్గ్విన్లు ఉండే స్థలాలకు దగ్గిరిగానే సంచరిస్తూ ఉంటాయి. ఎందుకంటే, పెన్గ్విన్లను అవి తింటాయి. స్క్వా పక్షులు చాల క్రూరమైనవనీ, వాటికి మిగతాపక్షులు హడిలిపోతూ ఉంటాయనీ రాబర్ట్ కుష్మన్ మర్ఫీ అనే శాస్త్రజ్ఞుడు వ్రాశారు

స్క్వాపక్షి అంటార్కిటికా ఖండంలోపలిభాగాల్లో నివసిస్తుంది. అంత లోపలిభాగాల్లో చిన్న చిన్న పురుగులుతప్ప ఇంకేవీ నివసించలేవు. పర్వత పరివేష్టితమైన దక్షిణధ్రువ పీఠభూమిని చేరుకున్న కొందరు శాస్త్రజ్ఞులకు అంత మారుమూల ప్రదేశంలో కూడా స్క్వాలు కనిపించాయట.

స్క్వాలను పట్టుకోడానికి ఎక్లండ్ అనుసరించే పద్ధతి చిత్రమైనది. మూడు ఫిరంగులనుంచి ఒకేసారిగా ఒక పెద్దవలను షూట్ చేస్తారు. ఈ వల నలభై యాభై అడుగుల దూరందాకా విస్తరించుతుంది. అదివరకే అక్కడ ఎరకోసంచేరిన స్క్వాలు అందులో చిక్కుపడి పోతాయి. ఉక్కులాంటి స్క్వా ముక్కు ఎంత గట్టితోలునైనా చీల్చివేయగలదు. నీళ్లలోకూడా జలచరాల్ని చీల్చివేస్తుంది. మనుష్యులైనా అంతే.

పెట్రెల్ పక్షులు

అంటార్కిటిక్ వేసవి కాలం అంతం కావచ్చేసమయంలో క్లార్క్ ద్వీపకల్పం మీద స్టార్మ్ పెట్రెల్ అనే జాతి పక్షులు గుంపులు గుంపులుగా కనిపిస్తాయి. ఇవి నీళ్ళ మీద వాలి పక్కనున్న నౌకల్లోంచి పడేసిన చెత్తా చెదారం తింటూఉంటాయి. ఎందుచేతనో ఇవి స్క్వాపక్షులకు భయపడవు. వాటిపక్కనే ఇవి నిర్భయంగా సంచరిస్తూ వుంటాయి. ఎగురుతున్నప్పుడు ఈ పెట్రెల్ పక్షులు నల్లగా కనిపిస్తాయి. తోకలకి అడ్డంగా తెల్లచారలుమాత్రం కనిపిస్తూవుంటాయి. ఇవి కేప్ కాడ్, పూజెట్ సౌండ్, ఇంకా ఇతర ఉత్తర అమెరికన్ ప్రాంతాలనుంచి అంటార్కిటికా దాకా వలసకోసం దీర్ఘప్రయాణం చేస్తూంటాయి. అంటార్కిటికాలోనే వీటిప్రణయకలాపం, గుడ్లు పెట్టడం, పొదగడం, పిల్లలను సాకడం అన్నీ జరిగిపోతాయి.

పెట్రెల్ జాతిలో కొన్నిరకాల పక్షులు క్లార్క్ ద్వీపకల్పంలో చిన్న చిన్న గుహలలో గుడ్లు పెడతాయి. అక్కడే అవి గూళ్లు కట్టుకుంటాయి. అంటార్కిటికాలోని కేప్ పావురం, విల్సన్స్ పెట్రెల్, అంటార్కిటిక్ పెట్రెల్, మంచు పెట్రెల్ మొదలైన పెట్రెల్ జాతి పక్షులు తమకూనలను సంరక్షించుకోవడానికి నోట్లోంచి ఒక రకమైన దుర్వాసన కొట్టే ద్రవపదార్థాన్ని చిమ్మన గ్రోవిలోంచి మాదిరిగా చిమ్ముతాయి. ఆ పదార్థం ఏడడుగుల దూరానికి చిమ్ముతుంది. పిల్లలకి అది చిమ్మడంలో పెద్దవాటికంటే మంచిగురి ఉంటుంది.

తిమింగిలం

అనేక వ్యయప్రయాసలకులోనై అంటార్కిటిక్ సముద్రానికి వెళ్లే నావికులకు ముఖ్యమైన ఆర్థికాకర్షణ తిమింగిలాల వేట. అంటార్కిటిక్లో ఉండే నీల తిమింగిలం ప్రపంచంలోకల్లా పెద్ద జంతువని నిస్సందేహంగా చెప్పవచ్చును. దీని బరువు 150 టన్నులదాకా ఉంటుంది.

ఇటీవల జరిగిన ఒక వేటలో 19 జట్లుగా 257 గురు వేటగాళ్లు అంటార్కిటిక్ సముద్రంలో తిమింగిలాలను వేటాడారు. వేట 58 రోజులకు మించి సాగరాదనీ, 15000 యూనిట్ల తిమింగిలాలను మించి పట్టకోరాదనీ అంతర్జాతీయ నిబంధన ఒకటి ఉన్నది. యూనిట్లు అని ఎందుకు అన్నారంటే, నీల తిమింగిలం అన్నిటికంటే పెద్దది గనుక దాన్నొకదాన్ని పట్టుకుంటే అనేక చిన్న తిమింగిలాలను పట్టుకున్నట్లవుతుంది. వేటగాళ్లు ఎప్పటికప్పుడు ఎన్ని యూనిట్లను పట్టుకున్నది రేడియో ద్వారా తెలియజేస్తూ ఉంటారు. అనుమతించిన మితి రాగానే జట్టు నాయకుడు వేట ఆపు చేయిస్తాడు.

తిమింగిలాల వేట పెద్ద వ్యాపారపు స్థాయిలో జరుగుతుంది. దీనికి బ్రహ్మాండమైన ఫ్యాక్టరీ నౌకలు కావాలి. ఈ నౌకలలో తిమింగిలాలను చీల్చి శుభ్రంచేసి ప్రాసెస్ చేస్తారు. ఈ నౌకల్లో డచ్ ఫ్యాక్టరీ నౌక విలెం బారెండ్స్ అన్నింటికంటే పెద్దది. ఇది 44 వేల టన్నుల నౌక.

అంటార్కిటిక్ లోని తిమింగిలాలలోకల్లా క్రూరమైనవి మృత్యుతిమింగిలాలు. ఇవిగుంపులుగుంపులుగా తిరుగుతాయి. ఒకసారి నేను 17మృత్యు తిమింగిలాలను ఒకేసారి చూశాను. నీటిలోంచి బయటికి వాటి మూతులు మాత్రమే కనిపించాయి. ఇవి మంచును బద్దలుకొట్టి, నిద్రపోతున్న సీల్ జంతువులను నీళ్ళలో పడేసి మింగేసాయి. మనుష్యుల్ని కూడా మింగేస్తాయి గాని ఎవరూ ఇంతవరకూ ఈ విషయమై పరిశోధన చేసినట్లు లేదు.

బొచ్చుసీల్ ను వేటాడడంకోసం బయలుదేరిన నావికులు 1820 ప్రాంతాల్లో మొదటిసారిగా అంటార్కిటికా ఖండాన్ని కనుక్కొన్నారు. కాని ఆ రకం సీల్స్ త్వరలో అంతరించిపోయాయి. పీతలను తినే సీల్స్, రాస్ సీల్స్, సముద్రపు చిరుతపులులు, వెడెల్ సీల్స్ అనే రకాలుమాత్రం ఇంకా చాలా ఉన్నాయి.

ప్రస్తుతం అంటార్కిటికాలో పరిశోధన చేస్తున్న అమెరికన్ జట్టువద్ద ఒకరకం తుపాకిగుండ్లు ఉన్నాయి. వీటిమీద నెప్పి కలగకుండాచేసే ఒకమందు పూసి సీల్స్ లోకి పేలుస్తారు. వీటివలన పీతలను తినే రకం సీల్స్ ఏ కాలంలో ఎక్కడికి వలసలు పోతాయో కనిపెట్టవచ్చునని శాస్త్రజ్ఞుల ఉద్దేశం. ఇవి కదులుతున్న హిమఖండాల మీదనే నివసిస్తూ ఉంటాయి. పైగా మనుష్యుల్ని చూసి బెదిరిపోతాయి. అందుచేతే ఇంతవరకూ వీటి అలవాటును ఎవరూ పరిశీలించలేదు. ఇవి అసంఖ్యాకంగా ఉన్నాయి. వీటికి బొచ్చు లేదుగాని, వీటినూనె, కొవ్వు ఉపయోగకరమైనవే. ఒకసారి కొందరు శాస్త్రజ్ఞులు 60 మైళ్ల మేరలో చూసిన 809 సీల్స్ లో 5 రాస్ సీల్స్, 11 సముద్రపు చిరుతపులులు, మిగతావన్నీ పీతలను తినే రకం సీల్స్ అని తెలిసింది.

ఎడిలీ పెన్గ్విన్లకు సముద్రపు చిరుతపులులకు బద్ధవైరం. ఎడిలీ పక్షులు సముద్రంలో అతివేగంగా ఈదగలవు. కాని సముద్రపు చిరుతపులులు ఇంకా వేగంగా, ఈదివాటిని పట్టుకుని చంపేస్తాయి. నీటి బయట ఇవి అంత అపాయకరం కావు. కాని ఎవరన్నా ఎదురొచ్చినప్పుడు తీవ్రంగా పోట్లాడి తరి

(56-వ పేజీ చూడండి)

నీలాటిరేవు

విశాలాక్షమ్మ రోజూకంటె ముందుగానే నీళ్ళకోసం రేవులోకి వచ్చింది. ఆవిడ ముఖంలో సంతోషం తాండవమాడుతోంది. అంతేకాదు! ఆ సంతోషంలో గర్వంకూడ మిళితమైందని వేరే చెప్పక్కర్లేదు.

రేవులో ఉన్న అమ్మలక్క లందరూ విశాలాక్షమ్మను చూసి ఆశ్చర్యపోయారు. రోజూ పొద్దెక్కిన తర్వాత వచ్చే విశాలాక్షమ్మ యివాళ యింత తొందరగా రావడములో ఏదోవిశేషం ఉండితీరా లనుకున్నా రంతా.

ఆవిడ చరచరా రావడంతోనే, "చూశావుటే? చుక్కమ్మా! ఎంత విడూరమో?" అనగానే చుక్కమ్మ "ఏమిటే? ఏమిటే? ఏం జరిగిందక్కా?" అనే ప్రశ్న పూర్తి గాక ముందే మిగతా అమ్మలక్కలు తమ తమ పనులు మరచిపోయి, అసలు విషయ మేమిటో విందామని చెవులు రిక్కించి, తహతహ లాడుతున్న సమయంలో యీవిధముగా మొదలుపెట్టింది, విశాలాక్షమ్మ.

"పవన్"

"ఏమని చెప్పను చుక్కమ్మా! ఈ నోటి తోటి ఆపాదువిషయాలు చెప్పితే, గంగలో దూకినా పాపాలు పోవంటే నమ్ము!"

"ఇంతకీ ఏం జరిగిందక్కా?"

"జరగటాని కేముంది? ఆ మంగమ్మ లేదూ! నా అంత గొప్పది లేదని మిడిసిపడి పోతో వుంటుంది, తెలీదూ? దానికూతురు లేదూ? ముండమోసిన కూతురు! అది ఏ తురకవాడి తోనో పోయినరాత్రి లేచి పోయిందట!"

అమ్మలక్క లంతా ముక్కుమీద వేలేసు కున్నారు.

"దానికేం పొయ్యే కాలం వచ్చిందో?" అంది చుక్కమ్మ.

"దానికి పొయ్యేకాలం ఎప్పుడో వచ్చింది. వాడితో లేచిపోదామని ఎప్పటినించో కలలు కంటోంది."

"ఇంతకీ కాలం మారిపోయిందమ్మా! లేక పోతే ఇంత ఘోరమా?" అంది రంగమ్మ.

"రంగమ్మక్కా కాలం మారిపోయిం దంటే నేనొప్పుకోను. అంతా సరిగ్గానే లేరూ? అందరూ మంగమ్మ కూతురులాగే లేచిపోతున్నారా?"

విశాలాక్షమ్మకి ఎదురుచెప్పే ధైర్యం, శక్తి ఎవరికీ లేదు. ఒకవేళ ఎదురుచెప్పితే ఆ విసురు వీళ్ళమీదకి తిరుగుతుందేమోనని భయం. అందుకనే అందరూ ఆవిడ మాటకి తందానతాన కొట్టారు.

"నేనప్పుడే అనుకున్నాను. ముండ మోసిన దానికి ఆబొట్టేమిటి? ఆ అలంకారా లేమిటి? మా ఆయన పోగానే జుట్టు తీయించి నన్నొకమూల కూర్చోపెట్టలేదూ" అని ఇంకా ఏవేవో చెప్పుతూంటే "ఇంతకీ రోజులు మారిపోయాయమ్మా! పాపిష్టి రోజులు!" అని అందామని నోటిదాకా వచ్చింది రంగమ్మకి, కాని ఊరుకుంది. దోషమంతా కాలంమీద రుద్దటమంటే విశాలాక్షమ్మ కిష్టము లేదు. దోషమంతా మంగమ్మ కూతురిదే అంటుంది.

నీలాటి రేవులో నలుగురూ నాలుగువిధాలుగా మంగమ్మ కూతురుగురించి ఆడిపోసు కున్నారు.

రేవునించి సంతోషాతిశయంతో విశాలాక్షమ్మ యింటిదారిపట్టింది.

* * *

విశాలాక్షమ్మకి మంగమ్మకూతురంటే తగని అక్కసు. ఆ అక్కసు తీర్చుకోటానికి సమయం దొరికిందని సంతోషపడింది.

ఇంతకీ విశాలాక్షమ్మకి మంగమ్మ కూతురంటే అంతద్వేషం ఎందుకో ఎవరికీ తెలియదు. కాని కారణం లేకపోలేదు. తన మనుమడు శేఖరానికీ, మంగమ్మ కూతురికీ ఏదో సంబంధం ఉందని ఎవరో చెప్పారు. తర్వాత తర్వాత ఆ అనుమానం స్థిరపడిపోయింది. కొడుకుతో ఎన్నోసార్లు చెప్పింది. "నాయనా! శేఖరానికి త్వరగా పెళ్ళిసంబంధం చూడరా. వాడు అనవసరంగా చెడిపోతున్నాడు" అని.

మంగమ్మ కూతురంటే తనకి తగని మంట! ఆ మంట యివ్వాళ ప్రొద్దున్నే చల్లారింది. పీడవదిలింది. ఆవిడ హృదయం తేలికయింది.

ఆవిడ చాలారోజులుగా భగవంతుణ్ని ప్రార్థించింది "హే! భగవంతుడా! యీ ముండమోసినదాని బారినుండి నామనమణ్ని రక్షించు!" అని. చివరికి భగవంతుడు రక్షించాడు. అంతకంటే తనకు కావలసినదేముంది?

రేవునించి యింటికివస్తూ ఆలోచించింది. మంగమ్మ కూతుర్ని తిట్టటం పొరపాటనుకుంది. మంగమ్మకూతురు ఎవరితోనో లేచిపోయి, తన హృదయంలోని భారాన్ని తగ్గించింది. నిజంగా దానికి చెయ్యెత్తి దండం పెట్టవచ్చు ననుకుంది.

* * *

పోయిన రాత్రి రెండోఆట సినిమాకి వెళ్ళుతున్నానని శేఖరం యింటినించి బయలుదేరాడు. రాత్రిరాలేదు. తెల్లారినా రాలేదు

విశాలాక్షమ్మ నీళ్ళబిందెతో యింట్లో అడుగుపెడుతో "ఏమర్రా! శేఖరం వచ్చాడా?" అని అడగడం తడవుగా అంతా గొల్లుమన్నారు. శేఖరం రాత్రి యింట్లోంచి బయలుదేరేటప్పుడు ఉత్తరంరాసి బల్లమీద పెడితే, అది పొద్దున్న చదువుకున్నారట!

"అప్రాచ్యుడు! వంశానికి అప్రతిష్ఠ తీసుకువచ్చాడు" ఇంకా ఏవేవో గొణగటం మొదలుపెట్టింది విశాలాక్షమ్మ.

శేఖరం తిరిగిరాలేదు.

విశాలాక్షమ్మ మర్నాడు రేవులోకి వెళ్ళలేదు. ★

★ లోకానుభవం ★

(27-వ పేజీ తరువాయి)

ఇంతలో కామేశ్వరమ్మ కూతుర్ని ముందుంచుకుని వచ్చి ఆమెని తివాసీమీద కూర్చోపెట్టింది. రామకృష్ణని చూస్తూనే తెల్లబోయింది రాజమణి ఆ అప్సరసని చూడగానే కళ్లు చెదిరేయి రామకృష్ణకి.

పాటపాడమంది కామేశ్వరమ్మ ఆ క్రితం రోజే విడుదలయిన సినీమాలో నాయిక పాడినపాట సినిమా పాటల పుస్తకం ముందుపెటుకుని పాడింది రాజమణి 'అమ్మాయిని ఒకసారి నడిపించండి' అన్నాడు జోగారావు. హంసయానని నిరూపించుకుంది అమ్మాయి. ఇలాగే జరగవలసిన తంతు జరుగుతోంది. ప్రశ్నోత్తరాలు జరుగుతున్నాయి. అదంతా నే వ్రాసేనంటే మన పెళ్లిచూపుల విధానాన్ని హేళన చెయ్యడం రచయిత ఉద్దేశం అని మీరు అపోహపడవచ్చు

జోగారావు అన్నాడు. 'నువ్వు ఫిఫ్తుఫారం ఫసుగా పేసయేవని తెలిసి చాలా సంతోషించేనమ్మాయ్.'

'ఎనభైరూపాయలకీ నేను లొంగలేను. ముప్ఫయ్‌తోనే ఆ హెడ్మాష్టరుని చేజిక్కించుకున్నారు. ఇక పేసవడం ఒక లెఖ్ఖా?' అని రామకృష్ణ సహించలేక అనేసేడు.

అంతా ఆశ్చర్యపోయారు.

'అబద్ధం. ముఫ్ఫయ్ కాదు ఏభై!' అని గబుక్కున శేషగిరి అన్నాడు; వెంటనే నాలిక కరచుకొన్నాడు.

జోగారావూ, జగన్నాధరావూ అయోమయంగా పరస్పరం చూసుకున్నారు. తర్వాత జగన్నాధరావు వరసగా శేషగిరివైపూ భార్యవైపూ కోపంగా చూశాడు నిప్పులు కురుస్తున్న భర్త కళ్లని చూసి కామేశ్వరమ్మ తను తమ్ముడి చేతికి 50 రూపాయలిచ్చి హెడ్మాష్టరు దగ్గరికి పంపినట్టు ఒప్పుకున్నది.

రాజమణి తల సిగ్గుతో కుంగిపోతుంది.

'భేష్ అంటే లంచం పట్టుకెళ్ళినందుకు ఆయన తీసుకున్న లంచం ఇరవై రూపాయలన్న మాట. బాగుంది జగన్నాధరావుగారూ బాగుంది. హెడ్మాష్టరుకంటె మీ బావమరిదే ఘనుడు. ఒకరు మూడోకంటి వాడికి తెలియకుండా లంచం పడితే, ఇంకొకరు రెండో కంటి వాడికే తెలీకుండా పట్టేరు. 'అతనికంటె ఘనుడు ఆచంట మల్లన్న.' అన్నాడు రామకృష్ణ—నవ్వుతూ.

కామేశ్వరమ్మా, శేషగిరులు కోపంతోనూ, రాజమణి సిగ్గుతోనూ సగం చచ్చిపోయేరు.

'వెరీగుడ్ మాష్టారూ, మీకిన్నాళ్ళూ ఒక్క లోకానుభవం మాత్రం లేదనుకున్నాను. ఇప్పుడా సంశయం తీరిపోయింది' అని పకపక నిష్కల్మషంగా నవ్వేడు జగన్నాధరావు


కామేశ్వరమ్మా శేషగిరులు బుసకొట్టి మాయమైనారు

రామకృష్ణ రాజమణిని చూపించి నవ్వుతూ తండ్రితో 'నాన్నారూ, ఇప్పుడు మనం వీరిని యిబ్బంది పెట్టడం మంచిది కాదు. ఇంటికి వెళ్ళిపోదాం పదండి,' అన్నాడు

అతన్ని క్రీగంట కనిపెటిన రాజమణి ముసిముసి నవ్వులు నవ్వుతూ ఇంట్లోకి వెళ్ళిపోయింది. జగన్నాధరావు నవ్వేశు. తను నవ్వకపోతే బాగుండదని జోగారావు నవ్వేడు—ఇదేమీ బోధపడక పోయినా.

రాజమణి తిరిగివచ్చి టేబుల్ మీద నొక కవరుంచి 'దీనిని తిరిగి తీసుకోండి' అని రామకృష్ణతో పలికి లోపలికి వెళ్ళిపోయింది.

రామకృష్ణ బరువైన ఆకవరుని ఆతృతగా ఎత్తి లోపలి కాగితాలని తీసేడు. ఏముంది? తను సున్నచుట్టిన రాజమణి లెక్కల పేపరు! ★





వనితా లోకం

ఊహ మంచిదే ★ కాని—

ఒక రోజు నేను నిద్రపోతుండగా ఒక తేలు నా బుగ్గమీద పడింది. గబుక్కుని లేచి దులపడంతో అది కిందపడింది. వెంటనే చంపేశాం. ఆరోజు నా అదృష్టం బాగుండి తేలుకుట్టలేదు. తెల్లవారేక ఈ సంగతి ఇరుగుపొరుగులతో చెప్పేను. కాంతం అనే అమ్మాయి, "ఈరోజు నీఅదృష్టం బాగుంది లేకపోతే ఎంతబాధ పడుదువో పాపం!" అని సానుభూతి చూపించింది. నామనస్సు సంతోషించింది.

అప్పుడే జానకమ్మగారు "ఆ తేలు నిన్ను వదిలేసింది కాని కుట్టవలసింది. ఎప్పుడు కష్టమంటే ఏవిటో తెలియని నీకు బాధంటే ఏవిటో తెలుసును" అంది చటుక్కున. నా మనస్సు చివుక్కుమంది. ఈ మాట అనడం వల్ల ఆవిడకేం లాభం చెప్పండి. ఇద్దరికీ నామీద ద్వేషం ఏంలేదు ఐతే ఇద్దరిమాటలోను తేడా మాశారా? ఒకరిమాట ఆనందాన్నిచ్చింది. మరొకరిది బాధపెట్టింది. మంచిమాటవల్ల నష్టంలేదు. చెడ్డమాటవల్ల లాభంలేదు.

* * *

ఓసారి మేం ఒకరింటికి పేరంటానికివెళ్ళేం. వాళ్ళింట్లో పిల్లాణ్ణి తొట్లో వేస్తున్నారు. ఆపాప కొంచెం సన్నంగా ఉన్నాడు. చాలామంది ఆ అబ్బాయిని దీవించారు. ఒకావిడ బాలింతరాలితో "ఇదేవిటే నీపిల్లాడిలా ఉన్నాడు? అసలు వాడు బతికున్నాడా లేదా?" అంది నవ్వుతూనే. పాపం ఆ కన్నతల్లి మనసు ఎంత గిలగిలాడిందో వేరే చెప్పాలా?.. ఇంతకీ ఆ అన్నావిడ మనసు మంచిదే మాట సరి లేదు.

మా నేస్తం ఒకామె ఏదో మాటమీద నాతో సంగతి చెప్పింది. ఆవిడ ఏదో కోపంమీద వాళ్ళబ్బాయిని ఏదేళ్ళవాణ్ణి "పోరా వెధవా" అందిట. వెంటనే వాళ్ళాడపడుచు "నీ కొడలు చావాలని కోరికగా ఉందిటే" అందిట, ఏదో తెలివిగా మాట్లాడుతున్నాననుకుని. ఇప్పటికీ మా నేస్తం ఆమాటకి చాలా బాధపడుతుంది. ఏదో విసుగుమీద కసురుకున్నంతమాత్రాన ఆమాటకి అతి తెలివితేటలు ఉపయోగించేసి ఇలాంటిఅవాచ్యాలు మాట్లాడితే ఎలాగ?

'అదొక సరసం!'

ఓ ఇల్లాలు స్నానంచేసి పనితొందరలో పాపం బొట్టుపెట్టుకోడం మరిచిపోయింది. ఆవిడభర్త "వెధవముండలా ఆ వాటమేమిటే? నే బతికుండగానే ఆ వేషం వేసుకోవాలని ఉందిటే?" అన్నారు హాస్యధోరణిలో. ఆవిడ బొట్టుపెట్టుకున్నాననే దృష్టిలో వుండడంచేత భర్త ఎందుకిలా అంటున్నాడా అని గాభరాపడింది "బొట్టు మర్చిపోయావ్ పెట్టుకో" అంటే ఏబాధా లేదుగా.

ఈ తరగతి మనుష్యుల్లో కొందరు వేదాంతులుంటారు. మా ఆయన స్నేహితుడు "ఏమోయి సినిమాకెడదాం వస్తావా" అన్నాడు. మావారు "రేపెడదాం లేవోయ్" అన్నారు. "రేపు చస్తామో బతుకుతామో, ఇవాళే వెడదాం రద్దూ" అన్నాడా మిత్రరత్నం!"

ఒకనాడు ఉమ షిఫాన్ చీరకట్టుకుంది పొరుగింటావిడ "ఏం సిల్కుచీర కట్టేవు. ఎక్కడికైనా వెడతావా?" అని అడిగింది. మా ఉమ "లేదండీ వేసవికాలం కదాని పల్చటి చీరలే కడుతున్నాను. ఈ చీరలు ఎలాగ పాతబడ్డాయికదాని ఇంట్లో కట్టేస్తున్నాను" అంది. వెంటనే మెచ్చుకుంటున్నట్టుగా "మంచిపని చేశావు. ఈ రోజు చస్తే రేపు రెండు. ఉన్నన్నాళ్ళూ అనుభవిస్తేనే మంచిది" అనేసింది చటుక్కున... ఊహ మంచిదే మరి!

ఇలాగే మా బంధువుల్లో ఒకావిడ ఉంది. ఆవిడ ఒక అమ్మాయికి ఇలాగే సలహా ఇచ్చింది ఆ అమ్మాయికిచాలా నగలున్నాయి. అవి ఎక్కడికైనా వెళ్ళినప్పుడు పెట్టుకుని ఇంటికి రాగానే దాచేది జాగ్రత్తగా. అలా దాచడం చూసి మా బంధువు "చూడమ్మాయి నీ నగలన్నీ పెట్టి దాపరికం చేస్తావెందుకూ? ఉన్నది హాయిగా అనుభవించాలిగాని. పాపం సూరమ్మగారు చూశావూ చచ్చి ఏ స్వర్గాన్నుందోగాని బతికున్నన్నాళ్ళూ అరిగిపోతాయేమోనని నగలూ చిరిగిపోతాయని గుడ్డలూ చూసి చూసి వాడేదికాదు, ఇప్పుడు ఆవిడ మొగుడు మళ్ళీ పెళ్ళిచేసుకున్నాడా ఇవాళ ఆ చీరలు, నగలుతో హాయిగా కులికేది ఆవిడ సవితి." అని విలువైన సలహానిచ్చింది—ఎంతో మృదువుగా ముచ్చటగా! ఇలాంటి వేదాంతుల మనస్సు మంచిదే అయిఉంటుంది. కాని తెలివైనవాళ్ళం అనిపించుకుందుకు ఇలా మాట్లాడితారనుకుంటా!

ఇంక ఎదుటివారిని నవ్వించడంకోసం కొందరు అపశకునపు మాటలు మాట్లాడుతారు. ఒక తొమ్మిదేళ్ళమ్మాయిని వాళ్ళ మావయ్య "ఒసే వెంకయ్య తాతని పెళ్ళాడతావే?" అని అడిగేడు. పోనీ ఏదోఅంటే అన్నాడని ఊరుకోవచ్చా? అలా ఊరుకోక ఆ అమ్మాయి చిలిపి చిన్నాన్న "వెంకయ్య తాతని పెళ్ళాడితే దిబ్బరొట్టె త్వరగావస్తుంది" అన్నాడు నవ్వుతూ. దిబ్బరొట్టె అంటే వితంతువులు రాత్రి అన్నంబదులు ఏదైనా ఫలహారం చేస్తారుకదూ? అందుకు అలా అన్నాడు నవ్వుతూ. అతని ఉద్దేశం తాతని పెళ్ళిచేసుకుంటే త్వరగా వితంతువౌతుందని.

హాస్యానిక్కాకుండా కొందరు కేవలం దురుసుతనంకొద్దీ, ఎదటివాళ్ళని ఆక్షేపించడానికి అవాచ్యాలు పలుకుతుంటారు. మా

పంతుల సౌభాగ్యలక్ష్మి

పాత బట్టలు

సాధారణంగా ప్రతీవస్తువూ క్రొత్తలో వుపయోగపడినట్లే పాతబడ్డాక కూడా ఒకలా కాకపోతే మరోలా ఉపయోగిస్తుంది. బట్టల విషయంలో వేరే చెప్పనక్కర్లేదనుకుంటా. ప్రతి పుట్టినది మొదలు యేదో ఒక విధంగా వుపయోగపడుతూనే వుంటుంది. ఆ ప్రత్తితో తయారైన బట్టలెప్పుడూ వుపయోగిస్తూనే వుంటాయి. అసలు బట్టలు పాతవవనీండి క్రొత్తవవనీండి యేదో ఒక విధంగా వినియోగపడుతూనే యుంటాయి. కానీ మనలో చాలామంది క్రొత్తబట్టలమీద చూపినంత శ్రద్ధ పాతబట్టలమీద చూపరు. దానికి కారణం బట్టలు ధరించడానికే కాకుండా మనకనేకవిధాలుగా వుపయోగపడ్తాయనే విషయాన్ని గమనించకపోవడమే ననుకుంటా.

మొన్న నొకనాడు మధ్యాహ్నం మా పక్కింటి యిల్లాలు మా యింటికి వచ్చింది. కూడా వాళ్ళబ్బాయి కూడా వున్నాడు. కాళ్ళకీ, చేతులకీ యేవో కట్లున్నాయి. ఏ చెట్టుమీదనుండో క్రింద పడుంటాడనుకున్నాను. కానీ ఆ అబ్బాయి ఆడుకుంటూ తుంగచాపలో కాలు తాడుతగిలి తూలిపడ్డాడని, కాళ్ళకి, చేతులకి గట్టిదెబ్బలే తగిలాయని ఆవిడ చెప్పింది. చాపమీదనుంచి జారిపడడం వల్ల ఒక్కొక్క సందర్భంలో యెముక దెబ్బతిని విరగడంకూడా మనం చూస్తూనే వుంటాం. కానీ తగిన జాగ్రత్త తీసుకోం. సాధారణంగా పెద్దవాళ్లు నడిచినంత జాగ్రత్తగా చిన్న పిల్లలు నడవరు. అందులోనూ చాపలమీద పెద్దవాళ్ళకే ఒక్కొక్కప్పుడు జారిపడడం సంభవిస్తుంది. పిల్లలసంగతి వేరే చెప్పాలా? తుంగచాపలైతే మరీను. కొన్ని కొద్దిరోజులకే చాపకి నాలుగువైపులు చిరిగి త్రాళ్లు చిందరవందరగా బయటకొస్తాయి. ఏ కాలికైనా ఆ త్రాళ్లు చిక్కుకున్నాయంటే

సోమంచి అనంతలక్ష్మి ప్రభాకరం

క్రిందపడడం తటస్థిస్తుంది. చాపలు నాలుగు వైపులా త్రాళ్ళు తెగకుండా మన మేదైనా పాతఫాంటునుక త్తిరించి మడతలు పెట్టి నాలుగు వైపులా చాపకి అంచులా కుడితే చాప చాలాగట్టిగావుండి చాలాకాలం చిరిగిపోకుండా వుంటుంది. పైగా నాలుగు వైపులూ కొంచెం జాగ్రత్తగా కుడితే రంగుల గుడ్డ కాబట్టి చాలా అందంగా వుంటుంది. ఇంకో విషయం చెప్పడం మరిచా. చాపకి అంచు వేసేటప్పుడు యెప్పుడూ మనం రంగు బట్ట తప్ప తెల్లగుడ్డ వేయకూడదు. మనం చాపని వాడుకుంటే తెలగుడ్డలైతే మరీ త్వరగా మాసిపోతాయి. ఈ విధంగా చేయడంవలన చాపలు చాలాకాలం మన్నుతాయి. సామాన్య సంసారులెవరూ తరుచు చాపలని కొనుక్కోలేరు. గనుక యీ పద్ధతి చాలా వుపయోగపడుతుంది.

పాత ఫాంట్లని కత్తిరించి సంచులు కుట్టుకోవచ్చు. ఫాంటు గుడ్డ దళసరి గనుక సంచులు కూడా చాలాకాలం వుపయోగపడతాయి. పువ్వుల చీరల్నీ పరికిణీలనీ కత్తిరించి ద్వారాలకీ, కిటికీలకీ కర్టెన్స్‌గా కుడితే చాలా బావుంటాయి. అసలు అవి పాతబట్టలు అని యెవరూ పోల్చుకోనేలేరు! పువ్వుల బట్టలూ, వాయిలు బట్టలూ అయితే మరీ బావుంటాయి. కర్టెన్స్‌కి తెల్లబట్టలని వాడకూడదు. ఎందుకంటే త్వరగా మాసిపోతాయి. బాగాపాతబడి రంగువెలిసిపోయిన చీరల్ని బొంతలు కుట్టుకుంటే చాలా బాగా వుంటాయి, వుపయోగపడతాయి కూడాను. పైనమాత్రం బొంతకి కొంచెం మంచి చీరను వేసుకు కుట్టుకుంటే బొంత చూడ్డానికి బాగుంటుంది. ఇంతేకాకుండా పాతబట్టల్ని, అంటే మరీ నలిగిపోయిన బట్టల్ని అందంగా మడచి సంచులగానూ, డోర్ కర్టెన్స్‌గానూ కుట్టుకోవచ్చు. పాతచీరల అంచుల్ని అంటే గ్లాస్కో చీరల అంచులవంటి దళసరి అంచులతో కొందరు సంచుల్ని కుడతారు. అవి కూడా బాగానే వుంటాయి.

పాతబట్టల్ని మాత్రం మన మెప్పుడూ వృథాగా పాడుచేయకూడదు. సాధారణంగా అందరూ పాతబట్టల్నిచ్చి, స్టెయిన్‌లెస్ స్టీలు పాత్రల్నీ తదితర లోహ పాత్రల్నీ కొంటూంటారు. కానీ అలా కొనడంవల్ల మనకే నష్టం. మావాళ్ళొకసారి కొన్ని బట్టల్నిచ్చి స్టెయిన్‌లెస్ స్టీలు గిన్నెని కొన్నారు. అంతే గిన్నెని బజారుకెళ్ళి కొనబోతే బట్టల విలువకంటె గిన్నెవెల చాలా తక్కువైంది. పైగా బట్టలిచ్చి కొన్న స్టెయిన్‌లెస్ స్టీలుగిన్నె త్వరగా కగ్గిపోయి కొంచెం నల్లగా తయారయింది. దీన్ని బట్టి చూస్తే బట్టల్నిచ్చి కొనడం యెంత నష్టమో గ్రహించవచ్చు. మనవాళ్ళు చాలామంది బట్టల్నిచ్చికొంటే చౌకగా వస్తాయని భ్రమపడుతూంటారు. కానీ మనమిచ్చే పాతబట్టల వెలని గ్రహించరు. పాతబట్టల్నిచ్చి మాత్రం మన మెప్పుడూ కొనగూడదు. క్రొత్తవైనా పాతవైనా బట్టలెప్పుడూ వుపయోగపడుతూనే వుంటాయి, మనం వుపయోగించుకోవడంలో వుంది. ★

ఊహ మంచిదే కాని—

ఇంటికొకాయన వచ్చేడు. అప్పుడే మా బావగారికి కొడుకు పుట్టినట్టు శుభలేఖ వచ్చింది మాకు. అందరం ఉత్తరం చూసి చాలా సంతోషించాం. మా ఇంటికొచ్చినాయన ఆఉత్తరం తనుకూడా పుచ్చుకుని చదివేడు. ఆ శుభలేఖలో "చిరంజీవి కాంతానికి ఫలానా తేదీనాడు పుత్రోదయమైంది. మాతాశిశువులు క్షేమం" అని ఉంది. ఆ శుభలేఖ చదివినాయన చదివి తనూ సంతోషించడం మానేసి పైగా "ఇదివిటండీ చావు ఉత్తరం రాసినట్టు రెండు వాక్యాలురాసి ఊరుకున్నాడు. పోనీ ఇంత పసుపైనా అంటిస్తే శుభలేఖని తెలుసుకోవచ్చు. చదవకముందు ఎవరు పోయారో అనుకున్నా" అన్నాడాపెద్దమనిషి. ఆయన నోటంట ఏమువోర్తాన వచ్చిందో ఆమాట, మా బావగారి పసివాడు చచ్చిపోయాడు. అన్నంతమాత్రాన ఏపోతుందాఅంటారేమో వినా అవకపోయినా చెడ్డమాట అన్నాక అది కనక ఏతే అలా అన్నందువల్లే ఏంది అనిపిస్తుంది. ఒకవేళ అనకపోయినా మనసు పీకుతూనే ఉంటుంది. ★



ప్రకృతిసాధించిన పరమౌషధాలు: (3)

మకరందము

తేనె, మధు, క్షౌద్రరస, పుష్పాసవ అనియు ఇంగ్లీషులో హనీ అనియు పేర్లు. తేనె భారతావనిలో అనాదినుండియు మంచి వాడుకలో వున్నట్టు మన పురాణాలు చాటుతున్నాయి. ఋగ్వేదకాలంనుండి చాలావిధాల వాడుకలోవుంది. అనేక శుభ కార్యాలందు, పూజల్లోను వాడతాము. —పంచామృతాల్లో తేనె యొకటి. చాలా ఆయుర్వేద ఔషధాలలోను (లేహ్యములు అరిష్టాలు మొ॥) యూనాని మందుల్లోను వడుతుంది. ఆయుర్వేద మందులు మనం వాడుకోవటానికి తేనె అనుపానంగా చెపుతారు. దీన్ని ఏజన్సీప్రాంత కోయజాతి వారు ఆహారంగాకూడ వాడతారు. మహమ్మదీయ మతగ్రంథమయిన ఖురాన్‌నందు క్రైస్తవ మతగ్రంథమయిన బైబిలునందు తేనె వుదహరించబడినట్లు చెప్తారు. దీన్నిబట్టి మానవజాతి అన్నిమతాలవార్కి చాలావరకు తేనె వుపయోగాలు లాభాలు బాగా తెల్సుననే భావించాలి. కాని తేనెను విరివిగా నుపయోగించునది భారతదేశమే, పాశ్చాత్య దేశాల్లో తేనెను విరివిగా వాడుతున్నట్లు కానరాదు. ఈమధ్య విదేశాల వారు కూడ కొంతవరకూ ఔషధంగాను ఆహారంగాను వాడుచున్నట్లు తెలుస్తుంది.

తేనె విశేషగుణాలు తెల్సుకొని, అనాదిగా ఔషధంగాను, ఆహారంగాను వాడుచున్న భారతభూమియందే స్వచ్ఛమైన తేనె లభించుట దురదృష్టవశాత్తు ఈనాడు కష్టంగావుంది. బజారులో లభ్యమయ్యే తేనె కల్తీది మాత్రమే. స్వచ్ఛమైన తేనెలో బెల్లంపాకంగాని, పంచదారపాకంగాని కల్పివేస్తున్నారు. ప్రభుత్వం అట్టి మోసపు వ్యాపారులనుపట్టి కఠినశిక్ష విధించి స్వచ్ఛమైన తేనె ప్రజలకు లభ్యమయ్యేలాగున చూచుట యెంతైనా అవసరం. సామాన్యంగా మనం స్వచ్ఛమైన తేనె అని నిర్ధారణ చేసుకోవటానికి కొన్ని పరీక్షలున్నవి.

తేనె మనదేశంలో అడవిప్రాంతాల్లోను మన్యప్రాంతాల్లోను వుత్పత్తి అవుతుంది. మా ప్రాంతాల్లో ఏలేశ్వరం, భద్రాచలం ప్రదేశాలనుండి వస్తుంది. కూర్గు, కశ్మీరము కేరళము మొదలైనచోట్ల చాలాయెక్కువగా లభిస్తుంది. అందులో కాశ్మీరప్రాంత తేనె చాలా గుణవంతమైందిగా ప్రసిద్ధిగాంచింది.

రకాలు: పట్టుతేనే, పుటతేనె అనియు, క్రొత్తతేనె పాతతేనె అనియు, వాడుకలోనివి. శాస్త్రరీత్యా తేనెను మాక్షికము, పౌత్తికము, క్షౌద్రము, భ్రామరము అని నాలుగువిధాల భాగించేరు. (1) మాక్షికమనుతేనె తైలమువలెను (నేత్రరోగాలకిది మంచిది), (2) పౌత్తికమనునది నెయ్యివలెను, (3) క్షౌద్రము కపిలవర్ణంగాను (మేహరోగాలకి మంచిది), (4) భ్రామరమనునది తెల్లగా స్ఫటికంలాగున ఉంటుంది (రక్తపిత్తమును హరించును).

వీటిలో పట్టుతేనె, పాతతేనె, మాక్షికమను తేనె శ్రేష్ఠమయినవి.

తేనెకు వాతావరణమందలి తేమను పీల్చే గుణం వుంది. అందువల్ల అది పొంగి బరువు కూడా హెచ్చుతుంది. తేనెను శుభ్రమైన పెద్ద డబ్బా (పీపాలోనిది) లో నింపాపోసి, మూత అతికించివేసి, గట్టిగామూడివి ఒకచోట పెడితే అది పొంగి ఆ కుదురు విడదీసి పైకి వస్తుంది.

తేనె కాచినచో, తేనెయందలి దుష్ట పదార్థాలు తొలగిపోవును.


వివిధ ప్రాంతాల్లో దొరికే తేనె ఆయా ప్రాంతముల ననుసరించి వివిధరకములతోను, గుణభేదములతోనుంటుంది. రకరకముల పుష్పా

సంగాని ప్రభావతి, భానుమతి

తలనెరుపుకు చిట్కా వైద్యం

ఈమధ్య చాలామందికి చిన్నతనంలోనే జుట్టు తెల్లబడుతున్నది. అది నివారించడానికి చిన్న చిట్కావైద్యం చెపుతాను. పిప్పళ్లు తీసుకువచ్చి మొదటిరోజు ఒకటి, రెండవరోజు రెండు, మూడవరోజు మూడు, ఇట్లా పదకొండురోజులు రోజుకొకటి చొప్పున హెచ్చించి రోజూ వాటిని నూరి తేనెతో కలిపి తినాలి. ఇట్లా పదకొండురోజులూ అయాక మళ్ళీవాటిని ఒకొక్కటి తగ్గించాలి. అంటే పన్నెండవరోజున పది, పదమూడవ రోజున తొమ్మిది ఇట్లా తగ్గించి తినాలి. అప్పటికి మొత్తం 22 రోజులు అవుతుంది మళ్ళీ 22 రోజులు ఇట్లాగే తినాలి. అప్పుడు మొత్తం 44 రోజులు అవుతుంది. అప్పుడు 44 రోజులు ఊరుకోవాలి, మళ్లీ 44 రోజులు పైన చెప్పినట్లు పిప్పళ్లనూరి తేనెతో కలిపి తినాలి. ఇట్లా రెండుమూడు పర్యాయాలు చేస్తే గుణం కనుపిస్తుంది.

టి. నిర్మల (గుంటూరు)



చోళీమీదికి డిజైన్‌లు

ఎడమపక్కనున్నది చేతులమీదకు. అడుగునఉన్న డిజైను మెడ పట్టీకి వేసుకుంటే బాగుంటుంది. దీన్నే చీర అంచుకుకూడా వేసుకోవచ్చు. ఇందులో పువ్వుకు, చీరెరంగునుబట్టి దారం నిర్ణయించుకున్నా,. ఆకులకుమటుకు, మీ మీ ఇష్టాన్నిబట్టి లేతాకు పచ్చదారంగాని, ముదరాకు పచ్చదిగాని వేసుకోవాలి.

ఎ. లీలాకుమారి

(హైదరాబాద్).



★ గృహవైద్యం ★

లనుండి—వేప, నిమ్మ, ముషిణి, ప్రత్తి మొ॥—తయారు చేయబడ్డ తేనెల రుచిలోను, గుణంలోను, రంగులోకూడా తేడాలు ఉంటాయి. అనుభవంగల వైద్యులు ముషిణి, వేపపువ్వులనుండి తీయబడిన తేనె శ్రేష్ఠమైన దని అంటారు.

తేనె పరీక్ష:

రసాయనిక పరీక్ష (Chemical Test) మంచిది. కాని తేనెను యెక్కువగా వాడే వైద్యులు ఈ క్రిందివిధంగా పరీక్ష చేస్తారు:

(1) స్వచ్ఛమైన (కల్తీలేని) తేనె (అలవాటులేని) కుక్కలకు పెడితే తినవు. వాసన చూడ్డానికి కూడ యిష్టపడవు. శుద్ధమైన కాశ్మీర్ తేనె యీ మధ్య నేను తెప్పించేను. కుక్కకు పెడితే నాకేసింది—కాని యితర గుణాలన్నీ ఆ తేనెకు వున్నవి. అలవాటు పడని కుక్కలు వాసన కూడా చూడవు.

(2) మామూలు ఈగను తేనెలో ముంచితే దానిశరీరానికి, రెక్కలకు తేనెఅంటుకోదు.

(3) స్వచ్ఛమైన తేనెలో శుద్ధవత్తి తడిపి ముట్టిస్తే చిటపటలు లేకుండా వత్తి ఊదా రంగుతో వెలుగుతుంది. అలాగే పంచదార పానకంలో ముంచి అంటిస్తే చిటపటలాడి వత్తి మండదు.

(4) కారప్పున్నం, తేనె కలిపితే లేత పసుపు రంగుగా మారి, వేడెక్కుతుంది. ఒక విధమైన జిగురులా తయారవుతుంది.

(5) అనుభవంమీద స్వచ్ఛమైన తేనెను దాని రంగునుబట్టి, చిక్కదనమునుబట్టి, మాధుర్యాన్నిబట్టి నిర్ణయించవచ్చును.

(6) కల్తీ తేనె నిల్వ వుండదు. నిలవ వుంచేకొలది ఒక విధమైన పులుపు వాసన వచ్చును. రుచికూడ పులుపుగా ఉంటుంది. ఇట్టిది యెవ్వరు ఉపయోగించరాదు. విషతుల్యము.

స్వచ్ఛమైన తేనె యెంతకాలం నిల్వచేసినను చెడిపోదు. దానికు వాసన పోదు. ఇతర వస్తువులను దానిలో నిల్వచేస్తే అవి కుళ్ళిపోకుండా ఉంటాయి. అందుకే కొన్ని రకాల పండ్లు తేనెలో వూరబెట్టి ఆ పండ్లు దొరకని కాలాల్లో వుపయోగిస్తారు. మురబ్బాలను కూడ తేనెతో తయారు చేస్తారు. అల్లం మురబ్బా చాలకాలం నిల్వ వుండవచ్చు. గుణం కూడ చాలా హెచ్చుగా వుంటుంది.

(7) ఒక సీసాలో మంచి శ్రేష్ఠమయిన తేనె (కొత్తది) వేసి కార్కు బిగిస్తే కొంత కాలానికి తేనె పొంగి కార్కును పైకి తన్నేస్తుంది.

కాని వివిధప్రాంతాల్లో లభించే తేనెలు పలు రకాలుగా వుంటాయి కాబట్టి ఈ పరీక్షలకు ప్రయత్నించుటకు బదులు మీకు నమ్మకమున్న వాళ్ళదగ్గర తెచ్చుకోవడం మంచి పద్ధతి.

తేనె ఆహారంగా

తేనె ప్రకృతిసిద్ధమైన మధురాతిమధురమైన యాహారము. ఇందు అనేక శరీరపోషక పదార్థాలు, శక్తిని పెంపొందించేవి, పలురకముల విటమిన్లు వున్నాయి. మనం తీసుకునే ఇతర ఆహారపదార్థాలకన్నా, పండ్లరసాలకన్నా, పానీయాలకన్నా యెన్నోరెట్లు విలువగల పదార్థాలీ తేనెయందున్నవి. పంచ

(43-వ పేజీ చూడండి)

వంటకాలు:

★ పూతరేకులు ★

ఇది తూర్పుకేసి (విశాఖజిల్లా) ఎక్కువగా చేసుకుంటారు. ఈ పిండివంట చేసుకో డానికి పూతరేకుల కుండ వేరే ఒకటి ఉంటుంది. దానిలో ఏమి ప్రత్యేకత లేదుగాని మన మామూలు కుండలకు వలె పైన అంచు ఉండదు. ఈ పిండివంట చేసుకునేందుకు 15 రోజులముందుగానే రోజూ కుండను వెనుకకు త్రిప్పి (కుండ అడుగున) కొంచెము వెన్నపూస వ్రాసి గచ్చకాయతో అరగ తీయాలి. కొంచెముసేపు ఎండలో పెట్టాలి అలా రోజూ 15 రోజులుచేయాలి. అప్పుడు బాగా నునుపు తేలి పదునుకు వస్తుంది. ఇది కుంపటిమీదకంటె పొయ్యిమీదే వీలు. ఎందుకంటే ఆ కుండ పొయ్యిమీద బోర్లిం చుతాం గనుక కుండ అడుగుభాగము అన్ని వేపులకు మంట సమానముగా వెళ్లాలి.

నాలుగు అయిదు గంటలుముందుగా బియ్యం నానబోసుకుని అవి వడేసి పిండి కొట్టకోవాలి ఆ పిండిని మెత్తగా పల్చగా రుబ్బుకోవాలి అది ఒక వెడల్పాంటి స్టైన్లెస్ స్టీల్ గిన్నెలోకి తీసుకోవాలి తగినంత పంచదారను మెత్తగా విసిరి అట్టేపెట్టుకోవాలి అప్పుడు పొయ్యి రాజేసుకుని దానిమీద కుండ బోర్లించాలి మంట బాగామండి కుండబాగా కాలినతరువాత ఆ కుండమీద నేయి రాచుకోవాలి అప్పుడు 2 అడుగులు పొడవు ఒక అడుగు వెడల్పుగల పల్చని తెల్లని గ్లాస్కోగుడ్డ తీసుకుని ఆ రుబ్బినపిండిలో ముంచి ఆ కుండ మీద నుంచి గుడ్డను తీయాలి అప్పుడు పల్చని తెల్ల పూతరేకు కుండమీదకు వస్తుంది. (పిండిలో ముంచినగుడ్డ దాని మీదనుండి తీయుటంవల్ల) అది అట్లకాడతో తీసి విశాలమైన పళ్లెము లోనికి తీసుకోవాలి. ఇలాగే పిండి అంతా వండుకున్న తరువాత అవి ఒక కేరియర్ లోకి తీసుకోవాలి.

అపుడు పూతరేకుకు బాగ చిక్కగా నేయి రాచుకోవాలి తరువాత మెత్తగా పంచదార విసురుకోవాలి. దానిని ఆ పూత రేకునిండా తగినంత పంచదార జల్లి రేకును ఎడమ చేతివేపు 4 అంగుళము కుడిచేతి వేపు 4 అంగుళములు మడుచుకోవాలి. అపుడు ఆ రెండు మడతల మీద నేయి చిక్కగా వ్రాసి మళ్ళా పంచదారజల్లి ఆ రెండు మడతలు మరల మడత పెట్టాలి. దానిని మరల అడ్డంగా త్రిప్పి 6 అంగుళాలు ఎడమ వేపున మడత పెట్టాలి కుడివేపున గూడా అంతే మరల ఎడమ వేపున కుడివేపు 6 అంగుళాలు చొప్పున మడవాలి మడతపెట్టినపుడల్లా చిక్కగా నేయి రాసి కావలసినంత పంచదార మాత్రం జల్లాలి నేయి పంచదార కలిస్తే జిగురుగా అవుతుంది గనక మడతలు ఊడిపోవు. ఈ పూతరేకు చేసుకుని ఒత్తివే కారియర్ లో పెటి కావలసినపుడల్లా ఒక్కొక్క దానికి నేయి పంచదార

నండూరి అలవేలు తాయారు

వ్రాసకొన్నా సరే లేకపోతే చేసుకోగానే అన్నింటికి ఒక్కమాటే రాసుకుని దాచుకున్నా సరే ఒక్కసారే గనక రాసుకుంటే 4, 5 రోజులకు మించి ఉండదు. నిలువ వాసన వేస్తుంది అందుకని ఎప్పటివాటికి అప్పుడే రాసుకుని తింటే బాగుంటుంది. ఇవి చాలా బాగుంటాయి నోటిలో వేసుకోగానే కరిగిపోతాయి. ఇవి పట్నవాసం ఫ్రెండ్స్కి పెడితే ఏ దేశపు వంటకం అని అడుగుతారు ఆశ్చర్యంతో. చిట్టివలస శ్రీకాకుళం, అనకాపల్లి అనకుండా, అమెరికా, ఆఫ్రికా లేకపోతే ఇంకోపరాయి దేశం పేరుచెప్పండి మీరూ నవ్వుతూ. ★

కంచి ఇడ్లీ

ఈపిండివంట కంచి అటుకేసి ఎక్కువగా చేసుకొంటారు. నేను తీపి పిండివంట చెప్పాను గనుక అది గనక ఫ్రెండ్స్కి పెడితే తియ్యని తీపి మొహము మొత్తిపోతోందని లోలోపలైన అక్షింతలు వేస్తారు ఆ పెటిన వారు ఆ అక్షింతలు ఊరకే పోనివ్వడం ఎందుకన్నట్లుగా నామీదకి ఫిరాయిస్తారు. చేతులు కాలినాక ఆకులు పట్టుకోకుండా ముందే చేతులు కాలకుండా నేను జాగ్రత్త పడుతున్నాను ఇది అంత స్వీట్ కాదు హాట్ కాదు స్వీట్ పెట్టిన వెంటనే హాట్ పెట్టడంకంటె కమ్మనిది పెడితే బాగుంటుంది

ఇడ్లీకివలెనే దీనికి గూడా ఒక డబ్బాడు మినపపప్పు, ఒక డబ్బాడు ఉప్పుడు బియ్యం నూక నానబోసుకోవాలి. పప్పు బాగా నానిన తరువాత రుబ్బుకోవాలి. రుబ్బిన పిండి మెత్తగా కాటుకలాగాను కాకుండా బద్ద బద్దలుగాను కాకుండా సమంగా రుబ్బుకోవాలి. దీనికి వేరేబుట్టలు కొలగాను సన్నగాను బియ్యంగడుగు బట్ట అల్లినట్టుగా అల్లించుకోవాలి. 1 అణా మిరియాలు, ఒకటి రెండు శొంఠి కొమ్ములూ మెత్తగా పొడి కొట్టకొని ఆపిండిలో కలుపుకోవాలి. ఆ బుట్టలో ఈపిండిని వెయ్యాలి ఇక్కడ ఆబుట్టలో పిండి సరిపోతుందా సరిపోదా అనే సందేహం రావచ్చును. మనము రోజూ చేసుకునే పిండినిబట్టే బుట్ట అల్లించుకోవాలి.

★ టొమాటోతో ఊరగాయ ★

కావలసిన వస్తువులు 1 వీశ టొమా టోలు. (దొరగా ఉన్నవి), ఒక సవా శేరు చింతపండు, రెండు గిద్దల కారం, మూడు గిద్దల ఉప్పు, ఒక సవా శేరు నువ్వులనూనె.

తాలింపు సామగ్రి. 15 ఎండు మిరప కాయలు, 1 స్పూను ఆవాలు, అర $\frac{1}{2}$ స్పూను మెంతులు, చిటికెడు ఇంగువ

ఊరగాయ చేయు విధానము: ముందు టొమాటోలను ముక్కలుగా తరిగి వుంచ వలెను ఒక జాడీలోనికి ఉప్పుతీసికొని, ముక్కలను అందులో వూరపెట్టవలెను. ప్రతిరోజు ముక్కలను, ఉప్పును కలుపుతూ వుండవలెను. ఈ విధముగా మూడురోజులు చేయవలెను. పిమ్మట ముక్కలను పిండి, ఆ ముక్కలను రెండురోజులు ఎండపెట్ట వలెను. ఆ మిగిలిన ఉప్పు ఝాలులో, చింత పండులోని గింజలను తీసె దానిలో 2 రోజులు నానపెట్టవలెను. తరువాత చింత పండును పిసికి, పిప్పిని, వేరుచేయవలెను. అప్పుడు దానిలో కారముకలిపి సిద్ధముగా వుంచుకోవలెను

ఒక గిన్నెలో నూనెనుపోసి బాగుగా కాగపెట్టవలెను. దానిలో ఎండు మిరప కాయలను వేయవలెను. మిరపకాయలు బాగుగా వేగినతరువాత ఆవాలు, మెంతులు, ఇంగువ వరసగా వేయవలెను. కారముకలిపి, జాడీలో ముక్కలను, నూనెనుపోసి బాగుగా కలపెట్టవలెను అప్పుడు ఊరగాయ తయారగును. చాలా రుచిగా వుండును. ఇది తక్కిన ఊరగాయలవలె ఏడాది లేక పోయినా 6 నెలలు మాత్రము ఖచ్చితముగా నిల్వయుండును, ఇది చేయుటకూడ చాలా తేలిక.

వేదా లీలావతి, (గుంటూరు)



పుష్పమువలె...
రెక్సోనాతో మీ చర్మ
సౌందర్యము వికసించును
రెక్సోనా సబ్బులో, కేడిల్ ... చర్మమును పోషించు
నటువంటియు మీ సహజ సౌందర్యమును బయల్పరచు
టకు సహకరించునటువంటియు ఒక ప్రత్యేక నూనెల
మిశ్రమము గలదు!
Rexona
BLENDED WITH CADYL
ఇది ఒక్కటే కేడిల్‌తోగూడిన సబ్బు
రెక్సోనా ప్రొప్రయిటరీ లిమిటెడ్ తరఫున భారతదేశంలో తయారుచేయబడినది
RP. 148-X52 TL

కంచి ఇడ్లీ

కుంపటిమీద పొట్టబాగా వెడల్పుగా మూతి సన్నగా ఉన్న గిన్నె పెట్టుకోవాలి అందులో నీళ్ళుపోసి దానిమీద చిన్న తడిక పెట్టాలి. దానిమీద ఈబుట్టపెట్టి మూత పెట్టాలి. ఆనీరు మరిగిన ఆవిరికి ఆ బుట్టలోని పిండి ఉడికిపోతుంది. అది తీసుకొని విశాలమైన పళ్ళెంలో వేసుకుని విడ తీసుకుని నెయ్యి వేసుకొని కలుపుకొని తినాలి. ఆస్వీట్ తిన్న వెంటనే ఇది తింటే చాలా బావుంటుంది. ★


కర్ బజీలు

ఇంటికివచ్చిన స్నేహితులకుగాని, బంధువులకుగానీ కర్ బజీలు పెడితే మిమ్మల్ని అభినందించకమానరు' నిల్వ గూడా ఉంటాయి. నేను ఇచ్చిన లెక్కప్రకారం ముందర కొద్దిగాచేసుకోండి. అవి కుదిరాక తర్వాత ఎక్కువ చేసుకుందురుగాని. ఏం! నేను ఎక్కువ ఇస్తున్న లెక్కచూసి ఒక్కమారే భయపడకండి. దీన్నిబట్టి మీరు చేసుకున్న దానికి పాళ్ళు తెల్సుకోవచ్చు.

కావలసిన సామానులు కొబ్బరికాయలు. నాలుగు, అర వీశెడు బెల్లము, ఒకవీశె పంచదార, రెండు తులాల ఏలక్కాయలు, రెండణాల జీడిపప్పు, కొద్దిగాపచ్చకర్పూరం కుంకుమపువ్వు.

ఇది కుంపటిమీద చేసుకొంటే బాగుంటుంది. ముందర కొబ్బరి కోరి ఉంచుకోండి. ఏలక్కాయలుగూడా పొడుంచేసి ఒక పక్కన ఉంచుకోండి. జీడిపప్పు నేతిలో వేయించి ఉంచుకోవాలి. బెల్లం పాకం పట్టాలి. కొస్త ముదురుపాకం వచ్చాక ఏలకులూ, పచ్చకర్పూరం, వేయించిన జీడిపప్పు, కుంకుమపువ్వు వేసికలియ బెట్టాలి ఒక ఐదునిమషాల తర్వాత తురిమిన కొబ్బరి గూడా వేసి కలియబెట్ట, పదినిమషాలుంచి దింపెయ్యాలి, ఆకుంపటమీదె పంచదారలో తగినన్ని నీళ్లుపోసి పెట్టాలి. బెల్లంపాకంలో కొబ్బరివేసి లౌజుచేశాక అది చల్లారాక (అంటే చెయ్యిపట్టే వేడి అప్పుడన్నమాట) చేత్తో అన్నం ముద్దలాగా బాదంకాయలాగా చెయ్యాలి. అట్లాగే లౌజుఅంతా బాదంకాయల్లాచేసి అట్టిపెట్టుకోవాలి. కుంపటి మీద పంచదారపాకం వచ్చాక దింపేసెయ్యాలి. పాకంబాగా చల్లారాకవేళ ఉంచుకున్న కర్ బజీలకు పట్టించాలి, ఇలా పాకం అన్నిటికీ పట్టించి, కాసేపు ఆరనిచ్చి డబ్బాలో పెట్టుకోవాలి, ఈ కర్ బజీలు పైన పంచదార పాకం పేరుకొని తెల్లగా వెన్న ముద్దలాగుంటుంది చిదిపితే లోపల నల్లగా ఉంటుంది. కర్ బజీలు చాలా బాగుంటాయి. కాని ఒకటి గుర్తుంచుకోండి. ముందరమటుకు కొద్దిగా చేసుకోండి తర్వాత మీ ఇష్టం.★

నండూరి రాజ్యలక్ష్మిదేవి.



"మన మనసులు మారాలి"

శ్రీమతి పి. జి. సరోజినిగారు ఈ వ్యాసము చక్కగా వ్రాశారు. ఈ వ్యాసము మహిళా లోకమునకే కాకుండా పురుషులకు కూడ ఘాటైన హెచ్చరిక యనవచ్చును. తరువాత 10-7-57 వార పత్రికయందు "ఆడపిలల పెంపకం, తలిదండ్రుల అగచాట్లు" అను వ్యాసమును వ్రాశారు. దానిని చదివినప్పుడు కొన్ని సందేహములు గలిగినవి.

(1) స్త్రీ విద్య :-

"1932 లో, రాజమండ్రి ట్రెయినింగు కాలేజిలో స్త్రీకి విద్య అవసరమా ? కాదా ? అనే విషయమును గూర్చి చర్చించాము. 1938 లో ఏలూరులో ట్రెయినింగు అవుతున్నప్పుడు, శ్రీమతి గంధం (ఇప్పుడు బోడగం) అమ్మన్నరాజాగారిని అధ్యక్ష పీఠముపై కూర్చుండపెట్టి ఈ విషయమును గూర్చి మళ్ళీ చర్చించాము. 1951 లో కొవ్వూరు, సెంటరుక్లాసులో మళ్ళీ ఇదే విషయము చర్చకు వచ్చింది. 1956 సంవత్సరములో కొవ్వూరు, హైస్కూలులో విద్యార్థులు, విద్యార్థినులు చర్చించారు. స్త్రీకి ఎటువంటి విద్య కావాలి అనే ప్రశ్న అటుంచి, స్త్రీకి విద్య అవసరమా ? కాదా? అనే గడ్డు సమస్య ఇప్పటికి తేలకపోవటం చాల విచిత్రంగా ఉంది" అన్నారు కూడాను.

(2) "విద్య యొసగును వినయంబు..."

"విద్య దుర్మదులకు మదం బొసరించును, సజ్జనులైన వారికి మాత్రమే, వినయమును తెచ్చును." అని కూడ ఉన్నది. విద్య లేనంతమాత్రముచేత సజ్జనుడు కావటానికి అభ్యంతర ముండదు.

(3) ఆడపిల్లల చదువులంటె అంతగా పట్టింపులేదు. మగపిల్లల చదువుకోసం ఇంటిల్లపాది అగ్గగ్గలాడిపోతారు."

చాల కాలం క్రితం వరకు పురుషుడు సంపాదిస్తూండేవాడు. ఇంటిపనులు, బిడ్డలను సంరక్షించుకొనుట స్త్రీ చూచుకుంటూ ఉండేది. రోజులు మారాయి. భార్య, భర్త సంపాదిస్తేనేగాని సంసారం నడిచే యెత్తు కనపడటం లేదు. అందుచేత ఇప్పుడు స్త్రీకి విద్య దానంతటదే తప్పనిసరిఅయింది. స్త్రీకి విద్య కావాలో, అక్కరలేదో ఇంకా చర్చిస్తూనే ఉన్నా, ప్రతియింట్లో, పిల్లలు ఆడ మగ విభేదం లేకుండగా బడికి పోతూనే ఉన్నారు. శ్రీమతి పి. జి. సరోజినిగారు వ్రాసినది పూర్వం విషయం. ఇంక, చదువు ఎంతవరకు చెప్పిస్తున్నారు, అంటె, అది వారి వారి ఆర్థికస్తోమతుపైన ఆధారపడి ఉంటుంది.

(4) 'కట్నాలకోసం డబ్బు జాగ్రత్త'

దేశంలో ధనవంతులు తక్కువగా ఉంటారు. బీదవాళ్ళు ఎక్కువగా ఉంటారు. పూర్తిగా బీదవారికి బాధలేదు. బాగా డబ్బున్నవారికీ బాధలేదు. కాని మధ్యతరగతివారికే వచ్చింది ముప్పు. బాగా డబ్బున్నవారు చదువులూ చెప్పిస్తున్నారు, వేలకు వేలు సులభముగా కట్నాలు యిచ్చి గొప్ప సంబంధాలు చేస్తూనూ ఉన్నారు. ఎటొచ్చీ మధ్యతరగతివారిలో చదువూ చెప్పించవలసి వస్తోంది, కట్నాలూ తప్పటం లేదు. కుటుంబమును పోషించటమే కష్టముగా ఉన్న, ఈరోజులలో రెండింటికి డబ్బు ఎక్కడ నుండి తేగలుగుతాడు ? ఎట్లాగూ కట్నము తప్పనప్పుడు, మగపిల్లలకు ఆడపిల్లలకు సమానంగా చదువు చెప్పించాలంటే ఎల్లా కుదురుతుంది ?

(5) "ఆడపిల్ల పెళ్ళికోసమే పుట్టిందన్న ఆలోచన పూర్తిగా మానెయ్యాలి."

ఏ వివేకానందస్వామి వంటివాడో తప్ప పెళ్ళికోసం పుట్టనిదెవరు ?

(6) "బాలికలందరిని చిన్నప్పటినుండి తమకాళ్ళమీద నిలబడేటట్లు చెయ్యాలి."

ఈరోజులలో అమ్మాయిగారు కూడ సంపాదిస్తేనేగాని, అబ్బాయిగారు కుటుంబ భారాన్ని మోయలేకుండా ఉన్నారు. అందుచేత ఏ ట్రెయినింగు అయిన అమ్మాయినో అనగా తనకాళ్ళమీద నిలబడ్డ అమ్మాయినే పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాడు. కనుక ఆడపిల్లకి పెళ్ళి కావాలంటె, చదువుచెప్పించాలి, అనగా అమ్మాయి నెలనెలకు సంపాదించి డబ్బు తేవాలి, మామగారు కట్నము యివ్వాలి.

కనుక, ఇంతకీ, నాకుతోచినది "పెంపకంలో లేదా కాదని. మనమనస్సు మారాలి" అని. పిల్ల పిల్లవాడికి,పిల్లవాడికి పిల్ల నచ్చడం ముఖ్యం.

ఆపైన కట్నం ప్రసక్తిరావటం, తీసుకోవటం దొంగతనం, వ్యభిచారంవంటి దోషముగా పరిగణించే రోజు రావాలి. ఆ విధంగా సంఘం మారేందుకు మనమంతా కృషిచెయ్యాలి. శ్రీమతి పి. జి. సరోజిని గారు వ్యాసము చివర వ్రాసినట్లు కొద్దో గొప్పో వీలైనంతవరకు చిన్న చిన్న సంఘ సంస్కరణ లారంభించాలి. ఊరికే ఉపన్యాసాలిస్తే ఏంలాభం !

సామవేదం శ్రీకృష్ణవేణి,
(కొవ్వూరు.)

* * *

3-7-57 ఆంధ్ర వారపత్రికలో "వనితాలోకం"లో శ్రీమతి పి. జి. సరోజిని గారి "ఆడపిల్లల పెండ్లిండ్లు-తలిదండ్రుల అగచాట్లు" వ్యాసం చాలాబావుంది. త్రికరణ శుద్ధిగా వారివ్యాసంతో ఏకీభవిస్తున్నాను.

వారు చెప్పినట్లు బ్రాహ్మణులలో నే అన్ని తెగలున్నమాట వాస్తవం. అన్ని తెగలే కాదు-యింకా వున్నాయిగూడా. వారిదగ్గరి నుంచే ఈ సంస్కరణ బయలుదేరాలి. తెగలుగా, శాఖలుగా, మరీమరీ ఉపశాఖలుగా (చివరకు షెడ్యూల్డు తెగలుగా) చీలిపోయారు. వీరిలో వీరికి భోజన ప్రతిభోజనములు ఇత్యాదులన్నీ ఉన్నాయిగాని, ఇచ్చి

పుచ్చుకోవటాలుమాత్రం లేవు. ఇది ఎందు కేర్పడినదా అని చిన్నతనంనుంచి ఆలోచించుతూయుంటేవాడిని. ఇప్పటికి చాలామంది సనాతనులు ఈశాఖల కలయికకు ఇంకా విముఖత్వం చూపుతున్నారు. ఈశాఖలు మరీ మరీ చిన్నవయిపోయినందువల్ల పిల్లల వివాహాలకొరకు సంబంధాలు దొరకక యెంతో ఇబ్బంది, బాధ, పడవలసివస్తున్నది. పెండ్లిండ్ల సమస్య చాలవరకు తగ్గిపోవాలంటే వారు చెప్పినట్లు ఈశాఖలన్నీ కలిసిపోవాలి.

కట్నాల జాడ్యం మరో గడ్డు సమస్య. దీనికి విరుగుడు ఆలోచిస్తేగాని, దేశం కొంతైనా బాగుపడదు. ముఖ్యంగా "ఆడ పిల్లల పెండ్లిండ్లు" సమస్యలో క్లిష్టత్వము రూపిమాసిపోదు. అందుకు యువకులు తప్పక ముందుకురావాలి. బియ్యేలవరకూ చదివి, "ఈ ఒక్కవిషయంలో నన్ను వదిలేయండి! మా నాన్న తిడతాడు-ఒప్పుకోడు" అని నాలుగో క్లాసు చదువుకుంటూ అన్నివిధాల అస్వతంత్రుడైన "ఎలిమెంటరీ స్కూలు" బుజ్జిపిల్లవాడులా ఫుసుక్కున అనటం ఎంత తెలివి తక్కువతనమో, యువలోకం గ్రహించాలి! ఈవాడు తన పెండ్లివిషయంలో భీష్మించి కూర్చున్నవాడు రేపు తనకు 4 గురు లేక 5 గురు ఆడపిల్లలు పుట్టినతరువాయి తనగతేమిటో ఆలోచించుకోడు.

"తెలతెలవి కోయకు.. ధర్మం తనదాకా వస్తేగాని తెలియదు" అని అంటారేమో! "ఇంటగెలిచి రచ్చగెలవాలి!" ఎవరో ఎందుకు! ఈ సమస్యలో నేనే ముందుకొస్తున్నాను. మరియిద్దరు నాస్నేహితులు కూడ ఇందుకు సిద్ధమైయున్నారు. తెలుగువారము-బ్రాహ్మణులము-ఆరువేల నియోగివారము-గుంటూరు జిల్లా బాపట్లవాస్తవ్యులము. శాఖాభేదము పాటించక, కట్నం కానుకలతో నిమిత్తం లేక, అందమైనపిల్ల లభిస్తే చేసుకొందుకు నేను సిద్ధంగాయున్నాను.

గంగవరపు శ్రీ కృష్ణమూర్తి.
(బాపట్ల).

* * *

కనబడని ఖర్చు

ఈరోజుల్లో యెంతెంతజీతాలు వస్తున్నా చివరివారంలో పొడుదుడుకులు యెలాగో తప్పవు. ప్రతినెలా కనీసం అయిదురూపాయలయినా మిగల్చలేం. ఇందుకు కారణం మనకి తెలియకుండా చేసే కనబడని ఖర్చులు కొంతవరకు మనం జాగ్రత్తపడగలిగితే ఆదాయం చేయలేకపోయినా వేరొక వస్తువు కొనుక్కునేందుకు ఇబ్బంది పడనక్కరలేదు.

ప్రతినెలా నెలకంతా సరిపడే వెచ్చాలు తెస్తూవుంటాం. నెలకి ఒకసారే కొనితెచ్చుకోటంసుఖమే. కాని మనంతెచ్చుకొన్న వస్తువులజాబితా మనదగ్గరగూడ వొకటి వుండటం చాల అవసరం. ఆవిధంగా వుండటంవల్ల దుకాణదారు యిచ్చిన బిల్లు, మన జాబితా సరిచూచుకొని డబ్బిచ్చెయ్యొచ్చు. మనదగ్గర కనుక లిస్టేలేకపోతే వాడు మనం తెచ్చిన దానికంటె ఎంత ఎక్కువేస్తున్నాడో యేం తెలుసు.

మనవాళ్లు యింకో రకంగా గూడ చేస్తూ వుంటారు. బజారు కనుక కొస్త దగ్గరయితే నెలకి సరిపడేవి తెచ్చుకోరు. ఏరోజు కారోజు వస్తువులకోసం బజారు పరుగెడుతూ వుంటారు. పోనీ అలా తెచ్చినప్పుడు యెప్పటికప్పుడు డబ్బిచ్చితెస్తే ఫర్వాలేదు. కాని ఈ రకంగా నెలరోజులూ వెచ్చాలు తెస్తూ నెలకి ఒక్కసారి డబ్బిస్తే మనకయ్యే నష్టం యింతా అంతా కాదు. ఏరోజు యెంతెంత తీసికొచ్చామో జ్ఞాపకంవుండటం అసంభవం. దుకాణదారు సగానికి సగం యెక్కువేసి బిల్లు మనచేతికిస్తాడు.

కూరల విషయంలోగూడ అంతే. ఈరోజు వున్నధర రేపటికుండదు. కూరలు ఒక్కసారి తెచ్చుకునేందుకు వీలులేదు. కనుక యెప్పటికప్పుడే డబ్బిచ్చి తెచ్చుకోవాలి.


ఒక్కకూరలూ, వెచ్చాలే కాదు. ఏ వస్తువైనా సరే అరువు బేరం మానేయటం మంచిది. అరువుబేరాలవల్ల మనం చాలా నష్టపోతున్నాం. డబ్బు చాలటంలేదని తిండి క్రింద యెక్కడలేని ఖర్చు అవుతోందని బాధపడతాం. మన ఖర్చులు పెరగడానికి ముఖ్యకారణం — నిజానికి మూలకారణం సరకులు అరువు తెచ్చుకోవడమేనని తేలుతుంది. ★

కమలారావు, సిమ్లా.

గృహవైద్యం

(38-వ పేజీ తరువాయి)

దార, బెల్లం మొదలైనవాటికన్నా ఎన్నోరెట్లు మాధుర్యముంటుంటే గాక పంచదార బెల్లం అధికంగా వుపయోగించుటచే కలిగే అనారోగ్యాలు తప్పతాయి. వాటివల్ల పాడైపోయిన మన శరీరావయవాలు, తేనె నిత్యం వాడుటవల్ల ఆయా దుష్ఫలితాలను పూర్తిగా పోగొట్టుకొంటాయి; ఆరోగ్యముగా ఉంటాము. అన్నవాహికను దాని ననుసరించి ఉన్న ముఖ్యగ్రంథులను, శరీరమందలి ముఖ్య భాగములను కార్జము, గుండె వాటియందలి దుష్టమును తొలగించి మంచి పుష్టి, బలం కల్గించును. శరీరమందలి అన్ని అంగములకు మంచి పుష్టి, శక్తి కల్గించును. తేనె అన్నవాహికయందలి అవయవముల అవసరం లేకయే జీర్ణకోశము ప్రవేశించిన తక్షణమే రక్తంలో కలిసి శరీరమంతా వ్యాపించిపోతుంది— ఎందువల్ల ననగా తేనెటీగల నోటియందు, తేనెసంచియందు అది పక్వమై, పక్వాహారముగా జీర్ణమవుతుంది. మళ్ళీ అన్నవాహికలో జీర్ణం కావలసిన పనిలేదు—అందు చేతనే తేనెతో అనుపానంగా ఇవ్వబడ్డ మందు లన్నీ త్వరితంగా రక్తంలో కలియుచున్నవి. (అన్ని మందులూ తేనెలో మిశ్రమం అవుతవి) దీన్ని శిశువుల పాలల్లో కలిపి పట్టితే చాలా పుష్టికరమైన ఆహారంగా వుంటుంది. అజీర్ణములు, కడుపుబ్బరం రానీయదు. (సశేషం)



కాకి - చిలుక

రంగుపొంగు రామచిలుక
భంగు మనుచు ఆడుకొనుచు
చెట్టుమీద కాకియుండ
చూచి నవ్వె ఫక్కుమనుచు.

"ఏల నవ్వినావు నీవు ?
రతనాలా రామచిలుక !
చెప్పు మేమి కారణ"మని
అడిగె కాకి స్నేహమొలుక.

"నిన్ను చూచె నవ్వినాను,
నీరూపూ ఎంత నలుపు !
నిన్ను చూడ అందరికీ
మనసులోన వింతగొలుపు"

చిలుకపలుకు వినినవ్వెను
కాకేమియు బాధపడక,
చిలుకచూచె, నవ్వులోన
అర్థమేమొ బోధపడక.

"ఎవరి ఖర్మ కెవరు కర్త ?
చెప్పలేము చిలుకమ్మా !
పోయివత్తు వేళయినది
హాయిగాను కులుకమ్మా !"

కావుమనుచు కాకిపోవ,
చిలుక ఎగిరె తళుకుజార,
తన్ను చూచి గర్వపడుచు,
సంతసమున కులుకుమీర.

కొన్ని నాళ్లు గడిచిపోయె ;
పంజరమున చిలుకపడియె ,
వార్తవినుచు కాకిపోయి
జాలిపడుచు ఇట్టులనియె.

"అందమున్న, చందమున్న,
ఇట్టులాయె నీదు ఖర్మ,
రూపులేని నాకు స్వేచ్ఛ,
మేలుమేలు కాకిజన్మ !"

"సుకుమార్"

తగిన శాస్తి

పూర్వం రత్నగిరిలో శేషాచలం అనే వైశ్య ప్రముఖుడుండేవాడు. అతను వ్యాపారంలో దిట్ట. తన కుశాగ్రబుద్ధివల్ల ఏటేటా విశేష లాభాలు పుంజుకొని, సాటి వారిలో మేటి అనిపించుకొన్నాడు! వ్యాపారం దినదిన ప్రవర్థమానం అయినతరువాత కొన్నాళ్లకు రత్నగిరిలో శేషాచలం చక్కటి మేడ కట్టించాడు. చాలా ధనం వెనకేశాడు! ఆ తరువాత, కులమింటి పిల్లనుచూసి పెళ్లి చేసుకున్నాడు.

మరికొన్నాళ్లకు శేషాచలానికి ఇరువురు కుమారులు కలిగారు. ఇక తన ఆస్తి బంధువుల పాలుగాదు! తన కన్నబిడ్డలే అనుభవిస్తారు అని శేషాచలం ఎంతో పొంగిపోయాడు. కుమ్మారులిద్దరూ పెద్దవారయ్యారు, వ్యాపారంలో అతనికి సాయపడుతున్నారు. ఈమధ్యకాలంలో శేషాచలంభార్య చనిపోయింది అనుకోకుండా, కలిగిన భార్యా వియోగానికి, అతను కొన్నాళ్లు బాధపడ్డాడు. ఆతరువాత మరచిపోయాడు. యథాప్రకారం వ్యాపారంలో మునిగిపోయాడు.

శింగంపల్లి అప్పారావు

శేషాచలం, ఎన్నాళ్లు పడుచుదనంగా వుంటాడు? కొన్నాళ్లకు వృద్ధాప్యం అతనిపైబడింది! ఏమొ ఎవరు చూడొచ్చారు...తన ప్రాణం 'హరీ'మంటుందేమొనని, ఐశ్వర్యం గల సంబంధాలుచూసి కొడుకులిద్దరికీ వివాహాలు చేశాడు ఇక అతని భారం వదిలిపోయినట్టే!.

ఒకనాడు కొడుకులిద్దర్నీ చెంతచేరబిలిచి, "ఒరే అబ్బాయిలూ! వార్థక్యం నన్ను దినదినం క్రుంగదీస్తోంది. ఇక నేను పనీపాటా చేయలేను. విశ్రాంతి తీసుకుంటాను. వ్యాపారమంతా మీరు జాగ్రత్తగా చూసుకోండి!"అని వ్యాపారమంతా ఇద్దరికీ వప్పజెప్పాడు.

'స్వేచ్ఛాజీవులమైనాముకదా!' అని కొడుకులు పొంగిపొయ్యారు. ఆనాడే శేషాచలం శయ్యనలంకరించాడు!

కొన్నాళ్లపాటు కొడుకులూ, కోడళ్లూ కాలు క్రింద పెట్టనీయకుండా శీతలోపచారాలు, మజ్జన భోజనాదులు అమర్చి, కంటికి రెప్పలా శేషాచలాన్ని చూశారు! .. పావం శేషాచలం మంచం దిగలేనిస్థితికి దిగజారిపోయాడు. అతన్ని

తగిన శాస్తి

అదేమి రోగమో, పట్టుకొనిపీడిస్తూ అస్థిపంజరంలా తయారుచేసింది.

నానాటికీ ఇంటిలో శేషాచలానికి ఆదరణ తగ్గిపోయింది! రాత్రింబవళ్లు, జబ్బుతో బాధపడుతూ, అతను విశ్రాంతి అనేది ఎరుగకుండా, ఇంటిలోనివారికి విశ్రాంతి లేకుండా చేస్తున్నాడు! అందరూ విసుక్కునేవారే!

"ఒరేయ్ తమ్ముడూ! నాన్నతో మహా బాధగా వుందిరా! ఏదో ఇంత ఎంగిలిపడి నోరు మూసుకొని పడుండడు! వ్యాపారం ఎలా వుంది? ...వాడెంత బాకీ...అది అలా చేయకూడదు...ఇది ఇల్లా చేయాలి! అని ప్రాణాలు కొరికేస్తున్నాడు! ఛ...ఛ...వెధవ గోల! విసుగు పుట్టిస్తున్నాడు!" అని అన్నదమ్ములు కబుర్లాడుకొనేవారు.

కోడళ్ళు మట్టుకు తక్కువ తిన్నారుగనకా! "ఈ మాయదారి ముసలిపీనుగ, చావనన్నా చావడు! నిత్యం ఏమిటీ గరుడసేవ!" అనుకొనేవారు.

చివరకు శేషాచలం ఆ ఇంటి మనిషి అన్నట్టుగా కూడా ప్రవర్తించేవారుకా రెవరూ!

ఎలాగూ వేళ కింత ముద్ద పడేస్తున్నాంకదా! అనే వుద్దేశంతో కొడుకులు అసలు తండ్రివద్దకు వెళ్లేవారే కాదు. అతను పిలిచినా వినిపించనట్టు వెళ్లిపోయేవారు.

"కన్నకొడుకులే నిరాదరణ చేసినపుడు; పరాయికోడళ్లు తన కన్నీళ్లు తుడిచి కరుణ చూపిస్తారా!" అనుకొని కుమిలి, కుమిలి యేడ్చేవాడు, ముసలి శేషాచలం.

అంతటి ఆస్తి ఆర్జించి, కుమారులకు ధారబోసిన శేషాచలానికి ఇంటిలో, కుక్కకున్నపాటి ఆదరణ కూడ లభించలేదు.

వెంకటాద్రి శేషాచలం చిన్ననాటి స్నేహితుడు. వ్యాపారంలో సహచరుడు. అతడొకనాడు ఏదో పనివుండి, శేషాచలంవద్దకొచ్చాడు! వచ్చి చూస్తే ఏముంది. శేషాచలం పట్టె ఎముకలపోగులా వున్నాడు; గుడ్లు మూసి కంపు గొడుతున్నాయి; నీరసంగా, నిర్జీవప్రతిమలా మంచంలో పడివున్నాడు.

వెంకటాద్రిని చూసి వలవలా చంటికుర్రాడిలా ఏడ్చాడు శేషాచలం! సంగతి యావత్తూ క్షణంలో ఆకళింపు చేసుకున్నాడు వెంకటాద్రి. స్నేహితులిద్దరూ కొంతసేపు పిచ్చాపాటీ మాట్లాడుకున్నారు. చిన్ననాటి ముచ్చట్లు చెప్పుకొని, చెప్పరాని ఆనందాన్ని అనుభవించారు! ఆతరువాత వెంకటాద్రి వెళ్లిపోయాడు.

మర్నాడు శేషాచలం పెద్దబ్బాయి బజారునుంచి భోజనానికి ఇంటికి వచ్చాడు.

"ఒరే పెద్దోడా! ఒక్కమాట! ఇలారా!" అని పిలిచాడు, శేషాచలం. శేషాచలం పిలిస్తే ఆ ఇంట్లో ఎవరికీ వినిపించనే వినిపించదు! అందువల్ల వాడు మాట్లాడలేదు!

శేషాచలానికి ఆయాసంగా వున్నా, శక్తిని కూడదీసుకొని, "బాబూ! ఒక్కమాట వినిపోరా! ఆ సంగతే నీకు చెప్పడం మర్చిపోయాను! ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది!" అన్నాడు.

శేషాచలం అలా అనగానే, 'ఆ సంగతి' అంటే, అందులో ఏమి విశేషముందో, వింటే వచ్చిన నష్టమేముందని తండ్రిగదిలోనికి వచ్చాడా సుపుత్రుడు.

"ఊ...ఏమిటో చెప్పు! త్వరగా పోవాలి!" అని విసుక్కున్నాడు.

"ఏంలేదు బాబూ! నిన్న వెంకటాద్రి వచ్చాడు! నా మతిమండ! అతను చెప్పేవరకు నాకు జ్ఞాపకమే లేదు! అతను మనకు యాభై వేల రూపాయలివ్వాలి. ఏమీ అనుకోవద్దని, త్వరలోనే ముట్టజెబుతానని క్షమాపణ చెప్పుకున్నాడు! కనుక అతన్ని రోజూ తొందరచేస్తూండు! ...అంతేబాబూ!" అన్నాడు శేషాచలం.

పెద్దవాడు అంతా శ్రద్ధగా ఆలకించి, మెల్లగా భార్యవద్దకెళ్లి "ఇదిగో! నిన్నే వింటున్నావా? ఇకనుంచి మా నాన్నకు ఏ లోపమూ రాకుండా సకలోపచారాలూ చేయండి. తెలిసిందా!" అన్నాడు.

సంగతేమిటన్నట్టు ముఖం చిట్లించి చూసిందావిడ!

"అతనివద్ద చిల్లిగవ్వ లేదనుకున్నాము. యాభైవేల రూపాయల ఆస్తి వుంది. నిన్నటివరకూ సంగతే గుర్తులేదు. వెంకటాద్రి వచ్చి గుర్తు చేశాడు. మంచిదే అయింది! ఇక మీరు అతని విషయంలో అశ్రద్ధ చేశారా! ఆ ఆస్తి కాస్తా పరుల పాలైపోతుంది! జాగ్రత!" అని హెచ్చరించాడు.

ఓహ్! మర్నాటికి శేషాచలం అదృష్టం మారింది! వేళతప్పకుండా మందులు, భోజనం, స్నానపానాదులు వగయిరా వైభవంగా జరగడం ప్రారంభించాయి!

ఒకనాడు పెద్దవాడు వెంకటాద్రిని డబ్బువిషయమై కదలేశాడు!

"చూడబ్బాయీ! నేను ఇవ్వాల్సినమాట యథార్థమే! అందుచేతనే స్వయంగావచ్చి మీ నాన్నగారివద్ద క్షమాపణ చెప్పుకున్నాను. మీ డబ్బుకేమీ భయంలేదు. అణాపైసలతో తెచ్చి మీ నాన్నకు ముట్టజెపుతాను," అన్నాడు వెంకటాద్రి.

వెంకటాద్రిలాంటి పెద్ద వ్యాపారస్థునివద్దవున్న ధనం ఎక్కడికి పోతుందిలెమ్మని ధీమా పడ్డాడు పెద్దవాడు!

కొన్నాళ్లు గడిచిన తరువాత, వెంకటాద్రి యాభైసంచులు తీసుకువచ్చి, శేషాచలానికిచ్చాడు. శేషాచలం వాటిని తీసుకొని, ఇనపబీరువాలో పెట్టి, తాళంవేసి, తాళాన్ని బొడ్డులో దోపుకున్నాడు.

వెంకటాద్రి డబ్బు యివ్వడం కొడుకులూ, కోడళ్లు, కళ్ళు ఇంతింత చేసుకు మరీ చూశారు! అప్పటినుంచే శేషాచలాన్ని ఇంకా ఘనంగా చూశారు. చివరి దినాలు హాయిగా బ్రతికి ఆఖరికి ముసలి శేషాచలం కన్నుమూశాడు.

తండ్రి అంత్యక్రియలకు డబ్బు విరివిగా ఖర్చుచేసి, అందరి మెప్పూ సంపాదించారు.

ఆ తరువాత తీరుబడిగా తాళాలు తీసుకొని, బీరువాతలుపులు తెరిచి సంచులు విప్పి చూశారు! ఏమున్నాయ్...! కుండపెంకులు!! అన్నీ గుండ్రంగా చితగ్గొట్టిన కుండపెంకులే!! పెద్దవాడిగుండె ఆగినంత పనైంది. అలాగే కోపంగా నిప్పులు గ్రక్కుతూ వెంకటాద్రి యింటికి వెళ్లి ధూం...ధాం...మంటూ ఒంటి

తగిన శాస్తి

కాలిమీద లేచాడు!

"ఓరే అబ్బీ! నువ్విలా చిరాకు పడకు! నీవు నాకు డబ్బిచ్చినట్టు ఎక్కడా దాఖలా లేదు! పోతే మీ నాన్నగారు నాకిచ్చినట్టు కూడ పత్రాలు లేవు! కన్నతండ్రిని సరిగా ఆదరించని, నీలాంటి అత్యాశపరులకు ఇలాగే జరగాలి! ఇది మీ నాన్నకు నేను చెప్పిన ఉపాయం!.. అంతేకాని నేను ఏమీ బాకీ లేదు... నీ తండ్రిని నీవు నిరాదరణ చేశావు. నిన్ను నీ కుమారులు ఇంకెంత నిరాదరణచేస్తారో ఆలోచించుకో! వెళ్లు!...వెళ్లు! బుద్ధికలిగి వుండు!" అంటూ చీవాట్లుపెట్టి పంపించాడు! "నిజమేనేమో!...నన్ను నా కొడుకులుగూడ అలాగే చేస్తారా!" అనుకుంటూ దిగాలుపడి, ఇంటికి తిరిగి వచ్చాడు పెద్దవాడు! ★

జీవితాదర్శం

(10-వ పేజీ తరువాయి)

కాని ఆమాటతోనే సాధ్యేయం పూర్తి కాదు. మానవసమత నెలకొనాలి. కులం, మతం, అధిక ధనత్వం, బీదరికం, హెచ్చు తగ్గులు లేని సమాజం కావాలి ప్రపంచానికి. ఆ సమాజ నిర్మాణానికి మనమంతా కృషి చేయాల్సిన రోజు లాసన్నమైనయ్.

రం: అయ్యా తెలియకడుగుతాను. మీరే పార్టీ క్రింద వస్తారండి?

సమ: ఏపార్టి క్రిందా రాను.

ప్ర: మీకేపార్టీ లేదండి?

సమ: ఎన్నడూ ఏపార్టీకి దాసుణ్ని కాను. స్వరాజ్యం రాకముందు నిష్కల్మషహృదయంతో అందరూ దేశవిముక్తికి కృషి చేశారు. ఇప్పుడూ ఆదేశక్షేమంకోసమే ప్రతివాడు కృషిచేయాలి. పార్టీలుకాదు మనకు కావల్సింది ప్రజలు బాగుపడటం. పార్టీలతో దేశక్షేమాన్ని సాధించటం కష్టం.

ప్ర: మీ దృష్టిలో ఇప్పుడు దేశంలో క్షేమం లేదనేనా మీరనటం?

సమ: అనే అంటాను. మానవునికి కావలసినకనీసపు అవసరాలు ఇంకా తీరటం లేదు. కూడు, గుడ్డ, ప్రణయం, నివాసం, విద్యా, ముందు కావాలి. వీటి తరువాతనే ఏ అభివృద్ధయినా కోరుకోవాలి.

గుర: మీరేదైనా పంచాయితీబోర్డుకు నిలబడుతున్నారా బాబూ?

సమ: లేదు. ఏం అలా అడిగారు?

గుర: అహఁ. మా ఊళ్లో ఒకాయన ప్రెసిడెంటుకు నిలబడుతూ అచ్చం ఇట్లాగే మాట్లాడినాడు.

సమ: అందరూ ఒకలాగే ఉండరు. ఒక మనిషిలోవున్న చెడ్డను గుర్తించటంకన్నా, కాస్తయినా అతనిలో మంచిని తెలుసుకోవటంగూర్చి నేర్చుకోవాలి.

ప్ర: చూడండి సమతారావుగారూ! ఏ పార్టీ లేకుండా మీ ఉద్దేశ్యాలెలా ఆచరణలోకివస్తాయంటారు. పార్టీ అంటే కూడా ప్రజలేకదండీ?

సమ: ఉద్దేశ్యాలాచరణలోకి రావాలంటే వాటికోసం పనిచేసే ప్రజలు కావాలి. నిజమే. కాని హృదయపూర్తిగా ఒక విషయాన్ని అవగాహనంచేసుకొని పనిచేసేవాళ్లు ఏకొద్దిమంది ఉన్నా చాలు. నా ఉద్దేశ్యాలు ఆచరణలోకి వస్తయ్. పార్టీలు పదవులు కాదు నేను కోరేది, అది నా పనికాదు. వాటినే కోరితే నెనీ దీనావస్థలోఉండాల్సిన వాణ్ణికాదు. వస్తుంది. ఒకరోజు వస్తుంది ఆ రోజు నాకృషి ఫలిస్తుంది. మానవసమానత్వం విలసిల్లే సమాజం ఉద్భవిస్తుంది. ఆ చక్కని స్వర్గంకోసం నా జీవితం ధారపోస్తాను. నా ఆదర్శం తప్పక ఫలిస్తుంది. ఆరోజు మీరంతా...

భి: బాబూ ఒక్క బీడీముక్కదయ చేద్దురూ?

సమ: నేను బీడీలు కాల్చను. ఆరోజున మీరంతా...

భి: ఏమిటో ఇవ్వాళ ఎవర్నడిగినా లేదంటున్నారు. ఒక్క బీడీ దొరక్కపోయింది.

రం: త్రాగటానికి గంజిలేదు కాని, మీసాలకు సంపెంగనూనె కావాలని ఊరికే చెప్పలా పెద్దలు.

భి: వాళ్ల మీసాలకున్న శౌర్యం అటువంటిది కామాల్సు బాబూ.

గు: వాళ్ళకు కాదురా. నీమీసాలకు.

భి: నాకింకా మీసాలు పెరగలేదు బాబూ.

సమ: పెరిగితే కావాలంటావు మీసాలకు సంపంగినూనె.

రం: అనేగదండీ దాని అర్థం.

భి: నాకేం తెలుసు బాబు. ఎవరి అలవాట్లు వాళ్లయి. నేను బీడీ అడగకుండా ఉండలేను, మీరు చివాట్లు పెట్టకుండా ఊరుకోనూ లేరు.

పచ్చి: ఒక్కబీడి కోసం ఏమిటయ్యా నీవాదం. నీతోమాకు తెగేటట్లు లేదే...జీవితంలో ఏది అవసరమో, ఏది అనవసరమో అన్న తారతమ్యం లేకుండా ప్రతి చిన్న వస్తువుకూడా మనిషి దాసుడై పోతున్నాడు.

సమ: ప్రతివస్తువులో సుఖాన్ని అనుభవించటం మానవుడు నేర్చుకున్నాడు కాబట్టి అసలీ వస్తువులు...

ప్ర: అరేయ్ గోపీ!

గోపి: ఎక్కడికిరా వెళ్తున్నావు?

ప్ర: నీ వెక్కడికి?

గో: హైద్రాబాద్!

ప్ర: నేనూ అక్కడికే. ఉద్యోగంకోసం ఇంటర్వ్యూకి వెళ్తున్నా. రా ఇల్లాకూర్చో. ఏం పనిమీద వెళ్తున్నట్టు?

గో: నాజీవిత లక్ష్యాన్ని చేరుకోటానికి?

ప్ర: ఏమిటది?

గో: విమల దగ్గరకు వెళ్తున్నాను.

ప్ర: ఎందుకు?

గో: నా నిర్ణయాన్ని ఆమెతో ముఖాముఖి చెప్పుదామని వెళ్తున్నాను.

ప్ర: ఇంకా ఆ పిచ్చివదల్లా.

గో: ఏమిటీ 'పిచ్చా!', నీకు నోరట్లా వచ్చిందిరా ఆ మాటనటానికి. ఒక అభాగ్యరాలి స్వచ్ఛమైన ప్రేమను 'పిచ్చి'గానా నీవు పిలవటం. విమల హృదయమేమిటో నీకింకా తెలియదు...

ప్ర: ఏడిశావ్.

గో: ఎగతాళి కాదు ప్రసాద్ నా హృదయం ఆవిడ కెప్పుడో అంకితం చేశాను, ఆమెను మనసారా ప్రేమించాను. పర్యవసానం ఏమయినా కాని విమలనానుండి వేరు కాకూడదు. ఏ జన్మలోనైనా నాకోసం విమల, విమలకోసం నేను పుట్టక తప్పదు. నాకోసమై...

ప్ర: విశాఖపట్నంలో ఒక పిచ్చి హాస్పిటల్ ఉన్నట్టు విన్నాను.

గో: ఉంటే.

ప్ర: దాంట్లో ప్రేమ పిచ్చికి కూడా చికిత్సలభిస్తుందా అని ఆలోచిస్తున్నాను.

[అందరూ నవ్వారు, సన్నగా]

గో: వేళాకోళానికి కూడా సమయాలుంటయ్.

ప్ర: ఇది వేళాకోళానికికూడా చెందదు. వేళాకోళంలో కాస్త ఆలోచనైనా ఉంటుంది. నీవు మాట్లాడేదాంట్లో ఆలోచనా లేదు. నీతినియమాలు లేని స్త్రీతో నీకు ప్రేమేమిటిరా? నాగరికతకు ఈ ప్రేమ ఓ లక్షణ మనుకుంటున్నావేమిటి?

గో: మీరంతా విమల నెందుకర్థం చేసుకోరో నాకు తెలియదు. అని నీతో ఇప్పుడు వాదించటం నా పనికాదు. నా విమలే

మంచిదని పందెమూ వేయను. ఆవిడకూ హృదయం వుంది. ఆవిడలోనూ పవిత్రత వుంది, ఆరాధన వుంది.

ప్ర: అయితే?

గో: వివాహం చేసుకోదలచాను.

ప్ర: (మౌనం)

గో: నీవేగాదు. ప్రపంచమంతా వ్యతిరేకించింది వివాహానికి. అయినా చేసుకుంటాను. వీళ్లందర్నీ చూచి ఆమెను ప్రేమించలేదు మొదట. వీళ్లందర్నీ చూచి ఇవ్వాళ ఆమెను వదులుకోలేను కూడా.

ప్ర: నీకు పూర్తిగా మతిపోయిందని ఇక నుండి నేను అనుకోక తప్పదు.

గో: మీ రేమన్నా సరే, నా ప్రేమతో నన్ను బ్రతకనీయండి. నీకు ఉద్యోగం కావాలి. మరొకరికి డబ్బు కావాలి. కొందరు ఊళ్లేలటం కావాలి. చాలామందికి విశ్వశ్రేయస్సు కావాలి. అవన్నీ మీ కవసరం లేదంటే మీరెంత కష్టపడతారు? నేనూ అంతే. నేను మీకు నీచంగా కన్పించవచ్చు. అది మీ ఉద్దేశ్యం. నా ఉద్దేశ్యాలు నాకు బాగానే ఉన్నయ్. నా ఉద్దేశ్యాలతో నన్నెందుకు బ్రతకనీయరు?

ప్ర: కథలోని రసవత్తరమైన ఒక పేరాగ్రాఫు కాదు జీవితం.

గో: ఇది కథ గాదు. వాస్తవం. నా జీవితం, నా జీవితానికున్న ఏకైక ఆశను నెరవేర్చు కుంటున్నాను. మీ రేమనుకున్నా సరే.

సచ్చి: (లోగొంతుకతో) స్త్రీ ఎంతకైన తగును. ఆదిశక్తి. నీచాతి నీచమైన స్త్రీ వలపు ఇతని జీవితాశయమా! ఎంతమాట వినవలసి వచ్చింది. ఇతని జన్మానికి ఇక రాహిత్యమెప్పుడు? అంధకారం కన్నా వలపు చీకటిగా ఉంటుందని మా గురుదేవులు చెప్పింది అక్షరాలా సత్యం.

రం: (సన్నగా) లోక మిట్లా మారిపోయిందిరా మరి.

సమ: (చిన్నగా) ఈ ప్రేమదాహమే మానవకళ్యాణానికి ఉపయోగిస్తే ఏ దేశమయినా సుఖపడక పోదు.

భి: బాబూ ఒక్క బీడీ ఇవ్వండి బాబూ!

గో: విమల కాల్చవద్దన్నప్పటినుంచి పొగ త్రాగటం మాని వేశాను. ఇంకెవరిదగ్గరికన్నా వెళ్ళు.

[పిన్నులమ్ముకు నేవాడు ప్రవేశం]

పిన్ను: పిన్నులు, గుండీలు, దువ్వెనలు, సబ్బులు తెల్లు, డజను గుండీలయినా, డజను పిన్నులయినా, ఒక్కణా మాత్రమే. సబ్బు తెద్దూ, పన్ను పట్టుకునే పుల్లా కలిపి ఒక్కణా మాత్రమే. పనితనం చూచుకోనండి. సబ్బికడ్డీ మజూరీ గిట్టదణాకు. ఎవరికొ్కవాలండీ! డజను గుండీలయినా, డజను పిన్నులయినా ఒక్కణా. ఒక్కణా మాత్రమే.

గు: కానీకి మూడు పిన్ను లనరాదూ.

పిన్ను: మీ కెన్ని కావాలి?

గు: నా కవసరం లేదనుకో. మాట వరసకడుగుతా.

పిన్ను: రూపాయికి అణాలెన్ని బాబూ? ...చెప్పండి తెలిసినవారు.

రం: గిల్లి ఊరుకుంటారేం గురవయ్యగారూ. కావాలంటే రూపాయికి 15 కొత్త అణాలిస్తానని కఫీమని చెప్పరాదూ?

[అందరూ నన్నగా నవ్వారు]

పిన్ను: చెప్పరేమండి నే నడిగినదానికి?

గు: ఆఁ...పదహారూ.

పిన్ను: రూపాయికి కానులండి.

గు: గవర్నమెంటువారి లెక్కన అరవై నాలుగు.

పిన్ను: 16 అణాలయితే ఒక రూపాయి అవుతుంది. మీరు చెప్పినట్టు ఒక రూపాయి కావాలంటే 64 కానులు ఏరుకోవాలి. రోజుకు కనీసం నా బత్తానికి ఒక రూపాయయినా కావాలి. ఎన్ని కాను లేరుకుంటే ఒక రూపాయయ్యేటట్లు చెప్పండి?

సమ: ప్రస్తుతం సమాజం అటువంటిది. ఈ సమాజంలో ప్రతివాడు ఆశాజీవి. వాస్తవానికి నీకు కానీ బేరాలయినా, అణాల్లో వ్యాపారం సాగాలనీ, నాలుగణాలు మిగిల్తే సుఖంగా బ్రతకాలనుకోవటం నీ తప్పు కాదు. కేవలం ఆలోచనలతో జీవించటం ప్రతివాడికీ ఈ రోజుల్లో పరిపాటయి పోయింది.

అంతేబాబు. మాజీవితాలే అంత. రోజు గడిస్తేచాలని యోచించినా, ఏడుపు లేకుండా ఏపూటా అంతంకాదు. ఏపూట బత్తానికి కావాల్సిన డబ్బు ఆపూట దొరికితే! మాకదే పదేలు. ఇంతకన్నా ఎన్ని పెద్దపెద్దాశలున్నా పొట్టుపడేదిమాత్రం పూటకోసమే బాబు. ఎప్పుడైనా, ఏక్షణంలోనైనా మేంకోరేది తిండిమాత్రమే. అదే మాఆశ.

భి: బాబూ! ఓపిన్నులమ్ముకునే బాబూ! ఒక బీడిముక్క ఉంటే ఇవ్వుబాబూ!

పిన్ను: బీడీ లేదు, గీడీ లేదు తప్పుకో. ఏం దోవకడ్డంగా కూర్చున్నావు? ఎవరికొ్కవాలండీ పిన్నులూ, గుండీలూ......

సచ్చి: ప్చ్! చిన్నచిన్న విషయాలుకూడా జీవితానికి ఆదర్శప్రాయాలై పోతున్నయ్. ఒక్కపూట తిండేనట ఆయన ఆశ! ప్చ్!

రం: లోకోభిన్నరుచిః.

సచ్చి: కాదు. తృష్ణో భిన్నరుచిః. ఆ తృష్ణనే నాశనం చేసుకోవాలి. జీవితాదర్శం జన్మరాహిత్యమై ఉండాలి. అదే మోక్షానికి మార్గం.

సమ: కాదు. ఆశలుండాలి. అనంతమైన ఆశలు వాస్తవంలో సౌఖ్యాలుగా మారాలి. ఆశలు సౌఖ్యాలుగా మారకపోవడం ఆలోచించేవాళ్ల తప్పుగాదు. సౌఖ్యాలు కొంతమంది అనుభవించి కొందరికి నోరూరించటం తప్పు. అందరూ సుఖపడాలంటే హెచ్చు తగ్గులులేని సమాజం ఏర్పడాలి. దానికోసం ప్రయత్నించేవాళ్ళ జీవితాలే ఆదర్శజీవితాలు.

గు: మీరెన్నయినా చెప్పండి. డబ్బు లేనిదే ఏఆశా కొనసాగదనుకోండి.

రం: ఏనాటికయినా 'నాది' అనే భూమి ఎక్కడయినా ఉంటేనే జీవితం.

గో: ప్రపంచంలో సుఖం, శాంతి, హాయి సంతృప్తినిచ్చేది ఒక్క ప్రేమ మాత్రమే. ప్రేమించలేనివాడు పుట్టడం దండగ. కాదంటావా ప్రసాద్!

ప్ర: నాకవేం పట్టలేదురా. ఏదైనా ఉద్యోగం లభిస్తేచాలు. నా జీవితం గుట్టు చప్పుడు లేకుండా కొనసాగిపోతుంది. ఇంతకన్నా నాకింకేమీ అవసరంలేదు.

పిన్ని: ఏమిటో బాబు పెద్దపెద్ద ఆశల్నసుకుంటున్నారు. ఏ పూట కాపూట దిగులు లేకుండా గడిస్తే నాకంతే చాలు.

సచ్చి: అంతే! పూటగడిస్తేనే స్వర్గమా!

రం: ఎంత చెట్టుకంత గాలి.

ప్ర: అరె! ఏమిటిరా అలా వణికి పోతున్నావు?

భి: నా శరీరమంతే బాబు. బీడీల కలవాటుపడిపోయింది ఎధవశరీరం. ఒక్క బీడీ ఉంటే ఇచ్చి పుణ్యంకట్టుకోండి బాబు. ఎంగిలి బీడీలు నాకు పడవు బాబు. ఒక్క మంచి బీడీ ఉంటే దయచేద్దురూ. బ్రతకటమే నాకున్న ఆశ. ఎట్లాగయినా బ్రతకాలి. బీడిముక్కచాలు బ్రతికిపోతా. జీవించటమే నా జీవితాశయం. ఇప్పుడో 'బీడీ' నా ఆశ.

సచ్చి: బీడి నీ జీవితాశయమా!!

రం: బీడీ!!!

(రైలుకూత వినిపించింది. సందడి పెరిగి పోయింది.) ★

సినిమా

కృతజ్ఞతాంజలి

" అవకాశ మిచ్చి, నన్ను ప్రోత్సహించిన నిర్మాతలకు, ఆదరించి, దారిని చూపెట్టి, నటుడు గా నిలబెటిన దర్శకులకు, నాతో సహకరించి, తోడ్పడిన శారదోపాసకులకు పాటి నటీనటులకు, చలనచిత్ర కళ శాఖోప శాఖల కళాకారులకు, సాంకేతిక నిపుణ యూజ్ఞులకు నన్ను అభిమానించి, ఆదరించిన ప్రేక్షక లోకానికి ఇవే నా కృతజ్ఞతాభి వందనలు ఇందుకు చిహ్నప్రాయంగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పేదవిద్యార్థులకు సహాయం చేయడానికై నిధిని నెలకొల్ప కోరుతూ 25 వేల రూపాయలు సమర్పిస్తున్నాను" అన్నాడు అరవై చిత్రాల నటుడు శ్రీ నాగేశ్వరరావు కృతజ్ఞతాంజలి ఘటిస్తూ


నాగేశ్వరరావు మాటలలో, "నా జీవితానికి పండుగ" వంటిదైన ఈ ఉత్సవం కన్నులపండువగా, నిండుగా హుందాగా జరిగింది సభకు అధ్యక్షత వహించిన సంజీవరెడ్డిగారి మాటలలో "కళకళ' లాడింది స్వాగతం చెప్పిన నాగయ్యగారి మాటలలో, "సర్వతోముఖ ప్రాతినిధ్యంగల సమ్మేళనంగా" భాసించింది

వాహినీ సుడియోకు ఎదురుగా ఉన్న 24 ఎకరాల చిట్టడివిని, 'విజయా' ధిపతులు నాగిరెడ్డి చక్రపాణి పది రాత్రింబవళ్లలో మనోహరమైన ఉద్యానవనంగా 'తయారు' చేయించివేశారు అందులో చక్కని బాటలు వేయించారు ఒక సభామందిరం, ఇంకో విందుపందిరి అందంగా రూపొందించారు

చలనచిత్ర పరిశ్రమలోని చిన్నా, పెద్దా నగరంలోని అధికార అనధికార ప్రముఖులు, సుమారు నాలుగువేలమంది సభను అలంకరించారు మద్రాసు ప్రధాన న్యాయమూర్తి పి వి. రాజమన్నార్ ఆంధ్ర ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి, మద్రాసు ముఖ్యమంత్రి కె కామరాజ్, ఆంధ్ర కాంగ్రెసు అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరాజు, ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు డా॥వి ఎస్ కృష్ణ సభా వేదిక నలంకరించారు వారివెనుక, నాగేశ్వరరావుపాల్గొన్న చిత్రాల నిర్మాతలు 30 మంది కూర్చున్నారు

లీల, సుశీల, ఘంటసాల, జిక్కీలు 'వందే మాతరం' బృందగానం చేశారు అనంతరం నాగయ్యగారు స్వాగతం చెబుతూ ఒక నటుడు, నిర్మాతలకూ, ప్రజలకూ కృతజ్ఞత తెలపడానికి జరిగే ఈ ఉత్సవం విశిష్టమైనదని చలనచిత్ర ప్రపంచంలో ఇదే తొలిసారి అనీ అన్నారు

నాగేశ్వరరావును ఆశీర్వదిస్తూ, అతడు విద్యార్థి సహాయార్థం విరాళమిస్తున్నందుకు అభినందిస్తూ శ్రీయుతులు డా॥ రాధాకృష్ణన్ బూర్గుల రామకృష్ణరావు, వి వి గిరి, శ్రీ ప్రకాశ, ఆంధ్ర మద్రాసు రాష్ట్రాల మంత్రులూ, అఖిలభారత ఫిలింసమాఖ్య, ప్రభృతి చలన చిత్ర సంస్థలూ, వాంది బెంగాలీ చలన చిత్ర కళాకారులూ పంపిన



శ్రీనాగేశ్వరరావు చలనచిత్ర వజ్రోత్సవంలో లీల, జిక్కి, సుశీల, ఘంటసాల వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, సంజీవరెడ్డి, కామరాజు, వి యస్ కృష్ణ, అల్లూరి సత్యనారాయణగారలు - ముందున్నవి నిర్మాతలిచ్చిన షీల్డులు.

సందేశాలను శ్రీ ఎస్. బి. రామారావు పత్రికలకు చదివి వినిపించారు.

తరువాత నిర్మాతలకు రజతఫలకప్రదానం జరిగింది. తమిళ నటుడు శ్రీ జెమిని ఆర్. గణేష్ ఆయా చలనచిత్రనిర్మాణసంస్థల పేర్లను, వాటి అధిపతులపేర్లను చదివి, నాగేశ్వరరావు నటించిన చిత్రాల వివరాలను తెలియచేశారు.

నాగేశ్వరరావు వారందరికీ పుష్పహారాలు వేసి సత్కరించారు. ముఖ్యమంత్రి కామరాజ్ వారికిరజతఫలకాలను, అభినందనలను అందచేశారు. కీ. శే. ఘంటసాల రామయ్య కీ. శే. గూడవల్లి రామబ్రహ్మంగార్ల పేరిట రజతఫలకాలను సమర్పిస్తున్నపుడు నాగేశ్వరరావు, వారు తనపట్ల ఒకనాడు చూపినవాత్సల్యాన్ని వారిచ్చిన ప్రోత్సాహాన్ని ప్రస్తావించి శ్రద్ధాంజలి ఘటించారు.

అన్నిసంస్థలకన్న భరణీవారి చిత్రాల్లోనే నాగేశ్వరరావు పాల్గొన్నవి అధికం. (ఆరు) ఆయన ఈసంగతికూడా ప్రస్తావించి వారి అభిమానానికి కృతజ్ఞత తెలిపారు.

రజతఫలకాలను అన్నపూర్ణా ఫిలింస్ కళాదర్శకుడు ఎస్. కృష్ణారావు రూపొందించారు. రోజ్ వుడ్ పలకలమీద వెండితో అమరావతి స్తూపద్వారాన్ని పోశారు. దాని మధ్య నాగేశ్వరరావు వర్ణచిత్రం (ఎనామిల్ మీద), దానిపైన ఆయాసంస్థల చిత్రాలలో ఆయన పాల్గొన్నవాటి పేర్లూ పొందుపరచారు. స్తూపం పైభాగాన "నాగేశ్వరరావు చలన చిత్ర వజ్రోత్సవం" అని చెక్కించారు.)

అనంతరం ముఖ్యమంత్రి శ్రీ కామరాజ్, ప్రధాన న్యాయమూర్తి శ్రీ రాజమన్నారు, శ్రీ అల్లూరి సత్యనారాయణ, శ్రీ ఎస్. ఎస్. వాసన్ నాగేశ్వరరావును ఆశీర్వదిస్తూ శుభాకాంక్షలు తెలుపుతూ మాట్లాడారు. వినమ్రత అతని ఉత్తమ లక్షణాలలో ఒకటని ప్రశంసించారు.

తరువాత ఆంధ్ర విశ్వ విద్యాలయానికి విరాళం ఇరవైఅయిదువేల రూపాయల చెక్కును దంతపు పేటికలో ఉంచి విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు డా॥ వి. ఎస్. కృష్ణకు సమర్పించారు.

"డిగ్రీ సంపాదించాలనుకుని, అవకాశం లేనందువల్ల సాధ్యపడక అట్టి అవకాశం ఇతరులకు కల్పించాలన్న సంకల్పంతో—" అంటూ నాగేశ్వరరావు ఆవిరాళం అందచేశారు.

డిగ్రీ చదువుకు, మనిషి ప్రయోజకుడు అవడానికీ సంబంధం లేదు అన్న మాటమీద ఉన్న అభిప్రాయభేదాలసంగతి ఎలాఉన్నా మీరుమటుకు డిగ్రీ సంపాదించి ఉంటే, ఈరోజున మీకథ ఈదారిలో ఇంతవరకూ వచ్చేదికాదు, అన్నారు డా॥ కృష్ణనవ్వుతూ.

"ఇకపై, కళాకారులంతా నాగేశ్వరరావును సత్కార్యాన్ని ఆదర్శంగా తీసుకుని విద్యాభివృద్ధికి విరాళాలు ఇవ్వాలి. అలా ఇస్తే సంజీవరెడ్డిగారు ఎన్నిసార్లైనా సభలకు అధ్యక్షత వహిస్తారు" అన్నారు డా॥ కృష్ణ.

ఔను మరి అన్నట్లు తల ఊపారు ముఖ్యమంత్రి నవ్వుతూ.

తమిళనటుడు శ్రీ శివాజీ గణేశన్ ఈ ఉత్సవం ఇంత జయప్రదంగా జరగడానికి తోడ్పడ్డవారందరికీ పేరు పేరునా కృతజ్ఞతాభివందనాలర్పించారు.

* * *

సభకు ముందు సంగీతపు విందు (సత్యం బృందం షెహనాయి), తేనీటి విందూ జరిగాయి. సభ తరవాత, చాందినీలు కట్టి అందంగా అలంకరించిన పందిరిలో, భోజనాలు ఏర్పాటుచేశారు.

విందుతరవాత అంతా వెండి తెరముందు కూర్చున్నారు.

అపుడు "చిత్రమాల" ప్రదర్శనం జరిగింది. నాగేశ్వరరావు పాల్గొన్న చలనచిత్రాలలో కొన్ని కొన్ని మంచి సన్నివేశాలను ఏరి కూర్చిన చిత్ర ఖండాల హారం ఇది. (ఈ కార్యాన్ని దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు నిర్వహించారు).

సీతారామ జననంలో పదహారేళ్ళ బాలా కుమారుడుగా కనబడ్డ నాగేశ్వరరావును అతని అప్పటి నటనను చూస్తూ ఒక్కొక్క చిత్రంలో విగ్రహస్ఫూర్తిలో, నటనలో అతని యాత్రను గమనిస్తూ ఆనందిస్తున్న నాలుగు వేలమంది ప్రేక్షకులు 'దేవదాసు' చిత్రంరాగానే ఒకసారి, కాగానే ఒకసారి రెండు నిముషాలసేపు ప్రశంసాపూర్వకంగా కరతాళ ధ్వనులుచేశారు...

మరొక్క విషయం.

ఈ చిత్రమాల కేవలం ఒక్క నాగేశ్వరరావు కథేకాదు. దక్షిణ భారత చలనచిత్రాల పురోగమన యాత్ర కథ.

వేషభాషలలో నటనలో చిత్ర కళాశిల్పంలో మన చలన చిత్రకళ పదేళ్ళలో పొందిన మార్పులకథ...

ఈచక్కని కథను ఇంత చక్కగా సమకూర్చి సెల్యులాయడ్ మీదకు ఎక్కించినందుకు నాగేశ్వరరావు ఈ విధంగా కూడా అభినందనీయుడయాడు. ★

శ్రీ కామరాజనాడారు, శ్రీ నాగేశ్వరరావు తరఫున ఈ క్రింది నిర్మాతలకు షీల్డులు బహూకరించారు: శ్రీయుతులు ఘంటసాల కృష్ణమూర్తి (ప్రతిభ) కె. రామకృష్ణప్రసాద్ (శారదా ప్రొడక్షన్స్), పి. ఎస్. రామకృష్ణారావు (భరణి), మీర్జాపురం రాజా (శోభనాచల), ఆర్. పద్మనాభన్ (పద్మనాభా ఫిలింస్), బి. ఎ. సుబ్బారావు (బి. ఎ. ఎస్.), కస్తూరి శివరావు (ఎలైడ్ పిక్చర్స్), సి. వి. రంగనాధదాస్ (సాధన), కె. బి. నాగభూషణం (శ్రీ రాజరాజేశ్వరి) ఎ.వి. మెయ్యప్పన్ (ఎ. వి. ఎం.), పి. ఆదినారాయణరావు (అశ్వని), డి. ఎల్. నారాయణ (వినోదా), సి. కె. సి. చెట్టియార్ (జ్ఞానాంబిక) పి. ఆదినారాయణరావు (అంజలీ పిక్చర్స్), కె. ఎస్. ప్రకాశరావు (ప్రకాష్ స్టుడియో), లక్ష్మీనారాయణ (అజంతా), దోనేపూడి కృష్ణమూర్తి (గోకుల్), గోపాలరావు (జనత), కె. గోపాలరావు (అశ్వరాజ్) చక్రపాణి (విజయా ప్రొడక్షన్స్), పి. పుల్లయ్య (రాగిణి) వై. రామకృష్ణప్రసాద్ (సారధీఫిలింస్) డి. మధుసూదనరావు (అన్నపూర్ణా పిక్చర్స్), బి. ఎస్. రంగా (విక్రం), వెంకటేశన్ (వరుణా), ఎ. ఆనంద్ (లక్ష్మి), ఎస్. శంకరరెడ్డి (లలితాఫిలింస్), ఎస్. ఎస్. వాసన్ (వరలక్ష్మి ఫిలింస్), ఎం. ఎల్. పతి (జైశక్తి), పి. చెంగయ్య (చందమామ). నాగేశ్వరరావు పాల్గొన్న తొలిచిత్రం "ధర్మపత్ని" చిత్రం నిర్మించిన ఫేమస్ ఫిలింస్ తరఫున ఫిలింసెంటర్ అధిపతి శ్రీ మజీద్ ఫలకాన్ని అందుకున్నారు.

బొంబాయి సినిమా లేఖ

కార్లవీవారి జెకొస్లొవాకియా చలనచిత్రోత్సవంలో రాజ్ కపూర్ చిత్రం "జాగ్ తే రహో" ప్రథమ బహుమతి గడించుకుంది తూర్పుయూరప్ ఉత్సవంలో మన దేశం ఇలా ప్రథమ బహుమతి సంపాదించడానికి ఇదే తొలిసారి ప్రపంచ చలనచిత్ర సమాఖ్యవారు గతసంవత్సరమే ఈ "కార్లవీవారీ" ఉత్సవాన్ని అధికారరీత్యా గుర్తించి బెర్లిన్, వియన్నా, కాన్స్ నగరాలలో ఏటా జరిగే అంతర్జాతీయ ఉత్సవాల స్థాయికి తెచ్చారు

ఇక్కడ ఈ చిత్ర విజయం రాజ్‌కపూర్ వ్యక్తిగత విజయం అనవచ్చు దీని ద్వారా అంతర్జాతీయ ఖ్యాతిం ప్రపంచంలో అతడు మన దేశం కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడించడానికి తోహదం చేశాడు

"జాగ్ తే రహో" చిత్రానికి రచన దర్శకత్వం అమిత్ మిత్ర, శంభుమైత్రాలు నిర్వహించారు

* * *

భారత రష్యాల సంయుక్త చిత్రం "పరదేశీ"లో నటిస్తున్న నర్గీస్ మాస్కోనుండి మొన్ననే తిరిగివచ్చింది, అక్కడ సగం పని పూర్తి అయింది ఆమె సకాలంలో వెళ్ళినా, కొందరు భారతీయనటులు అక్కడికి చేరడం కొంత ఆలస్యం అయినందువల్ల వెళ్ళిన వారం పదిరోజులవరకూ నర్గీస్ విశ్రాంతితీసుకుంటూ ఉంది

మాస్కోలో ఆబాలగోపాలం అభిమానించే భారతీయ నటి నర్గీస్

ఒక ఏడేళ్ళపిల్ల రోజూ ఓ పూలగుత్తి పట్టుకుని వచ్చి నర్గీస్ హోటలు వదలి వెళ్ళేటప్పుడు ఆమెకు ఇచ్చి చక్కా వెళ్ళేది నర్గీస్ ఏరోజు ఉదయం ఎన్ని గంటలకు బయలుదేరుతుందో ఆ పిల్ల ముందే తెలుసుకొని ఆవేళకు పూలగుత్తితో సిద్ధమయేది

ఆమె బొంబాయి బయల్దేరే రోజున వందమంది యువతులు ఆమెకు పుష్పగుచ్ఛాలిచ్చి వీడ్కోలు చెప్పారు

* * *

అక్కడ పదిరోజులు సెలవు సంపాదించిన నర్గీస్‌కు బొంబాయిలో మరో వారం విశ్రాంతి దొరికింది జులై 28న ఆమె బొంబాయి వచ్చింది రాగానే ఆమె నటించే కొత్త చిత్రం 'అదాలత్' షూటింగ్ ఆరంభం కావలసివుంది తీరా ఈమె వచ్చేసరికి అదివాయిదాపడి వారంరోజులు కులాసాగా కాలక్షేపం చేసే వీలుకలిగింది.

అలా అని నర్గీస్ పనీపాటూ లేకుండా కూర్చోలేదు ఆమెను బుక్ చేసుకోవాలని అభిలషించిన నిర్మాతలను పిలిచి వారు తయారు చేసుకున్న కథలన్నీ (చాలా ఉన్నాయి) ఆలకించింది చివరికి, వాటిలో రెండు కథలు బాగున్నాయని ఆ చిత్రాలలో నటించడానికి కాంట్రాక్టు వ్రాసింది

దేవానంద్ నర్గీస్ చిత్రం

ఆ రెండిటిలో ఒకటి మోహన్ సెహగాల్ చిత్రం అందులో ఆమె బల్‌రాజ్ సాహ్నీతో నటిస్తుంది మరొకటి పుష్పా పిక్చర్స్ అనే కంపెనీ చిత్రం అందులో కూడా ఆమె నాయకుడు బల్‌రాజ్ సాహ్నీయే ఈ రెండూ కాక దేవానంద్‌తో మరో చిత్రంలో నటించ నిశ్చయించుకుంది

"ఇంకొక్క చిత్రానికే కాంట్రాక్టు ఇస్తాను ఆపైన అంతే" అంది నర్గీస్

* * *

జులై 28న నర్గీస్ మాస్కోనించి బొంబాయి రాగా ఆరోజునే నాట్యతార పద్మిని మద్రాసునుండి మాస్కో బయలుదేరింది మాస్కోలో జరిగే యువజనోత్సవంలో పాల్గొని అక్కడామె నృత్య ప్రదర్శన లిస్తుంది


అక్కడనుండి ప్రాగ్ నగరం వెళ్ళి, అక్కడ రాజ్‌కపూర్‌ను కలుసుకుంటుంది

పద్మినివెంట ఆమె చెల్లెలు రాగిణి, తల్లి సరస్వతీఅమ్మకూడా మాస్కో వెళ్లారు ★

(ఆంధ్ర వారపత్రిక బొంబాయి విలేఖరి)



'పాయల్' లో నర్తకి పద్మిని



అనుపమా వారి కొత్తచిత్రం "ఎం ఎల్ ఏ"లో జగ్గయ్య, రామకోటి, కొత్తనటుడు రమణమూర్తి, సావిత్రి, పెరుమాళ్లు

★ సినిమా వార్తలు ★

ఇద్దరు కొత్తనటులు

అచిరకాలంలోనే ఇద్దరు కొత్తనటులు, తెలుగు తెర ప్రేక్షకులకు పరిచితులు కాబోతున్నారు.

ఇందుకు పూనుకొన్న సంస్థలలో ఒకటి సారథీ ఫిలింస్ ఈ సంస్థ అధిపతి శ్రీరామకృష్ణప్రసాద్ తమ కొత్తచిత్రంలో (ఇంకా పేరుపెట్టలేదు) ప్రధాన పాత్రను శ్రీ మన్నవ బాలయ్య అనే కొత్తనటుడికి ఇచ్చారు ఈయన గుంటూరు జిల్లాకు చెందినవాడు 'బి ఇ' చదువుతున్నాడు

గ్రామీణ జీవితాన్ని ప్రతిబింబించే ఇతివృత్తంగల ఈ చిత్రానికి శార్ల చిరంజీవి సంభాషణలు వ్రాస్తున్నారు తాపీ ధర్మారావు, కొసరాజు పాటలు వ్రాస్తున్నారు దర్శకుడు తాపీ ("రోజులుమారాయి" "పెద్దరికాలు") చాణక్య

ఇందులో అంజలి, లక్ష్మీరాజ్యం, రేలంగి, గుమ్మడి సి ఎస్ ఆర్, వల్లం ("అంతా మనవాళ్ళే") నరసింహారావు ప్రభృతులు పాల్గొన్నారు సంగీతదర్శకుడు వేణు

ఈ చిత్రానికి ఒక సెట్‌పై పని పూర్తి అయింది

కొత్త నటుడికి అవకాశమిచ్చిన మరొక సంస్థ అనుపమ ఫిలింస్ ఆయన పేరు శ్రీ రమణమూర్తి శ్రీకాకుళం జిల్లాకు చెందినవాడు పట్టభద్రుడు (బి ఎస్ సి) నాటకరంగంమీద పేరు తెచ్చుకున్నాడు 1955లో హైదరాబాద్‌లో జరిగిన 19వ ఆంధ్ర నాటకకళాపరిషత్ నాటకోత్సవాలలో ఉత్తమనటుడుగా ఎన్నికై బహుమతి నందుకున్నాడు

ఇపుడు అనుపమ ('ముద్దుబిడ్డ'), ఫిలింస్ వారి సాంఘిక చిత్రం 'ఎం ఎల్ ఏ'లో ఇతడు ఒక ప్రముఖ భూమిక (రెండవ నాయకుడు) నిర్వహిస్తున్నాడు

శ్రీ తిలక్ దర్శకత్వాన తయారవుతున్న ఈ చిత్రంలో జగ్గయ్య, గుమ్మడి, పెరుమాళ్లు, రమణారెడ్డి, చదలవాడ, సావిత్రి గిరిజ, సూర్యకళ మొదలగువారు నటిస్తున్నారు

ఈ చిత్రం నిర్మాణం సగంవరకూ పూర్తి అయింది

* * *

శారదా ప్రొడక్షన్స్ వారి "జయభేరి" శ్రీ పి పుల్లయ్య దర్శకత్వాన చురుకుగా తయారవుతోంది అంజలి, నాగేశ్వరరావు నాగయ్య ప్రభృతులు పాల్గొంటారు

సంగీతరసప్రధానమైన ఈ చిత్రానికి మల్లాది రామకృష్ణశాస్త్రి పాటలు వ్రాస్తున్నారు. సంగీత దర్శకుడు ఘంటసాల సంభాషణలు ఆచార్య ఆత్రేయ వ్రాస్తున్నారు

* * *

విక్రం (తెనాలి రామకృష్ణ) ప్రొడక్షన్స్ వారి సాంఘిక చిత్రం 'కుటుంబ గౌరవం' (రైతురాజా అన్న పేరు మార్చారు) విక్రం



చెన్నపురి ఆంధ్రమహాసభ వారు జూలై 21-న ప్రదర్శించిన "బాలనాగమ్మ" నాటకంలో ముఖ్యపాత్రధరించిన శ్రీమతి కమలాదేవి బిలియర్డ్స్ ఆటలో కూడా మంచి నేర్పరి.

స్టుడియోలో తయారవుతూంది. సావిత్రి, రామారావు, బాలకృష్ణ, పద్మనాభం, దొరస్వామి ప్రభృతులు నటిస్తున్నారు. రచన అనిసెట్టి సుబ్బారావు. సంగీతం విశ్వనాథం, రామమూర్తి. దర్శకుడు బి. ఎస్. రంగా.

ఈ చిత్రం నాలుగు సెట్లపై పనిపూర్తి అయింది.

*   *   *

ప్రభా ప్రొడక్షన్స్‌వారి సాంఘికం, 'ఆడపెత్తనం', ఆదుర్తి (తోడికోడళ్లు) సుబ్బారావు దర్శకత్వాన తయారవుతోంది. అంజలి, నాగేశ్వరరావు, సుమ్మడి, రేలంగి, రమణారెడ్డి, సూర్యకాంతం, అమ్మాజీ మొదలగువారు పాల్గొంటున్నారు. రచన శ్రీనికొట్టి శ్రీరామమూర్తి.

*   *   *

విజయవారు తమ కొత్త చిత్రం "అప్పుచేసి పప్పుకూడు"లో ఒక కొత్త నటుడికి అవకాశ మిచ్చారు. పేరు ప్రసాద్. విజయవాడవాస్తవ్యుడు. కొన్నాళ్ళక్రితం మద్రాసులో ఒక నాటకంలో అతడు ఒక హాస్యపాత్రను చక్కగా ఒప్పించి ప్రశంసలూ, ఆతరవాత ఈ చిత్రంలో నటించే అవకాశమూ సంపాదించుకున్నాడు.

మాస్కో ఉత్సవంలో "రోజులు మారాయి" చిత్రం

ప్రపంచ విద్యార్థి యువజనోత్సవ సందర్భంగా, గతవారం మాస్కోలో ఆరంభమైన అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో సారథివారి "రోజులు మారాయి" చిత్రాన్ని ప్రదర్శిస్తున్నారు.

గ్రామీణ జీవితాన్ని, అక్కడి సమస్యలను, వాటి పరిష్కార మార్గాలను చిత్రిస్తూ నిర్మించిన ఈచిత్రం బహుళ జనాదరణను పాత్రమైంది. ఆంధ్ర దేశంలో రజతోత్సవాలు జరుపుకుంది. తరువాత ఢిల్లీ తమిళంలో పునర్నిర్మించారు. అదికూడా తమిళనాడులో శతదినోత్సవాలుజరుపుకొంది. శ్రీ తాపీ చాణిక్య ఈ చిత్రం దర్శకుడు.

ఇప్పుడు తెలుగు చిత్రాన్ని, ఈ అంతర్జాతీయ ఉత్సవంకోసం సంక్షిప్తీకరించి, దానికి ఆంగ్లంలో వ్రాసిన సంభాషణలు జోడించి పంపారు.

"రోజులు మారాయి" చిత్రంలో షావుకారు, నాగేశ్వరరావు, సి. ఎస్. ఆర్. సెట్టమూర్తి, వి. నరసింహారావు, రమణారెడ్డి ప్రభృతులు పాల్గొన్నారు.

తమిళచిత్రం "కాలం మారిపోచ్చి"లో అంజలీదేవి, జెమినీ గణేశ్, బాలయ్య, దొరైరాజ్, తంగవేలు, ఎస్. వి. సుబ్బయ్య నటించారు.


సంగీత దర్శకుడు వేణు. ★

రెండు పౌరాణికాలు

సుబ్బి కర్నాటక ప్రొడక్షన్స్‌వారు "దశావతారాలు", "దక్షయజ్ఞం" అనే రెండు చిత్రాలను తెలుగు, కన్నడ భాషలలో నిర్మించబోతున్నారు. నిర్మాణం ఏ. వి. ఎం. స్టుడియోలో జరుగుతుంది. ★



"విక్రమ్ ప్రొడక్షన్స్‌వారి" కుటుంబగౌరవం"లో సావిత్రి, రామారావు



జూలై 21 న మద్రాసులో విజయవారి "మాయా బజారు" చిత్రం రజతోత్సవాలు జరుపుకున్న సందర్భంలో గుంటూరు 'న్యూసిటీ టాకీస్" అధిపతి సి బి నయ్యర్ స్థానికంగా సభజరిపి విందుచేశారు.

'మాయాబజార్' శతదినోత్సవాలు

విజయా ('పెళ్ళిచేసిచూడు','మిస్సమ్మ') ప్రొడక్షన్సువారు శ్రీ కె వి రెడ్డి దర్శకత్వాన నిర్మించిన "మాయాబజార్" తెలుగు తమిళ చిత్రాల శతదినోత్సవాలు జూలై 31 న చందమామ భవనం ఆవరణలో జరిగాయి సభకు జెమినీ అధిపతి శ్రీ ఎస్ ఎస్ వాసన్ అధ్యక్షత వహించారు ఏ వి ఎం అధిపతి శ్రీ ఏ వి మెయ్యప్పన్ ఈ చిత్రాలలో పాల్గొన్న తెలుగు తమిళ నటీనటులకూ, టెక్నీషియన్లకూ, వీటిని విడుదలచేసిన సంస్థలకూ, ఆయా థియేటర్ల యజమానులకూ రజత ఫలకాలిచ్చి గౌరవించారు

'విజయా'ధిపతి శ్రీ నాగిరెడ్డిమాట్లాడుతూ ఈ చిత్రం విజయవంతం కావడానికి ఈ సంస్థలో పనిచేస్తున్నవారంతా సంపూర్ణంగా సహకరిస్తూ కృషిచేయడమే కారణమని అన్నారు

"ఇందులో పనిచేస్తూన్నవారే నా ఆస్తి, వారిదే ఈ బలం" అన్నారు నాగిరెడ్డి

అనంతరం, విజయాప్రొడక్షన్సు సంస్థలో పనిచేసే ఉద్యోగులకు నాలుగునెలల జీతం బోనసుగా ఇస్తున్నట్లు మేనేజరు శ్రీ ఎన్ సి సుబ్రహ్మణ్యం ప్రకటించారు ఈ చిత్రం శతదినోత్సవాలు జరుపుకున్న థియేటర్లలో సిబ్బందికి ఒకనెల జీతం బోనసు ఇస్తూన్నట్లు కూడా ప్రకటించారు

అనంతరం నటీనటులు కృతజ్ఞత తెలుపుతూ మాట్లాడారు

మాయాబజార్ తెలుగు చిత్రంలో నాగేశ్వరరావు, రామారావు, రేలంగి, రంగారావు, గుమ్మడి, ముక్కామల, సి ఎస్ ఆర్ ఆర్ నాగేశ్వరరావు, నాగభూషణం, మిక్కిలినేని, వంగర, రమణారెడ్డి, నల్లరామమూర్తి, రామలింగయ్య, బాలకృష్ణ, కుటుంబరావు సత్యం, సావిత్రి, సూర్యకాంతం, ఋష్యేంద్రమణి, ఛాయాదేవి పాల్గొన్నారు

రచయిత పింగళి నాగేంద్రరావు.

తమిళచిత్రంలో జెమినీ గణేశన్, రంగారావు, తంగవేలు, నంబియార్, ప్రభృతులు పాల్గొన్నారు రచయిత తంజై రామయ్యదాస్

దర్శకుడు కె వి రెడ్డి ఛాయాగ్రహణం మార్కస్ బార్ట్లే, శబ్దగ్రహణం ఎస్ కృష్ణన్ వల్లభజోస్యుల శివరాం, కళాదర్శకులు మాధవపెద్ది గోఖలే, కళాధర్, నృత్యదర్శకుడు పసుమర్తి కృష్ణమూర్తి, ఎడిటింగ్ జంబులింగం, అలంకరణ పీతాంబరం, చిత్రరచన కె ఎస్ ఎన్ మూర్తి ★

అంటార్కిటికాలోని అమూల్య జీవకోటి

(31-వ పేజీ తరువాయి)

చేస్తాయి.

వెడెల్ సీల్స్

వెడెల్ సీల్స్ అనేరకం జంతువులకు కొన్ని అపూర్వలక్షణాలున్నాయి. ఇవి మంచు అడుగున శీతకాలపు రాత్రిళ్ళు కటిక చీకటిలోనైనా దారికనుక్కొని ప్రయాణం చేయగలవు. ఎలా తెలుస్తుందో వాటికి, ఎక్కడెక్కడ చేపలగుంపు లుంటాయో అక్కడక్కడికి సూటిగాపోయి మింగేస్తాయి. మంచు అట్టడుగున తిరుగుతూ, ప్రతి 15 నిమిషాలకీ సరిగ్గా ఎక్కడ రంధ్రాలు ఉన్నాయో అక్కడికిపోయి గాలిపీల్చుకుని మళ్ళీ తమ దారిన తాము పోతూవుంటాయి. ఎక్కడ రంధ్రా లున్నదీ అవి ఒకసారి చూసి గుర్తుపెట్టుకుంటాయని కాదు. మనం ఒకచోట మంచులో పెద్ద రంధ్రంచేస్తే కాసేపటికల్లా అక్కడొక సీల్ మంచు అడుగునించి తయారవుతుంది.

గబ్బిలాలు రాత్రిళ్ళు ప్రతిధ్వనినిబట్టి దారి కనుక్కుంటాయి. ఈ సిద్ధాంతం జలాంతర్గాములను కనిపెట్టి భగ్నంచేయడానికి యుద్ధాల్లో ఉపయోగపడుతోంది. అదేవిధంగా సీల్స్ మంచుఅడుగున చీకట్లో దారి ఎలా కనుక్కుంటాయో తెలిస్తే ఆ సిద్ధాంతం మనకు శాంతికాలంలోనూ, యుద్ధకాలంలోనూ కూడా ఉపయోగపడవచ్చు.

అంటార్కిటిక్ సముద్రంలోని అనంతమైన జీవకోటివలన అనేక అమూల్య పరిశోధనలు జరగడానికి వీలున్నది. ఆ సముద్రంలో కొన్నిచోట్ల లోతు రాత్రి ఒకరకంగాను, పగలు ఒక రకంగాను ఉంటున్నట్లు అమెరికన్ నావికులు కనుక్కున్నారు. పగలు 1800 అడుగులు లోతుఉంటోంది. రాత్రి నేలమట్టం పైకి వచ్చేస్తోంది. ఈ మట్టం సమంగానే ఉందిగాని మిట్టపల్లాలుగా లేదు. దీన్నిబట్టి అక్కడ చేపలు, పురుగులు, మొక్కలు దట్టంగా కట్టకట్టుకుపోయి ఉండవచ్చునని, ఆ చేపలు, పురుగులు వగైరా ప్రాణికోటి పగటిపూట సూర్యరశ్మికి జడిసి లోతుకుపోయి, రాత్రిళ్ళ పైకి వస్తుందని శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు.

అక్కడ జీవశాస్త్ర పరిశోధనలు చేయడానికి చాలా అవకాశా లున్నాయి. బహుశా కొత్త రకాల ఔషధాలు, ఆహారం లభించవచ్చు. వివిధ శాస్త్రాలలో పరిశోధనలకు, ప్రయోగాలకు అంటార్కిటికా ప్రకృతి సిద్ధమైన పరిశోధనాలయం లాంటిది.

★

విక్రమార్కుడి మార్కు సింహాసనం

(12-వ పేజీ తరువాయి)

ఆపేశావని నిరుత్సాహంగా ఉందా?"

"మీ రింకా మొదలెట్టలేదుగా" అనుకుంటూ, "ఔను మరే" అంటూ నవ్వాడు రాజా.

రైలాగింది. రాజా మరచెంబు పట్టుకు వెళ్ళాడు కాఫీకోసం.

బీదలకు అంబలిదానము చేస్తున్నవాడి తరవాలో అక్కడి హోటేలువాళ్లు చాలా తీవిగా చిరాగ్గా. సరుకు లమ్ముతున్నారు.

తను తిని. గురూజీకి ఫలహారం కట్టించే వరకు రైలు కూతకూసింది. ఉరకలూ పరుగులుగావచ్చి పెట్టెలో కెక్కిపోయాడురాజా.

నరసన్న లేడు.!

ఏడీ! నరసన్న! అని ఆశ్చర్యపడ్డాడు. రాజా.

"అన్నా నరసన్నా లేవా ఇకలేవా" అనే పాట పాడబోయి, ఈలోగా వచ్చేస్తాడేమోనని ఓ క్షణం తటపటాయించాడు రాజా.

"మీ బాబాయిగారు అర్జెంటుగా రైలు దిగి వెళ్ళారండి ఎవరో ఫ్రెండు కనబడితేను" అన్నాడు అసింటా కూచున్న రైల్వే బైరాగి లాలనగా నవ్వుతూ.

"మా బాబా యెవడు? మధ్య నువ్వేడు? అంటూనే అప్రయత్నంగా వంగి బల్లకిందకి తొంగి. చూచాడురాజా.

పెట్టె గల్లంతు!

"హారినీ!" అన్నాడు రాజా హడావుడిగా.

"ఆయన మీ బాబాయికాదా? నేఅనుకున్నానండి. ఆ హడావుడి చూసి. పాపం మీ పెట్టె తీసుకుపోయి ఆయింది వదిలేశాడు కాబోలు. ఆ పక్కకి చూడండి" అన్నాడు బైరాగి.

దానికి తాళం గీళం లేవు. రాజా ఆ పెట్టె తెరిచాడు.

సుమారు రెండువీశల న్యూస్ పేపర్లూ, రెండు మూడు కాళీసీసాలూ అందులో ఉన్నాయి.

రాజాకి నోట మాటరాలేదు. 'కథన్నా పూర్తిచెప్పివిగాదు నరసన్నా' అన్నాడు మెల్లిగా.

'ఆయన చెబుతున్న కథ ఏమిటండి?' అన్నాడు రైల్వే బైరాగి.

"లోకరాసురోపాఖ్యానంట." అంది రాజునోరు; నీకెందుకు అన్నాయి. అతని నొసలు.

"అదే ఇది" అన్నాడు బైరాగి బీడీ ముట్టిస్తూ

★

ఇంకా వుంది.

కొత్తరకం తెలుగు టైప్‌రైటర్

(5-వ పేజీ తరువాయి)

త్రం, తత్సంబంధమైన ఇతర యంత్ర సాధనాల విషయంలో ఇంకా పరిశోధన సాగిస్తూనే ఉన్నాడు.

తెలుగుముద్రణ విషయంలోకూడా పరిశోధన జరుపుతున్నాడు. చేతితో అక్షరాలు కంపోజుచేసే ముద్రణాలయాలలో ఉండే తెలుగు అక్షరాల కేసులకు మామూలుగా దాదాపు 700 ముద్రలుంటాయి. వాటిని 300 కు తగ్గించవచ్చునని శ్రీ రావు సూచించాడు. మోనో టైపు కాస్టింగ్ విధానంలో కూడా కొన్ని మార్పులను సూచిస్తున్నాడు. వీటవల్ల అనేక భారతీయ భాషల ముద్రణ విషయంలో ప్రగతిని సాధించగల అవకాశం కలుగుతుంది.

రాజమహేంద్రవరంలో శ్రీ పిఠాపురం కుమారరాజాగారు ఏర్పరచిన టైపురైటింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థిగా చేరిన నాటి నుంచే శ్రీ రామచంద్రరావుకు వీటిపట్ల ఆసక్తి కలిగింది. ప్రస్తుతం వాడుకలో ఉన్న తెలుగు టైపు మిషన్ కీబోర్డును కనిపెట్టి, తయారుచేయించింది శ్రీ పిఠాపురం కుమార రాజాగారే.

1940 సంవత్సరంలో తెలుగు టైపు హైయ్యరు పరీక్షలకు కూర్చొన్న మొదటి జట్టు విద్యార్థులలో శ్రీ రామచంద్రరావు ఒకడు. ఆసందర్భంలో రాజమండ్రి ట్విన్ ఆర్ట్స్ అసోసియేషన్ వారు శ్రీ రావు టైపులో సాధించిన వేగానికి ప్రశంసా చిహ్నంగా ప్రథమబహుమానం ఇచ్చారు.

రాజమండ్రిలో విద్యార్థిగా ఉన్నప్పటి నుంచి కూడా శ్రీ రామచంద్రరావు ప్రస్తుతం వాడుకలో ఉన్న టైపు యంత్రంలో గల లోపాలను గురించి, చేయదగు మార్పులనుగురించి సదా ఆలోచిస్తూనే ఉన్నాడు. శ్రీ రావు మద్రాసు ఆలిండియా రేడియో కార్యాలయంలో తెలుగు టైపిస్టుగా మొట్టమొదటగా చేరాడు. ఆతరువాత అమెరికా సమాచార కార్యాలయంలో ఉద్యోగంలో చేరి పనిచేస్తున్నాడు. అప్పటినుంచి తన తీరికసమయాలలో ఈ పరిశోధనకృషి సాగిస్తున్నాడు. అమెరికా సమాచార కార్యాలయంలో ఉద్యోగం చేసుకుంటూనే, ఈ పరిశోధన చేస్తూనే ప్రయివేటుగా పరీక్షకు కూర్చుని శ్రీ రావు బి. ఏ. డిగ్రీ సంపాదించారు. శ్రీ రావులో గల అసాధారణ మేధాశక్తులకు ఇది మరొక నిదర్శనం.

★

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at the Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad



మహాశివుడు

ఫొటో ఎ వి. వి నరసింగరావు—కర్నూలు